RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in



30 మే 2025 శుక్రవారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:309

## మేము మోదీకి వీరతిలకం దిద్ది పంపితే ఆయన యుద్ధం మధ్యలో ఆపేశారు : సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధిమే 29**దేశ భద్రత విషయంలో రాజకీయాలకు తావులేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సైన్యం విజయవంతంగా ఆపరేషన్ సిందూర్ నిర్వహించిందని కొనియాడారు. ఏఐసీసీ ఆదేశం మేరకు మేడ్చల్‌లో నిర్వహించిన జైహింద్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పహల్గాంలో ఉగ్రవాదులు అమాయకులను పొట్టనపెట్టుకున్నారని, సైన్యానికి మద్దతుగా జైహింద్ ర్యాలీలు నిర్వహించాలని ఏఐసీసీ ఆదేశించిందని, ఖర్గే, రాహుల్ ఆదేశాలతో జైహింద్ ర్యాలీ నిర్వహించామని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఇవాళ సీఎంగా మీముందు ఉన్నానంటే అది మల్కాజ్‌గిరి ప్రజల చలవేనని అన్నారు. రాజకీయాలకు అతీతంగా ఆపరేషన్ సిందూర్‌కు మద్దతు ఇచ్చామని, ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా నెక్లెస్ రోడ్డులో ర్యాలీ చేశాని తెలిపారు. మేము మోదీకి వీరతిలకం దిద్ది పంపితే ఆయన యుద్ధం మధ్యలో ఆపేశారు పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పాలని మోదీకి మద్దతు తెలిపామని, 4 రోజుల యుద్ధం తర్వాత ఏం జరిగిందో తెలియదని, యుద్ధం ఆపేశారని అన్నారు. ట్రంప్ మీడియా ముందుకు వచ్చి యుద్ధం ఆపానని ప్రకటించారని గుర్తు చేశారు. యుద్ధం ఆపే విషయంలో అఖిలపక్షంతో ఎందుకు చర్చించలేదని ప్రశ్నించారు. గుండెల్లో ధైర్యం ఉన్న నాయకుడే యుద్ధాన్ని గెలిపిస్తాడని, గతంలో ఇందిరాగాంధీ చైనాను మోకాళ్లపై కూర్చోబెట్టారని అన్నారు. గాల్వాన్‌లో మన కర్నల్ సంతోష్‌ను చైనా పొట్టనపెట్టుకుంటే ఏమీ చేయలేకపోయామని, 1971లో అమెరికా అండతో పాకిస్థాన్ మనపై యుద్ధానికి వచ్చిందని, అమెరికా అధ్యక్షుడు యుద్ధం ఆపాలని ఇందిరను బెదిరించారని, ఆ బెదిరింపులకు లొంగలేదని తెలిపారు. ఉక్కు మహిళ ఇందిరాగాంధీ పాక్‌ను ఓడించి ఆ దేశాన్నే రెండు ముక్కలు చేశారని అన్నారు. యుద్ధంలో పాక్ సైన్యం 36 మందిని చంపితే కేంద్రం ఏం చేసిందని సీఎం ప్రశ్నించారు. ట్రంప్ బెదిరిస్తే మోదీ యుద్ధం ఆపేశారని ఆరోపించారు. మేము మోదీకి వీరతిలకం దిద్ది పంపితే ఆయన యుద్ధం మధ్యలో ఆపేశారని, ట్రంప్ బెదిరించినప్పుడు అఖిల పక్షాన్ని ఎందుకు పిలిచి మాట్లాడలేదని అడిగారు. యుద్ధ విరమణతో 140 కోట్ల ప్రజల ఆత్మగౌరవాన్ని ట్రంప్ కాళ్ల ముందు తాకట్టు పెట్టారని, పీవోకేని లాక్కోమన్నామని, బలూచిస్థాన్‌ను విడగొట్టమన్నామని అన్నారు. పాక్ నుంచి బలూచిస్థాన్‌ను విడగొట్టే ధైర్యం లేదని, యుద్ధంలో పాకిస్థాన్ ఎన్ని రఫేల్ విమానాలను కూల్చిందో లెక్క చెప్పాలని ప్రశ్నించారు. వేల కోట్ల కాంట్రాక్టులు కావాల్సిన వాళ్లకు ఇచ్చుకున్నారని అన్నారు. రఫేల్ యుద్ధ విమానాలు ఎందుకు నేలకూలాయో చెప్పాలని అన్నారు. సైనికుల ఆత్మస్థైర్యాన్ని బీజేపీ ప్రభుత్వం దెబ్బతీసిందని తెలిపారు. సైనికులకు అండగా నిలిచేందుకే జైహింద్ ర్యాలీ చేశామని అన్నారు. సొంత ఇళ్లు లేని నాయకుడు రాహుల్‌గాంధీ అని, మోదీ కాలం చెల్లిన రూపాయి.. రద్దయిన వెయ్యి నోటు అని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ నాయకత్వం దేశానికి అవసరమని, రాహుల్ ప్రధానిగా ఉండి ఉంటే పాక్‌ను రెండు ముక్కలు చేసేవారని అన్నారు. రాహుల్ ప్రధానిగా ఉండి ఉంటే పీవోకేను లాక్కొనేవారని, మనమందరం కలిసి రాహుల్‌గాంధీని ప్రధానిని చేయాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ యుద్ధంలో దేశాన్ని గెలిపించరని, రాహుల్ ప్రధాని అయితేనే పాక్, చైనాను ఓడించగలమని అన్నారు.

"యుద్ధంలో పాక్ సైన్యం 36 మందిని చంపితే కేంద్రం ఏం చేసింది?. పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పాలని మోదీకి మద్దతు తెలిపాం. 4 రోజుల యుద్ధం తర్వాత ఏం జరిగిందో తెలియదు.. యుద్ధం ఆపేశారు. రాహుల్ ప్రధానిగా ఉండి ఉంటే పాక్‌ను రెండు ముక్కలు చేసేవారు. రాహుల్ ప్రధానిగా ఉండి ఉంటే పీవోకేను లాక్కొనేవారు."

## పెద్ద ప్యాకేజీ దొరికితే మా నేతలు బీఆర్ఎస్‌లో కలిసిపోతారు : బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్

వార్తా 3 లో

## కేసీఆర్ తప్ప ఇంకెవరి నాయకత్వం అంగీకరించను బిఆర్ ఎస్ ను బీజెపిలో విలీనం చేసే కుట్ర జరుగుతోంది ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్ ఎమ్మెల్సీ కవిత మీడియాతో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేసారు. ఇంటి ఆడబిడ్డపై పెయిడ్ ఆర్టిస్టులతో మాట్లడిస్తున్నారు. నా జోలికొస్తే బాగోదు.. కేసీఆర్ ను మేమే నడిపిస్తున్నామని కొందరు చెప్పుకుంటున్నారు. నా లేఖ లీక్ చేసిందెవరో చెప్పాలని అన్నారు. కేసీఆర్ కు నోటీసులు ఇస్తే ఎందుకు నిరసనలు తెలపలేదు. ఇంకో నేతకు నోటీసులు ఇస్తే ఎందుకు హంగామా చేశారు. పార్టీ చేయాల్సిన పనులు జాగృతి తరుపున నేనే చేస్తున్నా. బిఆర్ ఎస్ ను బీజెపిలో విలీనం చేసే కుట్ర జరుగుతోంది. నామీద పడి ఏడిస్తే ఏమోస్తుంది. కాంగ్రెస్ మునిగిపోయే నావ. ఆ పార్టీతో రాయబారాలు నాకెందుకు. నాపై తప్పుడు వార్తలను పార్టీ ఎందుకు ఖండించడంలేదు. బీఆర్ ఎస్ లో కేసీఆర్ తప్ప ఇంకెవరి నాయకత్వం అంగీకరించను. నాది బిఆర్ ఎస్ పార్టీ. నేను జైలులో ఉన్నప్పుడే నాపై కుట్ర జరిగింది. జైలుకు వెళ్లేటప్పుడు పార్టీకి రాజీనామా చేస్తానని చెప్పా. పార్టీ సోషల్ మీడియాలో నన్ను టార్గెట్ చేశారని అన్నారు.

## అల్లు అర్జున్ కు ఉత్తమ నటుడిగా గద్దర్ ఫిల్మ్ అవార్డు




హైదరాబాద్ తెలంగాణ రాష్ట్రంలో గద్దర్ సినిమా 2024 అవార్డులు ప్రకటించారు. ఉత్తమ మొదటి చిత్రం కల్కి, ఉత్తమ రెండో చిత్రం పొట్టేల్, ఉత్తమ మూడో చిత్రం లక్కీ భాస్కర్, ఉత్తమ బాలల చిత్రం-35 ఇది చిన్న కథ కాదు, ఉత్తమ ఫీచర్ హెరిటేజ్ అవార్డు-రజాకార్, ఉత్తమ నటుడు - అల్లు అర్జున్ (పుష్ప-2), ఉత్తమ దర్శకుడు - నాగ్ అశ్విన్ (కల్కి), ఉత్తమ నటి - నివేదా థామస్ (35 ఇది చిన్న కథ కాదు), ఉత్తమ గాయని - శ్రేయా ఘోషల్ (పుష్ప-2), ఉత్తమ స్క్రీన్ ప్లే-వెంకీ అట్లూరి (లక్కీ భాస్కర్), ఉత్తమ హాస్యనటులు - వెన్నెల కిషోర్, సత్య, ఉత్తమ కొరియోగ్రాఫర్ - గణేష్ ఆచార్య (దేవర), ఉత్తమ కథా రచయిత - శివ పాలడుగు, ఉత్తమ పుస్తకం - రెంటాల జయదేవ్ (మన సినిమా పుస్తకం), స్పెషల్ జ్యూరీ అవార్డు - అనన్య నాగళ్ల (పొట్టేల్). స్పెషల్ జ్యూరీ - దుల్కర్ సల్మాన్ (లక్కీ భాస్కర్), స్పెషల్ జ్యూరీ - ఫరియా అబ్దుల్లా (మత్తు వదలరా-2). జూన్ 14న హైటెక్స్లో అవార్డుల ప్రదానం వుంటుంది. 2014-23 సంవత్సరాలకు సంబంధించిన అవార్డులను త్వరలో ప్రకటిస్తామని జ్యూరీ చైర్పర్సన్ జయసుధ అన్నారు.

## జూలై 3వ తేదీ నుంచి ఆగస్టు 9వ తేదీ వరకు అమర్‌నాథ్ యాత్ర సుమారు 42 వేల మంది భద్రతా సిబ్బంది తో బందోబస్తు

న్యూఢిల్లీ మే 29 : అమర్‌నాథ్ యాత్ర కు సమయం ఆసన్నమైంది. జూలై 3వ తేదీ నుంచి ఆగస్టు 9వ తేదీ వరకు ఆ యాత్ర జరగనున్నది. ఈ నేపథ్యంలో జమ్మూకశ్మీర్‌లో భారీ భద్రతను ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు కేంద్ర హోంశాఖ నిర్ణయం తీసుకున్నది. కేంద్ర సాయుధ పోలీసు దళాలకు(సేఏపీఎఫ్) చెందిన సుమారు 580 కంపెనీల సిబ్బందిని మోహరించనున్నారు. అంటే సుమారు 42 వేల మంది భద్రతా సిబ్బంది అమర్‌నాథ్ రూట్లో విధులను నిర్వర్తించనున్నారు. ఇప్పటికే 424 కంపెనీల బలగాలను కేంద్ర పాలిత ప్రాంతానికి పంపించారు. ఇక మిగితా 80 కంపెనీల దళాలు ఆపరేషన్ సింధూర్ సమయంలో అక్కడకు పంపారు. వాళ్లను కూడా వివిధ లొకేషన్లకు మార్చుతున్నట్లు చెప్పారు. అమర్‌నాథ్ యాత్రికులకు పూర్తి స్థాయి రక్షణ కల్పిస్తున్నట్లు కేంద్ర బలగాలు పేర్కొన్నాయి. తక్షణమే కేంద్ర బలగాలు జమ్మూకశ్మీర్‌లో పొజిషన్ తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు కేంద్ర హోంశాఖ అధికారులు తెలిపారు. ఏప్రిల్ 22న జరిగిన పెహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో భద్రతను పటిష్టం చేస్తున్నారు. సీఏపీఎఫ్‌కు చెందిన అయిదు కంపెనీల్లో సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్బీ ఉన్నాయి. గురువారం జమ్మూ విజిట్ సమయంలో భద్రతాను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సమీక్షించనున్నారు. సీఆర్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ జ్ఞానేంద్ర ప్రతాప్ ఇప్పటికే అమర్‌నాథ్ యాత్రపై సమీక్ష నిర్వహించారు. బీఎస్ఎఫ్ డీజీ దల్జిత్ సింగ్ చౌదరీ కూడా త్వరలో సమీక్ష నిర్వహించనున్నారు. అమర్‌నాథ్ యాత్రకు రెండు మార్గాల్లో వెళ్తారు. అనంత్‌నాగ్ జిల్లాలోని పెహల్గామ్ దారి 48 కిలోమీటర్లు ఉంటుంది. ఇక గందేర్‌బల్ జిల్లాలోని బల్తాల్ రూట్‌లో 14 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి ఉంటుంది.

## ముఖ్యమంత్రి ని కలిసిన ఉమ్మడి మహబూబ్‌నగర్ శాసనసభ్యులు



**జూబ్లీహిల్స్ ప్రజాబలం ప్రతినిధి:**బాసర రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్‌నాలెడ్జ్ టెక్నాలజీస్ ట్రిపుల్ ఐటీ కొత్త క్యాంపస్‌ను మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన నేపథ్యంలో జిల్లాకు చెందిన శాసనసభ్యులు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ని కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ శాసనసభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి , జి.మధుసూదన్ రెడ్డి , వాకిటి శ్రీహరి , జనంపల్లి అనిరుధ్ రెడ్డి , చిట్టెం పర్ణికా రెడ్డి , తూడి మేఘా రెడ్డి , వీర్లపల్లి శంకర్ జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి ని కలిశారు.

## ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీలో జిల్లా ఫస్ట్ జిల్లా కలెక్టర్ కు మంత్రుల అభినందనలు






**రాజన్న సిరిసిల్ల జిల్లా, మే - 29 (ప్రజాబలం (ప్రతినిధి)**జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీలో రాజన్న సిరిసిల్ల జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, జిల్లా అధికారులను మంత్రులు అభినందించారు. జిల్లాకు మంజూరు అయిన 7862 ఇండ్లకు గాను 7808 అలాట్మెంట్ ఆర్డర్లు లబ్దిదారులకు అందజేశారు. వేములవాడ నియోజకవర్గంలో ఫేజ్-1,2 లో కలిపి 2575 ఇండ్లు, సిరిసిల్ల నియోజకవర్గంలో ఫేజ్-1,2 లో కలిపి 3608 ఇండ్లు, చొప్పదండి నియోజకవర్గంలోని బోయినపల్లి మండలంలో ఫేజ్-1,2 లో కలిపి 820 ఇండ్లు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మేడిపల్లి సత్యంతో కలిసి, మానకొండూర్ నియోజకవర్గంలోని ఇల్లంతకుంట మండలంలో ఫేజ్-1లో 42 ఇండ్ల మంజూరు పత్రాలు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి కలెక్టర్ పంపిణీ చేశారు. ఫేజ్- 2లో 763 మంజూరు పత్రాలు ఇవ్వనున్నారు. ఫేజ్ 1 కింద జిల్లాలో మొత్తం 439 ఇండ్లు మంజూరు చేయగా, 135 ఇండ్లు వివిధ దశల్లో ఉన్నాయి. జిల్లాలోని 11 మండలాల్లో మొదలు పెట్టిన మోడల్ హౌస్ లలో బేస్మెంట్ లెవెల్ లో మూడు, రూఫ్ లెవెల్లో రెండు, స్లాబ్ లెవెల్ లో ఆరు ఇండ్లు ఉన్నాయి. ఈ సందర్భంగా కరీంనగర్ ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశాన్ని కరీంనగర్ లో గురువారం నిర్వహించగా, జిల్లా ఇంచార్జ్ మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు హాజరై ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల జారీలో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపేలా విశిష్ట సేవలు అందించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ను, జిల్లా అధికారులను ప్రత్యేకంగా అభినందించారు.

ప్రజాబలం

30 మే 2025 శుక్రవారం

# నేతల మాటలు..రగిలిన మంటలు

బాధ్యతాయుతమైన వ్యక్తులు మాట్లాడే మాటలు, వ్యవహార శైలి సమాజంలో సామాన్య ప్రజానీకానికి ఆదర్శంగా ఉండాలి. రాజ్యాంగబద్ధమైన పదవులలో ఉన్న ఎంఎల్ఎలు, ఎంపిలు, మంత్రులు జాతి గౌరవాన్ని, దేశ సమగ్రతను పెంపొందించే విధం గా మాట్లాడాలి. దురదృష్టవశాత్తు నేడు దేశంలో ప్రజాప్రతినిధులు మాట్లాడే భాష రోజుకురోజుకూ దిగజారిపోతోంది. జాతి ఐక్యతకు పాటుపడుతామని ప్రమాణం చేసిన వారే జాతి సమగ్రతకు హాని కలిగించేలా మాట్లాడుతున్నారు. ఆపరేషన్ సిందూర్ విజయాన్ని పురస్కరించుకొని సైనికుల త్యాగాలను, సామర్థ్యాన్ని కీర్తిస్తూ వారికి అండగా ఉండాల్సిన రాజకీయ నాయకత్వం సైనికులను అవమానకరపు మాటలతో వేధిస్తోంది. కులాలను, మతాలను సైన్యానికి ఆపాదిస్తూ దిగజారుడు మాటలతో దేశపరువును మంటగలుపుతున్నారు. వారానికో ఎపిసోడ్ మాదిరిగా ప్రజా ప్రతినిధులు చేస్తోన్న అడ్డగోలు, రోత వ్యాఖ్యలతో ప్రజలు దిగ్భ్రాంతికి లోనవుతున్నారు. సైన్యాధికారిణి కల్నల్ సోఫియా ఖురేషిపై మధ్యప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి విజయ్ షా నిసిగ్గుగా చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా దేశప్రతిష్టను దిగజార్చాయి. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి మీడియాకు వివరాలు అందించిన కల్నల్ సోఫియా ఖురేషికి మతాన్ని ఆపాదిస్తూ ఉగ్రవాదుల సోదరిగా వర్ణించి దేశగౌరవానికి తలవంపులు తెచ్చాడు. మంత్రి విద్వేషపు మాటలపై మధ్యప్రదేశ్ ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు ప్రవర్తించింది. చివరకు ఆ రాష్ట్ర హైకోర్టు మంత్రి వ్యాఖ్యలను సుమోటాగా తీసుకుని కేసు పెట్టమని ఆజ్ఞాపించటంతో అతని నోటిదూల తీవ్రత తెలుస్తోంది. హైకోర్టు కేసు నుంచి విముక్తి కోసం విజయ్ షా సుప్రీం కోర్టు మెట్లెక్కితే క్షమాపణలు చెప్పమని ఆజ్ఞాపించింది. విజయ్ షా క్షమాపణ చెప్పిన విధానాన్ని కూడా సుప్రీం కోర్టు ఆక్షేపించింది. మనస్ఫూర్తిగా క్షమాపణలు చెప్పడానికి అభ్యంతరం ఏంటని నిలదీసింది. ముగ్గురు సభ్యులతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయమని మధ్యప్రదేశ్ డిజిపిని ఆదేశించడంతో సిట్ ఏర్పాటు కాబడి మంత్రి వ్యాఖ్యలపై దర్యాప్తు చేస్తోంది. మంత్రి నోటి దురుసుతనంపై దేశంలోని వివిధ వర్గాల ప్రజలు, మేధావులు నిరసనను వ్యక్తం చేసినప్పటికీ మధ్యప్రదేశ్ ప్రభుత్వం అతనిని మంత్రివర్గం నుంచి తప్పించే ప్రయత్నం చేయలేదు. సుప్రీం కోర్టు ఈ వ్యవహారంలో పలు దఫాలుగా విజయ్ షా వ్యాఖ్యలపై అసహనాన్ని, ఆగ్రహాన్ని వ్యక్తం చేసినప్పటికీ భారతీయ జనతా పార్టీ కేంద్ర నాయకత్వం అతనిపై ఏ చర్యా తీసుకోకపోవడం దేశప్రజలను కలవరపెడుతోంది. ఉత్తరప్రదేశ్ సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు మాజీ ఎంపి రామ్ గోపాల్ యాదవ్ బిజెపి నాయకులకు తానేమి తక్కువ కాదన్నట్లు అవాకులు, చవాకులు పేలాడు. సైనికాధికారులకు కులం, మతం అంటగడుతూ విద్వేషాన్ని రాజేశాడు. కల్నల్ సోఫియా ఖురేషిని మత ప్రాతిపదికపై బిజెపి మంత్రి విమర్శలు చేశాడని తను పనికిమాలిన వ్యాఖ్యలు చేశాడు. కల్నల్ సోఫియా ఖురేషి తోపాటు మీడియా బ్రీఫింగ్‌లో పాల్గొన్న వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్, వైమానిక దాడులను వివరించిన ఎయిర్ మార్షల్ ఎకె భారతి కులాలను ఎంచి అనుచితంగా మాట్లాడాడు. రాజకీయ నాయకులు ఓటు బ్యాంకును స్థిరం చేసుకోవడానికి దేశంలో కుల, మత, ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టడం పరిపాటి. దేశ రక్షణకోసం ప్రాణ త్యాగానికి సిద్ధపడి పనిచేసే సైనికుల మధ్య కులాల అడ్డుగోడలు కట్టడం సరైంది కాదనే ఇంగిత జ్ఞానం కూడా అతనికి లేకపోయింది. రేయింబవళ్లు కంటిమీద కునుకు లేకుండా సరిహద్దులో కాపలాకాస్తున్న సైన్యానికి కులాల, మతాల ముసుగు తొడగడంతో పొరుగు దేశాల ముందు దేశం పరువు మసకబారింది.మధ్యప్రదేశ్ మంత్రి మాట్లాడిన మాటల మంటలు చల్లారక ముందే ఆ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి జగదీష్ దేవ్డా ప్రజలపై, సైన్యంపై విషం చిమ్మాడు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైనందుకు ప్రజలు, సైన్యం ప్రధాని మోడీ కాళ్లకు మొక్కాలని అవమానించే రీతిలో మాట్లాడాడు. వాస్తవానికి ఇతరులకు గౌరవ మర్యాదలు ఇవ్వడంలో మోడీ ఎప్పుడు ముందుంటారు. ప్రధాని తనను కలవడానికి వచ్చే ప్రతిభావంతుల కాళ్లకు నమస్కారం చేసిన సంఘటనలు అనేకం ఉన్నాయి. మోడీకి ఇటువంటి నేపథ్యం ఉన్న పరిస్థితులలో దేశ ప్రజలు, సైన్యం ప్రధాని కాళ్లు మొక్కాలని ఉప ముఖ్యమంత్రి చెప్పడంలో ఔచిత్యం ఏమిటో తెలియడం లేదు. సైనికులు తమ శక్తిసామర్థ్యాలను ప్రపంచానికి తెలియజేసినందుకు కాళ్లు మొక్కాల్సి ఉండేనా? సైన్యం ధైర్యసాహసాలతో ఉగ్రవాద స్థావరాలు నేలమట్టం చేసి పాకిస్తాన్‌ను కాళ్ళబేరానికి తీసుకొచ్చినందుకు సాగిలపడాలా? ప్రధానమంత్రి తీసుకునే నిర్ణయానికి ప్రజలు, ప్రతిపక్షాలు మద్దతు ఇచ్చి ఐక్యంగా నిలబడినందుకా? మొదలగు ప్రశ్నలకు కమలనాథుల నుంచి సమాధానం ఆశించడం వృథా ప్రయాసే అవుతుంది. దేశవ్యాప్తంగ ఓ వైపు పాకిస్తాన్ కుతంత్రాలను ప్రపంచానికి చాటిచెప్పేందుకు దౌత్యప్రచారానికి కమిటీలను నియమిస్తున్న కేంద్ర ప్రభుత్వం, మరోవైపు దేశంలోపల సైన్యంపై ఇష్టానుసారంగా మాట్లాడుతున్న తమ నాయకులను అదుపులో పెట్టలేకపోవడం విస్మయం కలిగిస్తోంది. దేశంలో పహల్గాం ఉగ్రదాడి, అనంతరం జరిగిన ఆపరేషన్ సిందూర్ పరిస్థితులపై బిజెపి నాయకులు మాట్లాడే మాటలకు అడ్డూ అదుపు లేకుండాపోతోంది. తాజాగా హర్యానా బిజెపి రాజ్యసభ సభ్యుడు రామచందర్ జంగ్రా ఉగ్రదాడిలో భర్తల ప్రాణాలు కోల్పోయిన మహిళలపై నోరు పారేసుకున్నాడు. భర్తలను కోల్పోయిన మహిళలకు స్ఫూర్తి, వీరోచిత లక్షణాలు లేవని ఉగ్రవాదులను వేడుకునే బదులు తిరగబడాల్సిందని నాలుకకు పని చెప్పాడు. విచక్షణా రహితంగా కాల్పులు జరుపుతున్న ఉగ్రమూకలపై నిస్సహాయులైన మహిళలు ఏ రకంగా పోరాటం చేస్తారో అతని మేధస్సుకే తెలియాలి. గతంలో జాతిపిత మహాత్మా గాంధీని హత్య చేసిన నాథూరామ్ గాడ్సేను దేశభక్తుడిగా పార్లమెంటు సాక్షిగా బిజెపి ఎంపి ప్రజ్ఞా సింగ్ ఠాకూర్ కీర్తించింది. రూ. 100 కోసం రైతు చట్టాల వ్యతిరేక నిరసన దీక్షలో మహిళా రైతులు కూర్చున్నారని ఎంపి కంగనా రనౌత్ ఎగతాళి చేసింది. జాతిపితపై, రైతులపై చేసిన విషపూరిత వ్యాఖ్యలకు గాను ప్రజ్ఞా సింగ్ ఠాకూర్, కంగనా రనౌత్ పై బిజెపి ఆనాడే కఠిన క్రమశిక్షణా చర్యలు తీసుకుని ఉంటే నేడు ప్రజలు, సైనికులు, వితంతువులపై అవమానకర, విద్వేష మాటలు వచ్చి ఉండేవి కావు. కొంతమంది ప్రజాప్రతినిధులు ప్రధాన వార్తా స్రవంతిలో ఉండటానికి ఆలోచన రహితంగా ఏదిపడితే అది మాట్లాడటం, తరువాత క్షమాపణలు చెప్పటం, వ్యాఖ్యలను మీడియా వక్రీకరించిందని బుకాయించటం అలవాటైపోయింది. ఢిల్లీలో జరిగిన ఎన్‌డిఎ పాలిత రాష్ట్రాల సిఎంలు, డిప్యూటీ సిఎంల మీటింగ్‌లో కీలకమైన అంశాలపై మాట్లాడేటప్పుడు సంయమనం పాటించాలని, నోరు జారొద్దని సుతి మెత్తగా మోడీ చేసిన హెచ్చరిక ఏమాత్రం పని చేస్తుందో వేచి చూడాలి. దేశఐక్యత, సంస్కృతి సంప్రదాయాలు, గౌరవ మర్యాదలకు అధిక ప్రాధాన్యత ఇస్తామని చెప్పే బిజెపి తమ నాయకులు ఇష్టాను రీతిగా మాట్లాడే మాటలను అదుపు చేయనట్లయితే ప్రజల విశ్వాసాన్ని కోల్పోక తప్పదు.

# ఇసుక అక్రమ రవాణాకు అడ్డు అదుపు లేదా.

**అనుమతుల పేరుతో అక్రమ ఇసుక రవాణా.**

**ఇసుకను కాపాడుకుంటే జిల్లాలోని పలు మండలాలు ఎడారిగా మారే ప్రమాదం.**

**ఇందిరమ్మ ఇండ్ల ఇసుక అక్రమంగా విక్రయం.**

**రెండు ట్రాక్టర్లు సీజ్ చేసిన ఆర్ఐ.**



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఎల్లారెడ్డిపేట, ( ప్రజాబలం),** ఇందిరమ్మ ఇండ్ల పేరిట ఎల్లారెడ్డిపేట తాసిల్దార్ గుండారం గ్రామానికి ఇసుక రవాణాకు అనుమతి ఇచ్చిన కూపన్లను ట్రాక్టర్ యజమానులు దుర్వినియోగం చేస్తూ, ప్రైవేట్ వ్యక్తులకు ఇసుక అక్రమ రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను ఎల్లారెడ్డిపేట రెవిన్యూ ఇన్స్పెక్టర్ శ్రావణ్ పట్టుకున్నారు.

మండలంలోని పదిర గ్రామ ఇసుక రీచ్ నుండి ఇసుకను ఇందిరమ్మ ఇండ్లకు మాత్రమే వినియోగించేందుకు తాసిల్దార్ ట్రాక్టర్ కు రెండు చొప్పున కూపన్లు ఇచ్చి ఇసుక రవాణాకు అనుమతి ఇచ్చారు. ఇదే అదునుగా భావించిన ఇసుక ట్రాక్టర్ యజమానులు ఇందిరమ్మ ఇండ్లకు సరఫరా చేయవలసిన ఇసుకను ప్రైవేటు వ్యక్తులకు విక్రయించడంపై సమాచారం అందుకున్న ఆర్ఐ శ్రావణ్ 2 ట్రాక్టర్ లను పట్టుకొని తాసిల్దార్ కార్యాలయానికి తరలించారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు మాత్రమే పదిర ఇసుక రీచ్ నుండి ఇసుక తరలించుటకు ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ అనుమతులు ఇచ్చారు. దీంతో మండలంలోని వెంకటాపూర్, రాగట్లపల్లి, నారాయణపూర్ గ్రామాలకు చెందిన ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు తమ గ్రామాలకు కూడా ఇసుక రీచులను అనుమతి ఇవ్వాలని ఆందోళనకు దిగారు. తాసిల్దార్ కార్యాలయం ముందు ప్రతిపక్ష పార్టీల నేతలతో కలిసి ధర్నా చేశారు. తాసిల్దార్ కు వినతి పత్రం కూడా అందించారు. దీంతో ఇసుక రీచ్ లకు అనుమతి ఇచ్చే అధికారం తమకు లేదని తేల్చి చెప్పిన తాసిల్దార్ సుజాత. ఇంత ఇబ్బంది తనకు ఎక్కడ కూడా తలెత్తలేదని తల పట్టుకున్న పరిస్థితిని కలిగించింది అంటే అక్రమ ఇసుక రవాణా దారులు జిల్లా కలెక్టర్ పై, మండల రెవెన్యూ అధికారులపై ఎంత మేరకు ఒత్తిడి చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. గత ప్రభుత్వ హయాంలో మానేరు పరివాహక ప్రాంతాల గ్రామాలైన నారాయణపూర్, రాగట్లపల్లి, వెంకటాపూర్, పదిర గ్రామాలలో ఇసుక రీచులకు అనుమతి ఇవ్వడంతో యదేచ్ఛగా ఆయా గ్రామాల ట్రాక్టర్ యజమానులు పగలు, రాత్రి తేడా లేకుండా అక్రమంగా ఇసుక దోపిడీకి పాల్పడ్డారు. ఇష్టానుసారంగా మానేరు వాగులోని ఇసుకను తోడేశారు. ఎల్లారెడ్డిపేట మండల రెవెన్యూ కార్యాలయంలో కొందరు ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ఇసుక కూపన్లు ఇచ్చే వ్యవహారంలో కీలకంగా వ్యవహరిస్తున్నారని సమాచారం. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయకుంటే రానున్న కాలంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ఎడారిగా మారే ప్రమాదం ఉందని, అన్ని మండలాల ప్రజలకు తాగునీరు, సాగునీరు లభించని పరిస్థితి ఉంటుందని మేధావులు ఆందోళన చెందుతున్నారు.

# నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 29 :** ప్రజలకు నిరంతరం త్రాగునీటిని అందించేందుకు అమృత్ 2.0 పథకం క్రింద చేపట్టిన ట్యాంక్ నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని చెన్నూర్ పట్టణంలో నిర్మిస్తున్న అమృత్ 2.0నీటి ట్యాంక్ నిర్మాణ పనులను మున్సిపల్ కమీషనర్ మురళీకృష్ణతో కలిసి సందర్శించి పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మిషన్ భగీరథ పథకం అమృత్ 2.0 పథకాల ద్వారా ప్రతి ఇంటికి నిరంతరం త్రాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని,ఈ క్రమంలో పట్టణంలో చేపట్టిన అమృత్ 2.0 నీటి ట్యాంక్ నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం మండలంలోని ఆస్నాద్,గంగారం గ్రామాలలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల తహాశిల్దార్ మల్లిఖార్జున్తో కలిసి సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. జిల్లాలో ప్రస్తుతం నెలకొన్న అకాల వర్షాల పరిస్థితులలో కొనుగోలు కేంద్రాలలోని ధాన్యాన్ని వెంటనే కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించాలని తెలిపారు.కొనుగోలు కేంద్రాలలో నిబంధనల ప్రకారం రైతుల వద్ద నుండి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని,సన్న రకం వడ్లు విక్రయించిన రైతులకు మద్దతు ధరతో పాటు 500 రూపాయల అదనపు బోనస్ అందించడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతుల కోసం త్రాగునీరు, నీడ,ఓ.ఆర్.ఎస్.ప్యాకెట్లు అందుబాటులో ఉంచడంతో పాటు అవసరమైన గోనెసంచులు,టార్పాలిన్లను సమకూర్చడం జరిగిందని తెలిపారు.కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేసిన కొనుగోలు కేంద్రాలను మూసి వేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.





# లే-అవుట్లను నిబంధనలకు లోబడి అనుమతించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 29 :** జిల్లాలో భూముల లే-అవుట్ల కొరకు అందిన దరఖాస్తుల సంబంధిత భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనలకు లోబడి అనుమతించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.గురువారం జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలో లే-అవుట్ కొరకు అందిన దరఖాస్తు సంబంధిత భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...భూముల అభివృద్ధి,ఇండ్ల నిర్మాణం, వెంచర్ల ఏర్పాటులో భాగంగా లే-అవుట్ కొరకు అందిన దరఖాస్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించి నియమ, నిబంధనల ప్రకారం అనుమతులు మంజూరు చేయాలని తెలిపారు. లే-అవుట్ దరఖాస్తు సంబంధిత భూమి నిషేధిత జాబితా,ఎఫ్.టి.ఎల్.బఫర్ జోన్ పరిధిలో ఉన్నది.లేనిది నిర్ధారించుకోవాలని, లే-అవుట్ సమీపంలో చెరువులు,వాగులు ఇతర ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. ఈ క్రమంలో ప్రభుత్వ భూములు రక్షణ దిశగా చర్యలు తీసుకోవాలని, ఆక్రమిత ప్రభుత్వ భూములను చట్టం ప్రకారం చర్యలు తీసుకొని స్వాధీనపర్చుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో 24 వేల 705 మంది రైతుల ఖాతాలలో 262 కోట్ల రూపాయల జమ

## జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 29 :** జిల్లాలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి వరి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 345 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 320 కేంద్రాలు ద్వారా 24 వేల 705 మంది రైతుల వద్ద నుండి 1 లక్ష 73 వేల 814 టన్నుల వరిధాన్యం కొనుగోలు చేసి సంబంధిత రైతుల ఖాతాలలో 262 కోట్ల 10 లక్షల రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు. రైతుల వద్ద నుండి పూర్తి స్థాయిలో నిబంధనల ప్రకారం వరిధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేసిన 205 కొనుగోలు కేంద్రాలను మూసి వేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన వరిధాన్యంను రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి కనీస మద్దతు ధర పొందాలని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రతి రోజు 1 వేయి 500 మంది సిబ్బంది, హమాలీలు యజ్ఞంలా పని చేస్తున్నారని, నిత్యం 4 వేల నుండి 8 వేల టన్నుల ధాన్యం కాంటా చేసి 358 లారీల ద్వారా 2 వేల 500 నుండి 5 వేల టన్నుల ధాన్యం పెద్దపల్లిలోని 110 మిల్లులకు, జిల్లాలోని 20 మిల్లులకు తరలించడం జరుగుతుందని, మిల్లుల వద్ద ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగంగా జరుగుతుందని తెలిపారు. ప్రతి రోజు దాదాపు 5 కోట్ల రూపాయల నుండి 8 కోట్ల రూపాయలు సంబంధిత రైతుల బ్యాంక్ ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు.



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** డాక్టర్ దూత రామకోటేశ్వర రావు గారి సంపాదకత్వంలో వెలువడిన " నాలుగో సింహం" అన్న కవితా సంకలనాన్ని అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీస్ శ్రీ కె ఏం కిరణ్ కుమార్ గారు (ఆర్థిక నేరాల విభాగం), పలువురు పోలీస్ అధికారుల సమక్షంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణకు కమిషనరేట్ కార్యాలయం – హైదర్ గూడా లోని వారి ఆఫీస్ చాంబర్ వేదికగా నిలిచింది.

శ్రీ కె ఏం కిరణ్ కుమార్ గారు "నాలుగో సింహం" (ప్రాణ రక్షక కవన సంకలనం) గ్రంధాన్ని ఆవిష్కరించి, సహా పోలీసు అధికారులకు ప్రతులను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ కె ఏం కిరణ్ కుమార్ గారు మాట్లాడుతూ, పోలీసు సేవలను కొనియాడుతూ యాభై నాలుగు మంది ప్రముఖ కవులు రచించిన అద్భుత కవితలను కూర్చి ఒక సంకలనంగా తీసుకురావడం, చాలా గర్వించ దగిన, అభినందించదగిన విషయమని ప్రశంసించారు. ఇలాంటి మంచి ప్రయత్నాలు పోలీసు వ్యవస్థను, ప్రజలకు మరింత చేరువ చేస్తాయన్న అభిప్రాయాన్ని వ్యక్త పరిచారు.

ఈ సంకలనం వెలుగు చూడడానికి కృషి చేసిన డాక్టర్ దూత రామకోటేశ్వర రావు, శ్రీ జె వి కుమార్ చేపూరి మరియు కవితలు రాసిన కవులపై ప్రశంసల జల్లు కురిపించారు. ఈ సంకలనాన్ని తన చేతుల మీదుగా ఆవిష్కరింపజేయడం, తన అదృష్టమని, తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని హర్షాన్ని వెలిబుచ్చారు.

# పెద్ద ప్యాకేజీ దొరికితే మా నేతలు బీఆర్ఎస్‌లో కలిసిపోతారు : బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్

## బీజేపీ అభ్యర్థులు ఎక్కడ నుంచి పోటీ చేయాలో వాళ్లే డిసైడ్ – ఇతర పార్టీలతో మా నేతల కుమ్మక్కుతోనే బి జె పి పార్టీ నష్టపోయింది



**గోషామహాల్ప్రజాబలం ప్రతినిధి మే 29**బీజేపీ గోషామహాల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సొంత పార్టీపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆఫ్ ద రికార్డులో ఎమ్మెల్సీ కవిత మాట్లాడింది నిజమేనని తాను నమ్ముతున్నానని అన్నారు. పెద్ద ప్యాకేజీ దొరికితే తమ పార్టీ పెద్ద నేతలు కూడా బీఆర్ఎస్?తో కలిసిపోతారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో ఏ బీజేపీ అభ్యర్థి ఎక్కడి నుంచి నిలబడాలనేది వాళ్లే నిర్ణయిస్తారని అన్నారు.

నోరు మూసుకొని కూర్చుంటున్నారు గతంలో ఇదే జరిగిందని అందుకే బీజేపీ నష్టపోయిందని వ్యాఖ్యానించారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఎప్పుడో రావాలని, ఇప్పటివరకు ఎందుకు బీజేపీ గవర్నమెంట్ రాలేదో ఒకసారి ఆలోచన చేయాలన్నారు. ప్రతి ఎన్నికల్లోనూ తమ నేతలు కుమ్మక్కైపోయారని విమర్శించారు. అందువల్లే బీజేపీకి తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ప్రతి ఒక్క బీజేపీ కార్యకర్త, నాయకుడికి ఈ విషయం తెలుసు కానీ ఎవరూ చెబుతే వాళ్లు సస్పెండ్ అయిపోతారన్నారు. అందుకోసం కార్యకర్తలు గానీ నాయకులు గానీ పాపం నోరు మూసుకొని కూర్చుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఎమ్మెల్సీ కవిత లేఖ, ఈటల రాజేందర్‌కు నోటీసులపై ఎవ్వరూ నోరు జారొద్దని కిషన్ రెడ్డి హెచ్చరించిన మరుసటి రోజే రాజాసింగ్ కవితపై సంచలన వ్యాఖ్యలు చేశారు. దీంతో పార్టీ శ్రేణులతో పాటు రాజకీయ వర్గాల్లో వ్యాఖ్యలపై తీవ్ర చర్చ నడుస్తోంది.టెర్రరిస్టుల వెనుక ఎంఐఎంకు చెందిన అడ్వకేట్ ఉన్నారు ఎన్ఐఏ ఆఫీసర్లు అరెస్టు చేసిన టెర్రరిస్టుల వెనుక ఎంఐఎంకు చెందిన అడ్వకేట్ ఉన్నారని ఆరోపించారు. టెర్రరిస్టులకు ఫిజికల్‌గా, ఫైనాన్షియల్‌గా కూడా ఎంఐఎంనే సపోర్టు చేస్తోందని అన్నారు. ఏపీ, తెలంగాణలో ఇంకెంతమంది సమీర్, సిరాజ్‌లు ఉన్నారో ఇన్వెస్టిగేషన్ చేసే పోలీసులు తేల్చాలని తెలిపారు. టెర్రరిస్టులు టార్గెట్ చేశారో వారికి ఫోన్ చేసి అలర్ట్ చేయాలని అన్నారు. గతంలో గోకుల్ చాట్, సాయిబాబా ఆలయం, లుంబినీ పార్కు వద్ద బాంబు పేలుళ్లకు బలైంది పేద ప్రజలేనని రాజాసింగ్ తెలిపారు.

# గోవుల అక్రమ రవాణాను అరికట్టడానికి జిల్లా, సరిహద్దులో 5 చెక్ పోస్టులు ఏర్పాటు:ఎస్పీ డి.జానకి



**మహబూబ్ నగర్ ప్రజాబలం ప్రతినిధి మే 29** గోవుల అక్రమ రవాణా నియంత్రణకు కోయిలకొండ %శ% రోడ్ నందు ఏర్పాటు చేసిన చెక్ పోస్టును ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ డి.జానకి,విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి తగిన సూచనలు జారీచేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో గోవుల అక్రమ రవాణాను అరికట్టడానికి జిల్లా, సరిహద్దులో 5 చెక్ పోస్టులు ఏర్పాటు చేయడం జరిగింది. 24%ఇ%7 నిరంతర పర్యవేక్షణలో వుండేవిధంగా ప్రత్యేక చెక్ పోస్టులలో పోలీసు, పశుసంవర్ధక శాఖ సిబ్బందితో షిఫ్ట్ ల వారిగా సమన్వయంతో విధులు నిర్వహించడంజరుగుతుందన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణ కోసం ముందస్తు చర్యలలో భాగంగా గోవుల రవాణా విషయంలో వివాదాలు తలెత్తకుండా ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా జంతువుల అక్రమ రవాణా, గోవధ విషయంలో నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు. ప్రధానంగా బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల రవాణా విషయంలో అవసరమైన అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని, చట్టవిరుద్ధంగా ఆవులు,దూడలను రవాణా చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు ఆదేశించారు.

గోవులను రవాణాచేసే ప్రతి వాహనానికి తగు నిర్ధారిత ప్రమాణిక పత్రాలు (వాలిడ్ డాక్యుమెంట్స్) ఉండాలని స్పష్టం చేశారు. అక్రమ రవాణా అయ్యే గోవుల విషయంలోనూ నియమ, నిబంధనలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. సరైన పత్రాలు వారి వెంట ఉన్నాయనే విషయాన్ని పరిశీలించి అనుమతించాలని, అక్రమ రవాణా చేస్తే చర్యలు తీసుకోవాలని చెప్పారు. అదేవిధంగా అక్రమ రవాణా నియంత్రించేందుకు నిఘా విభాగం అప్రమత్తంగా వుంటుందని, చెక్ పోస్టుల తనిఖీలే కాకుండా జిల్లా కేంద్రంలో సైతం ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తారని అన్నారు. ఎవరైనా అక్రమ రవాణా చేస్తూ పట్టుబడితే వారి వాహనాలు జప్తు చేస్తామన్నారు.

# ఆపరేషన్ సిందూర్' ఇంకా ముగియలేదు

## ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే వారందరిపై భారత్ నిర్ణయాత్మకంగా చర్యలు మరోసారి స్పష్టం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ

న్యూ డిల్లీ 29 ఆపరేషన్ సిందూర్' ఇంకా ముగియలేదని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మరోసారి స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే వారందరిపై భారత్ నిర్ణయాత్మకంగా చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. పాక్ పై ఇప్పటికే మూడుసార్లు వారి సొంతగడ్డపైనే దాడులు చేశామని గుర్తు చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని అలీపుర్దువార్ లో ప్రజలను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు.'బెంగాల్ గడ్డ నుంచి 140 కోట్ల మంది భారతీయుల తరఫున ప్రకటిస్తున్నా.. ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు. పాకిస్థాన్‌ను ఇప్పటికే దాని సొంత గడ్డపై మూడు సార్లు దాడులు చేశాం. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే వారందరిపై భారత్ నిర్ణయాత్మకంగా వ్యవహరిస్తుంది. భారతీయ మహిళల గౌరవాన్ని అవమానించిన ఉగ్రవాదులపై దేశ సాయుధ దళాలు ప్రతీకారం తీర్చుకున్నాయి.ఉగ్రవాదులు మన సోదరీమణుల సింధూరాన్ని తుడిచివేశారు. మన సైన్యం సింధూరం శక్తిని వారికి తెలిసేలా చేసింది. ఉగ్రవాదం పట్ల భారత్ జీరో-టాలరెన్స్ విధానాన్ని అవలంభించింది. పాక్ ఎన్నడూ ఊహించని సరిహద్దు ఉగ్రవాద మౌలిక సదుపాయాలను ధ్వంసం చేసింది. వారి భూభాగంలోకి చొచ్చుకెళ్లి మరీ మూడుసార్లు దాడులు చేశాం. ఆపరేషన్ సిందూర్‌తో.. భారత్‌పై దాడి చేస్తే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని ప్రపంచానికి చాటిచెప్పాం. ఈ విషయాన్ని పాకిస్థాన్ అర్థం చేసుకోవాలి' అని ప్రధాని వ్యాఖ్యానించారు.

# ఎంపీ అర్వింద్ చొరవతో ఈ విద్యా సంవత్సరం నుండే నవోదయ తరగతులు ప్రారంభం

జగిత్యాల,మే 29 :నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో నిజామాబాద్ తోపాటు జగిత్యాల జిల్లాల్లో రెండు జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. కాగా ఇటీవల నిజామాబాద్ ఎంపీ అర్వింద్, ఎట్టి పరిస్థితుల్లో ఈ విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించాలని నవోదయ అధికారులను ఆదేశించారు. దీంట్లో భాగంగా విద్యాలయాల శాశ్వత, తాత్కాలిక స్థలాలకు సంబంధించి అవసరమైన చర్యలు ప్రారంభించాలని నవోదయ విద్యాలయ సమితి డిప్యూటీ కమిషనర్ గోపాలకృష్ణ లేఖ రాశారు.

జగిత్యాల జిల్లాలో శాశ్వత భవన నిర్మాణానికి కోరుట్ల మండలం శివారులో గల సర్వేనెంబర్ 923 లో తాత్కాలిక వసతి కొరకు కోరుట్ల పట్టణంలోని అల్లమయ్య గుట్టలో గల బీఎస్సీ హానర్స్ అగ్రికల్చర్ కాలేజ్ మరియు సోషల్ వెల్ఫేర్ బాయ్స్ హాస్టల్ ఎంపిక చేయబడ్డాయని ఆయన లేఖలో పేర్కొన్నారు. జిల్లా అధికారులతో సమన్వయం చేసుకొని ఎలాంటి వివాదాలు లేని కోరుట్ల శివారులోని 30 ఎకరాల భూమి నవోదయ విద్యాలయ సమితి పేరుపై బదలాయింపు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా శాశ్వత తాత్కాలిక భవనాల్లో రోడ్లు,నీరు విద్యుత్, టెలికమ్యూనికేషన్ లాంటి ప్రాథమిక సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని లేఖలో ఆయన పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరం నుండి విద్యా సంస్థ తాత్కాలిక భవనంలో ప్రారంభమయ్యేందుకు అవసరమైన మరమ్మతుల పనుల స్థితిపై నివేదిక అందజేయాలని జవహర్ నవోదయ విద్యాలయ చొప్పదండి (కరీంనగర్) ప్రిన్సిపాల్ ను ఆదేశించారు. కాగా నవోదయ విద్యాసంస్థను మంజూరు చేయడంతో పాటు ఈ సంవత్సరం నుండే తరగతులు ప్రారంభమయ్యేలా చొరవ తీసుకోవడం పట్ల జిల్లా ప్రజలు ఎంపీ అర్వింద్ కు ధన్యవాదాలు తెలియజేశారు.

# అభివృద్ధికి ఆమడ దూరంలో లక్షెట్టిపేట

## రైతుబంధు,రైతు బీమా ఎక్కడ? బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 29 :** మంచిర్యాల ఎమ్మెల్యే పీఎస్ఆర్ లక్షెట్టిపేట అభివృద్ధిని విస్మరిస్తున్నారని,టెండర్ అయిన పనులెందుకు రద్దు చేశారని,రైతుబంధు, రైతు బీమా ఎక్కడని, లక్షెట్టిపేట మున్సిపాలిటీలో సిబ్బంది లేక చెత్త బండ్లు మూలన పడుతున్నాయని, బీఆర్ఎస్ హయాంలోనే లక్షెట్టిపేట అభివృద్ధి జరిగిందని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు పేర్కొన్నారు.గురువారం పట్టణంలోని విశ్రాంతి భావన ఆవరణలో బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ..గత బీఆర్ఎస్ హయాంలో మంజూరు చేసిన 297 పనులన్నీ రద్దు చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. ఇప్పటికింకా రైతుల దగ్గర నుండి వరి ధాన్యం సేకరించలేదని,బస్తాకు 2కిలోల చొప్పున వడ్లు కట్ చేస్తున్నారన్నారు.బీఆర్ఎస్ హయాంలో పట్టణ ప్రగతి, డీఎమ్ఎఫ్టీ నిధుల ద్వారా లక్షెట్టిపేటను అభివృద్ధి చేశామన్నారు.పట్టణంలో స్టేడియం నిర్మించామని, హాస్పిటల్ బీఆర్ఎస్ హయాంలోనే నిర్మాణం చేపట్టామన్నారు.పల్లె ప్రగతి ద్వారా పల్లెల్లో మౌలిక సదుపాయాలు కల్పించమన్నారు. బీఆర్ఎస్ హయాంలో ప్రతి ఊరికి బీ టీ రోడ్డు నిర్మించామన్నారు. సంక్షేమ పథకాల్లో 30 శాతం మాత్రమే అమలవుతున్నాయని ఇంకా 70 శాతం మంది ఎదురు చూస్తున్నారన్నారు. నిత్యం కరెంట్ కోతలు విధించి ప్రజలను ఇబ్బందులకు గురించి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి భవనాన్ని పరిశీలించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ రావు, మున్సిపల్ మాజీ చైర్మన్ నల్మస్ కాంతయ్య, మాజీ వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్, మాజీ డీసీఎంఎస్ చైర్మన్లు కేతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,తిప్పని లింగన్న, మండల అధ్యక్షులు చుంచు చిన్నయ్య, పట్టణ అధ్యక్షులు పాదం శ్రీనివాస్,మాజీ కౌన్సిలర్ చాతరాజు రాజన్న,అంకతి గంగాధర్,నాయకులు చాంద్, పెరక శ్రీనివాస్,బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# హెచ్ఎంఐఎస్, రొటాసిల్ వ్యాక్సిన్, క్యాచ్ అప్ క్యాంపెయిన్ పై సమీక్ష మరియు శిక్షణ కార్యక్రమం



**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మే 29:**జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డా. సీ. గౌరి ఆధ్వర్యంలో, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్య మరియు ఆరోగ్య కార్యాలయం, అం తాయిపల్లిలోని సమావేశ మందిరంలో, శిక్షణ మరియు సమీక్ష సమావేశం నిర్వహించబడింది.

ఈ సమావేశంలో

హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ రెండు డోసుల రొటాసిల్ వ్యాక్సిన్ పరిచయం

టీకా క్యాచ్ అప్ క్యాంపెయిన్ పై సమీక్ష జరిగినది.జిల్లాలోని అన్ని రిపోర్టింగ్ సూపర్వైజర్లు, ఏఎన్ఎమ్ మరియు డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఈ శిక్షణలో పాల్గొన్నారు. వారికి డేటా నమోదు, కొత్త టీకా షెడ్యూల్ అమలు మరియు ఎన్ఆర్వీ క్యాంపెయిన్ నిర్వహణ పై పూర్తి వివరాలు అందించబడింది.ఈ సందర్భంగా డా. సీ. గౌరి మాట్లాడుతూ, పిల్లలను జబ్బుల నుండి రక్షించడంలో సమయానికి టీకాలు ఇవ్వడం చాలా ముఖ్యమని అన్నారు. అలాగే, హెచ్ఎంఐఎస్ లో ఖచ్చితమైన ప్రతిఒక్కరి డేటా నమోదు చేయడం ద్వారా ఆరోగ్య వ్యవస్థను మెరుగుపరచవచ్చని తెలిపారు.

ఈ శిక్షణ కార్యక్రమానికి మల్కాజిగిరి డివిజన్ డిప్యూటీ డిఎంహెచ్ఓ డా. శోభారాణి మరియు జిల్లా టీకాకరణాధికారి డా. కౌశిక్ పాల్గొన్న సిబ్బందికి సాంకేతిక మార్గదర్శకత్వం అందించారు,

# లోకేష్ టీమ్ లో అంతా యువతరమే

కడప, మే 29,నారా లోకేష్ కు పార్టీ పగ్గాలు అప్పగించాల్సిన సమయం ఇది అని సన్నిహితులు చెబుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో నారా లోకేష్ కు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా పదవి ఇస్తారని ప్రచారం జరుగుతోంది. అయితే లోకేష్ టీం లో ఎవరు అనేది ఇప్పుడు ప్రశ్న. చంద్రబాబు మాదిరిగానే నమ్మకస్తులైన బృందాన్ని లోకేష్ ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉంది. తెలుగుదేశం పార్టీలో లోకేష్ కు ప్రమోషన్ ఖాయమా? వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇస్తారా? టిడిపిలో సీనియర్లంతా ఇప్పుడు ముక్తకంఠంతో కోరుకుంటున్నది అదే. మహానాడు వేదికగా ప్రసంగిస్తున్న నేతలంతా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇదే మంచి సమయం అని చంద్రబాబుకు సూచిస్తున్నారు. తెలుగుదేశం పార్టీకి నాయకత్వ పరంగా ఎటువంటి లోటు లేదు. అపర చాణిక్యుడిగా పేరొందిన చంద్రబాబు ఉన్నారు. కానీ చంద్రబాబు వయసు 75 సంవత్సరాలు దృష్ట్యా.. నారా లోకేష్ కు పార్టీ పగ్గాలు అప్పగించాల్సిన సమయం ఇది అని సన్నిహితులు చెబుతున్నారు.

ఇటువంటి పరిస్థితుల్లో నారా లోకేష్ కు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా పదవి ఇస్తారని ప్రచారం జరుగుతోంది. అయితే లోకేష్ టీం లో ఎవరు అనేది ఇప్పుడు ప్రశ్న. చంద్రబాబు మాదిరిగానే నమ్మకస్తులైన బృందాన్ని లోకేష్ ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉంది.వాస్తవానికి టిడిపి ఆవిర్భావ సమయంలో పార్టీలో చంద్రబాబు లేరు. 1983 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన చంద్రబాబు టిడిపి అభ్యర్థి చేతిలో ఓడిపోయారు. అక్కడకు కొద్ది రోజులకే తెలుగుదేశం పార్టీలో చేరారు. 1985 మధ్యంతర ఎన్నికల్లో టిడిపి తరఫున చంద్రబాబు పోటీ చేయలేదు. కానీ పార్టీలో చేరిన నాటి నుంచి తనదైన ముద్ర వేసుకున్నారు. పార్టీ వ్యవహారాలను చూసుకున్నారు. అదే చంద్రబాబు రాజకీయానికి ప్లస్ గా మారింది. చంద్రబాబు టీం లోకి పూసపాటి అశోక్ గజపతిరాజు, అయ్యన్నపాత్రుడు, కళా వెంకట్రావు, కింజరాపు ఎర్రం నాయుడు, యనమల రామకృష్ణుడు, కేఈ కృష్ణమూర్తి, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, నిమ్మకాయల చినరాజప్ప.. ఇలాంటి నేతలంతా చంద్రబాబు సన్నిహితులుగా ముద్రపడ్డారు.

చంద్రబాబుతో పార్టీ వీరు రాజకీయంగా ఎదిగారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన ప్రతిసారి వీరికి ప్రాధాన్యత దక్కుతూనే ఉంది. మీరు కూడా చంద్రబాబు నాయకత్వాన్ని మరింత పెంచుకునేలా చేశారు.అయితే ఇప్పుడు లోకేష్ అటువంటి టీం ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉంది. మరో నాలుగు దశాబ్దాల పాటు టిడిపి ఉనికి చాటుకునేలా ప్రణాళికలు వేస్తున్నారు. అందులో భాగంగానే నారా లోకేష్ కు నాయకత్వ బాధ్యతలు అప్పగించాలన్న డిమాండ్ తెరపైకి వచ్చింది.

అయితే చంద్రబాబుకు మాదిరిగా లోకేష్ కు సైతం వలయంగా ఉండే నాయకత్వం ఇప్పుడు అవసరం. ఇప్పటికే లోకేష్ టీం పటిష్ట దిశగా ఉంది. మొన్నటి ఎన్నికల్లో ఆ టీం పనిచేసింది. ఆ టీం కు చెందిన కొంతమంది ఎన్నికల్లో పోటీ చేసి చట్టసభలకు ఎన్నికయ్యారు కూడా. అయితే చంద్రబాబు సన్నిహిత నేతల వారసులు కూడా.. లోకేష్ టీంలో ఉండడం విశేషం.వాస్తవానికి శ్రీకాకుళం నుంచి చిత్తూరు జిల్లా వరకు తెలుగుదేశం పార్టీకి పటిష్ట నాయకత్వం ఉంది. అయితే రాష్ట్రస్థాయిలో పార్టీని నడపడం, సంక్షోభాలను ఎదుర్కోవడం, చిక్కుముడులను తప్పించడం, కార్యకర్తలకు మార్గదర్శక నిలవడం, అధినేతకు నమ్మకస్తులుగా ఉండేవారే ఈ టీంలో తప్పకుండా ఉంటారు. అయితే అలాంటివారు ఎవరు అన్నది ఇప్పుడు ప్రధానంగా చర్చ జరుగుతోంది.

శ్రీకాకుళం నుంచి కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, గౌతు శిరీష, విజయనగరం నుంచి సుజయకృష్ణ రంగారావు, అదితి గజపతిరాజు? విశాఖ జిల్లా నుంచి గంటా శ్రీనివాస్, చింతకాయల విజయ్, వంగలపూడి అనిత? గోదావరి జిల్లాల నుంచి జ్యోతుల నవీన్, సానా సతీష్, పుట్ట మహేష్ కుమార్ యాదవ్.. కృష్ణాజిల్లా నుంచి దేవినేని ఉమామహేశ్వరరావు, బుద్ధ వెంకన్న పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. గుంటూరు జిల్లా నుంచి కోడెల శివరాం, కోవెలమూడి రవీంద్ర, పెమ్మసాని చంద్రశేఖర్, లావు శ్రీకృష్ణదేవరాయలు.. ప్రకాశం జిల్లా నుంచి దామచర్ల సత్య.. నెల్లూరు జిల్లా నుంచి కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి.. రాయలసీమ జిల్లాల నుంచి బైరెడ్డి శబరి, రెడ్డప్ప గారి మాధవి రెడ్డి, పరిటాల శ్రీరామ్, జెసి పవన్ రెడ్డి, అస్మిత్ రెడ్డి వంటి వారు లోకేష్ టీం అని ప్రచారం జరుగుతోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# బెజవాడ నుంచి లూప్ లైన్ లోకి ట్రైన్లు

విజయవాడ, మే 29,భారతదేశంలోని అతిపెద్ద రైల్వే జంక్షన్ లలో ఒకటి. హౌరా– చెన్నై, న్యూ ఢిల్లీ –చెన్నై, విజయవాడ –నిడదవోలు (లూప్ ) వంటి కీలక మైన రైల్వే లైను ఈ స్టేషన్ గుండా వెళ్తాయి. 10 ప్లాట్ ఫామ్ లు,24 ట్రాకులు తో రద్దీగా ఉండే ఈ రైల్వే స్టేషన్ నుండి ప్రారంభమయ్యే రైళ్లన్నీ ఇతర స్టేషనులకు తరలి వెళ్ళిపోతున్నాయి. ప్రస్తుతం కేవలం 6 ఎక్స్ప్రెస్ రైళ్లు మాత్రమే విజయవాడ నుంచి (అంటే ఆరిజన్ స్టేషన్ విజయవాడ గా) నడుస్తున్నాయి. ప్రస్తుతం విజయవాడ స్టేషన్ నుంచి బయలుదేరే ఎక్స్ప్రెస్ రైళ్లు 6 మాత్రమే ఉన్నాయి. అవి 3 సిస్టర్స్ గా పిలుచుకునే

1) ట్రైన్ నెంబర్ 12713– విజయవాడ–కాచిగూడ– శాతవాహన ఎక్స్ ప్రెస్

2) ట్రైన్ నెంబర్ 12711– విజయవాడ– చెన్నై – పినాకిని ఎక్స్ ప్రెస్

3) ట్రైన్ నెంబర్ 12718– విజయవాడ– విశాఖపట్నం– రత్నాచల్ ఎక్స్ ప్రెస్

ఈ మూడు సూపర్ ఫాస్ట్ రైళ్లను త్రీ సిస్టర్స్ గా పిలుస్తారు. ఈ మూడూ ఉదయం 6 గంటల ప్రాంతంలో విజయవాడ స్టేషన్ నుండి బయలుదేరి మళ్లీ సాయంత్రానికి విజయవాడ చేరుకుంటాయి.అవి ట్రైన్ నెంబర్ 12707/12708 చెన్నై– విజయవాడ– చెన్నై జన శతాబ్ది ఎక్స్ప్రెస్. ఇది మంగళవారం మినహా మిగిలిన 6 రోజులూ ప్రయాణిస్తుంది. విజయవాడలో మధ్యాహ్నం 3:30 గంటలకు ఈ ట్రైన్ బయలుదేరుతుంది.2) 12743/12744– గూడూరు– విజయవాడ– గూడూరు– విక్రమసింహపురి అమరావతి ఎక్స్ ప్రెస్. ఈ ట్రైన్ ప్రతిరోజు విజయవాడలో 6 గంటలకు బయలుదేరుతుంది. 3) 12796/12795 లింగంపల్లి– విజయవాడ– లింగంపల్లి ఎంప్లాయిస్ స్పెషల్. ఈరైలు ప్రతిరోజు సాయంత్రం 5:30 కి విజయవాడలో బయలుదేరి లింగంపల్లి వెళుతుంది.

ఓవరాల్ గా విజయవాడకు ప్రస్తుతం మిగిలిన ఆరు ఇంటర్సిటీ రైళ్లు ఇవి మాత్రమే. ఇంతకుముందు విజయవాడ నుంచి బయలుదేరి వెళ్లే ధర్మవరం రైళ్లను ఇప్పుడు మచిలీపట్నం నుంచి ఒకటి, నరసాపురం మరొకటి గా మార్చేశారు. అలాగే విజయవాడ హౌరా మధ్య తిరిగే హమ్ సఫర్ ఎక్స్ ప్రెస్ ను తిరుపతి కి తీసుకుపోయారు. ఉత్తరాంధ్ర ప్రజలకు అందుబాటులో ఉండే ముఖ్యమైన విజయవాడ రాయగడ ప్యాసింజర్ ను ఎక్స్ప్రెస్ గా ప్రమోట్ చేసి దానిని గుంటూరు రాయగడగా మార్చేశారు. ప్రస్తుతం విజయవాడ నుంచి చెన్నై వెళుతున్న వందేభారత్ ను కూడా నరసాపురం నుంచి నడిపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి అన్న ప్రచారం బలంగా వినిపిస్తోంది. అదే కనుక జరిగితే అతి ముఖ్యమైన విజయవాడ రైల్వే స్టేషన్ ఆరిజన్ స్టేషన్గా ఉండే ఆరు ఇంటర్సిటీ ఎక్స్ప్రెస్ లు కొన్ని ప్యాసింజర్ రైళ్లు మాత్రమే మిగులుతాయి.విజయవాడ స్టేషన్ కి అతి ముఖ్యమైన సమస్య స్థలం లేకపోవడం. ఎప్పుడో 1888లో కట్టిన ఈ రైల్వే స్టేషన్ కు గతంలో ఏడు ప్లాట్ ఫామ్ లు ఉండేవి. ప్రస్తుతం వన్ టౌన్ సైడు మరో మూడు ప్లాట్ ఫామ్ లు పెంచి మొత్తానికి 10 చేశారు. ప్రస్తుతం ఈ స్టేషన్ ఔాడ 1 క్యాటగిరి లో ఉంది. అంటే కనీసం లక్ష మంది ప్రయాణికులు రోజు ఈ స్టేషన్ నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. 190 ట్రైన్స్,170 గూడ్స్ రైళ్లు విజయవాడ స్టేషన్ మీదుగా ప్రతిరోజు ప్రయాణిస్తుంటాయి. దానితో స్టేషన్ నుండి కొత్తగా బయలుదేరే రైళ్లను వేయలేకపోతోంది రైల్వే శాఖ. హాలో కొత్తగా వేసే రైళ్లకి ఇక్కడ ప్లేస్ ఉండటం లేదు. ఏదన్నా కొత్త రైలు విజయవాడ నుంచి బయలుదేరేలా దానిని ప్లాట్ ఫామ్ పై ఎక్కువసేపు నిలిపి ఉంచాలి. దానివల్ల వేరే రైళ్లకు అడ్డంకిగా మారుతుంది. అందుకే ప్రస్తుతం కొత్త రైళ్లను విజయవాడ నుంచి బయలుదేరేలా వేయడం లేదు. పోనీ ప్లాట్ఫామ్ లు పెంచుదామా అంటే విజయవాడ రైల్వే స్టేషన్ సరిగ్గా నగరం నడిబొడ్డున ఉంది. అక్కడ కొత్తగా ప్లాట్ ఫామ్ లు కట్టే అవకాశం లేదు. ప్రస్తుతం ఈ సమస్యకు విజయవాడకి చుట్టుపక్కల శాటిలైట్ స్టేషన్లు కట్టడం ఒక్కటే మార్గంగా కనిపిస్తోంది రైల్వే శాఖకు. అందుకే విజయవాడ నిడదవోలు మార్గంలో రామవరప్పాడు, విజయవాడ హౌరా మార్గంలో గుణదల, విజయవాడ న్యూఢిల్లీ మార్గంలో రాయనపాడు స్టేషన్లను సాటిలైట్ స్టేషన్లుగా ఆధునికంగా మార్చుతున్నారు. మరొక మూడు నాలుగు నెలల్లో ఇవి రెడీ అయిపోతే చాలా ట్రైన్లను విజయవాడ మెయిన్ స్టేషన్కు రాకుండా డైవర్ట్ చేయొచ్చు. అప్పుడు విజయవాడ నుంచి బయలుదేరి వెళ్లేలా సరికొత్త రైళ్లను కేటాయించే అవకాశం కేంద్రానికి ఉంటుంది. అందుకే రైల్వే డిపార్ట్మెంట్ ఈ సాటిలైట్ స్టేషన్ల నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది.

# తూర్పు నుంచే ప్రారంభమైన సినిమా వివాదం

కాకినాడ, మే 29, జూన్ 1వ తేదీ నుంచి సినిమా థియేటర్ల బంద్‌కు ఎగ్జిబిటర్స్ అండ్ డిస్ట్రిబ్యూటర్స్‌లోని ఓ వర్గం పిలుపునిచ్చింది. దీనిని తెలుగు ఫిల్మ్ చాంబర్ ఖండించింది. థియేటర్ల బంద్‌కు ఎలాంటి అవకాశం లేదని ప్రకటించడం జరిగింది. ఈ క్రమంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ఈ విషయం చేరింది. జూన్ 12వ తేదీన 'హర హర వీర మల్లు' సినిమా రిలీజ్‌కు ముందు ఇలాంటి ప్రకటనలు రావడం, దానిపై ఏపీ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్ పోలీసు విచారణకు ఆదేశించడంతో ఇది సంచలనంగా మారింది. ఆ నలుగురు ఇండస్ట్రీ వ్యక్తుల వల్లే ఇదంతా అన్న చర్చ తీవ్రంగా సాగింది. దీనిపై దిల్ రాజు, అల్లు అరవింద్ వంటి సినిమా ప్రముఖులు మాట్లాడారు. అయితే, దీనిపై దిల్ రాజు మాట్లాడుతూ ఈ బంద్‌తో తమకు సంబంధం లేదని, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఓ జనసేన పార్టీ నేతే కారణమని ప్రెస్‌మీట్‌లో ప్రకటించడం మరింత సంచలనంగా మారింది.జనసేన పార్టీ నుంచి సస్పెన్షన్‌కు గురైన అత్తి సత్యనారాయణ ఎగ్జిబిటర్ కమ్ డిస్ట్రిబ్యూటర్. 'అను శ్రీ ఫిల్మ్స్' పేరుతో సినిమా డిస్ట్రిబ్యూటర్‌గా అత్తి సత్యనారాయణకు పేరుంది. అంతేకాకుండా, తెలుగు సినీ చాంబర్ ఆఫ్ కామర్స్‌లో కార్యవర్గ సభ్యుడిగా ఉన్నారు. తూర్పు గోదావరి జిల్లా డిస్ట్రిబ్యూటర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కూడాను. రాజమండ్రిలో జేకే క్లాసిక్‌లో జరిగిన సమావేశంలో ఆయన సినిమా బంద్ పిలుపునకు భాగస్వామి అయ్యారన్న వార్తలు బయటకు వచ్చాయి.సినిమా థియేటర్ల బంద్ పిలుపు అనేది ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్ల మధ్య జరిగిన చర్చలు విఫలం కావడం వల్ల వచ్చింది. ఈ పిలుపు వెనుక అత్తి సత్యనారాయణ ఉండటం వల్ల తూర్పుగోదావరి జిల్లా పేరును దిల్ రాజు ప్రస్తావించారు. అయితే, ఉభయ గోదావరి జిల్లా విషయానికి వస్తే, ఇక్కడ పెద్ద సంఖ్యలో సింగిల్ స్క్రీన్ థియేటర్లు ఉన్నాయి. ఏపీలో దాదాపు వెయ్యి సింగిల్ స్క్రీన్ థియేటర్లు, మల్టీప్లెక్స్‌లు ఉంటే, అందులో ఉభయ గోదావరి జిల్లాల్లో 50 నుంచి 60 వరకు థియేటర్లు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఈ సింగిల్ స్క్రీన్ థియేటర్లు ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. టికెట్ల ధరల నియంత్రణ, థియేటర్ల అద్దె విధానం కాకుండా రెవెన్యూ షేరింగ్ విధానం అమలు చేయాలని, కొత్త సినిమాలను ఓటీటీలలో కొంత ఆలస్యంగా విడుదల చేయాలని లేకపోతే థియేటర్ల మనుగడ ప్రశ్నార్థకమని ఇక్కడి ఎగ్జిబిటర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో తూర్పుగోదావరి జిల్లా నుంచి ఈ డిమాండ్ మొదలై సినిమా హాళ్ల బంద్ వరకు వెళ్లింది. సినిమా రంగానికి సంబంధించి కూడా ఉభయ గోదావరి జిల్లాల ప్రాముఖ్యత అంతా ఇంతా కాదు. అలా థియేటర్ల బంద్ సమస్య రెండు తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశమైంది. చివరకు ఈ పిలుపుకు వెనుక ఉన్నారన్న కారణంతో జనసేన నాయకుడు అత్తి సత్యనారాయణపై వేటు పడింది

# హస్తినతో బంధాలు తెగినట్టేనా

విజయవాడ, మే 29, వైసీపీ అధినేత వైఎస్ జగన్ కు ఢిల్లీలో పట్టు పోయినట్లు పైకి మాత్రం కనిపిస్తుంది. నిన్న మొన్నటి వరకూ అధికారంలో ఉన్నప్పుడు వైఎస్ జగన్ తరచూ ఢిల్లీ వెళ్లేవారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అభివృద్ధి పనుల గురించి ప్రధాని నరేంద్ర మోదీతో పాటు కేంద్ర మంత్రులు అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లు కలసి వచ్చేవారు. ఢిల్లీ పెద్దలు కూడా జగన్ ను ఆదరించేవారు. నాడు అధికారంలో ఉన్నప్పుడు అందరితో పరిచయాలు పెంచుకుని కొన్ని ప్రాజెక్టులను కూడా ఏపీకి తేగలిగారు. దీంతో పాటు తనకు నాడు మిథున్ రెడ్డి, విజయసాయిరెడ్డి ఢిల్లీలో ఉండి అన్ని రకాలుగా కొంత సహకారం అందించేవారు. జగన్ ఐదేళ్లలో అనేక సార్లు ఢిల్లీకి వెళ్లి మోదీని కలిసి వచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా జగన్ ను ఆప్యాయంగా పలకరించేవారు. దగ్గరకు తీసుకునే వారు. అలాంటి జగన్ గత ఎన్నికల్లో ఓటమి పాలయిన తర్వాత ఢిల్లీ గడప తొక్కలేదు. ఢిల్లీతో కనెక్షన్ కట్ అయింది. ఎన్నికలకు ముందే బీజేపీతో చంద్రబాబు, పవన్ కల్యాణ్ పొత్తు పెట్టుకోవడంతో ఢిల్లీకి ఉన్న సంబంధాలు దాదాపు తెగిపోయాయి. జగన్ ను ఢిల్లీలో పట్టించుకునే వారే లేరు. అదే సమయంలో ఢిల్లీలో తన పార్టీ తరుపున లాబీయింగ్ చేసే వారు కూడా లేరు. విజయసాయిరెడ్డి కూడా పార్టీని వీడి వెళ్లిపోవడంతో ఇక ఢిల్లీలో పెద్దలను కలసి మాట్లాడే వారే లేరు. జగన్ నేరుగా వెళ్లి కలిసే పరిస్థితి లేదు. అదే సమయంలో ఢిల్లీ పెద్దలు ఇంకా జగన్ పట్ల కొంత సాఫ్ట్ కార్నర్ తోనే ఉన్నారన్న ప్రచారం జరుగుతుంది. జగన్ మళ్లీ పుంజుకునే అవకాశాలున్నాయన్న సమాచారంతో ఢిల్లీ పెద్దలు పెద్దగా జగన్ ను టార్గెట్ చేయడం లేదన్న అభిప్రాయం అందరిలోనూ వ్యక్తమవుతుంది. జగన్ కు ప్రజల్లో ఉన్న అభిమానం, గత ఎన్నికల్లో నలభై శాతం ఓట్లు రావడంతో జగన్ ను సులువుగా వదులుకునేందుకు సిద్ధంగా లేరు. అందుకే ప్రధాని నరేంద్ర మోదీ నుంచి కేంద్ర మంత్రుల వరకూ చంద్రబాబు నాయుడును, పవన్ కల్యాణ్ ను పొగుడుతున్నారు తప్పించి, జగన్ ను మాత్రం పన్నెత్తుమాట అనడం లేదన్న కామెంట్స్ హస్తినలో వినిపిస్తున్నాయి. జగన్ తమకు బయట నుంచి మద్దతు ఇస్తుండటంతో పరోక్షంగా కొంత మేలు చేసే ఉద్దేశ్యంతోనే ఢిల్లీ పెద్దలున్నారని, హాని మాత్రం తలపెట్టరన్న వ్యాఖ్యలు రాజకీయంగా వినిపిస్తున్నాయి. జగన్ కూడా అదే ధైర్యంతో ఉన్నారని తెలిసింది. .. అయితే ఆంధ్రప్రదేశ్ మద్యం స్కామ్ కేసులో ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ అధికారులు విచారణ చేస్తున్నప్పటికీ అది తూతూ మంత్రమేనంటున్నారు. ఇందులో జగన్ పార్టీని పెద్దగా ఇబ్బందులు పెట్టే అవకాశం లేకపోవచ్చు. కూటమిలోని మిత్ర పక్షాలైన టీడీపీ, జనసేన పార్టీలను సంతృప్తి పర్చడానికే ఈడీ మద్యం కేసులో విచారణను ఈడీ ప్రారంభించిందని, అంతే తప్ప ఈ విషయంలోనూ జగన్ కు పెద్దగా నష్టం జరిగే అవకాశం లేదని అంటున్నారు. ఎందుకంటే జగన్ తో భవిష్యత్ అవసరాల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేసే ఛాన్స్ కూడా లేదన్నది విశ్లేషకుల అంచనా. మొత్తం మీద హస్తిన జగన్ పక్కనే ఉందన్న కామెంట్స్ సోషల్ మీడియాలో ఎక్కువగా వినిపిస్తున్నాయి.

# యాక్షన్... డైరక్షన్...

కడప మే 29, ఆంధ్రప్రదేశ్ లో తెలుగుదేశం పార్టీలో సమూల మార్పులు జరగనున్నాయి. పార్టీ జాతీయ అధ్యక్షుడిగా చంద్రబాబు నాయుడు తిరిగి ఎన్నికయ్యారు ముప్పయి ఏళ్లుగా చంద్రబాబు నాయుడు పార్టీ అధ్యక్ష బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి ఈ ఎన్నికను నిర్వహిస్తుంటారు.

1995లో మొదటి సారి చంద్రబాబు పార్టీ అధినేతగా ఎన్నికయ్యారు. అప్పటి నుంచి ఆయన ఇప్పటి వరకూ ఏకగ్రీవంగా ఎన్నికవుతూ వస్తున్నారు. జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికయిన చంద్రబాబుకు పార్టీ నేతలు, మంత్రులు ఎమ్మెల్యేలు శుభాకాంక్షలు తెలిపారు.అదే సమయంలో కడపలో జరిగే మహనాడు నుంచి జాతీయ ప్రధాన కార్యదర్శి పదవి నుంచి లోకేశ్ కు ప్రమోషన్ దక్కనుంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమించారు. ఇక పార్టీలో తీసుకునే నిర్ణయాలన్నీ లోకేశ్ తీసుకునే అవకాశముంది. చంద్రబాబు డైరెక్షన్ లో పార్టీ నడిచినప్పటికీ ఆయన సూచనలు, సలహాలు తీసుకుంటూ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేయనున్నారు లోకేశ్. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా బాధ్యతలను చేపట్టి రాష్ట్ర వ్యాప్త పర్యటనలు చేస్తూ లోకేశ్ వచ్చే ఎన్నికలకు శ్రేణులను సిద్ధం చేస్తారని కూడా తెలిసింది. ఇప్పుడు కాకపోయినా.. మరొకసమయంలోనైనా పార్టీ పగ్గాలు లోకేశ్ కు అప్పగించాల్సిందే. టీడీపీకి తర్వాత వారసుడు లోకేశ్ మాత్రమే. ఆ క్లారిటీ పదేళ్ల ముందే పార్టీలో వినిపించినా కనిపించలేదు. కానీ మొన్నటి ఎన్నికల్లో సూపర్ విక్టరీ తర్వాత లోకేశ్ కు పార్టీ పగ్గాలు అప్పగించాలన్ని నినాదం ఊపందుకుంది. సీనియర్ నేతల నుంచి యువనేతల వరకూ ఒకటే స్లోగన్. లోకేశ్ కు పార్టీలో పూర్తి స్థాయి బాధ్యతలను అప్పగించాలంటూ నేరుగా ప్రకటనలుచేయడం వెనక కూడా చంద్రబాబు ఉన్నారు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడే లోకేశ్ కు పగ్గాలు అప్పగించడం మంచిదన్న అభిప్రాయానికి చంద్రబాబు కూడా వచ్చారు. అందులో భాగంగానే వర్కింగ్ ప్రెసిడెంట్ గా చేయనున్నారు.. రానున్న నాలుగేళ్లలో లోకేశ్ క్యాడర్ కు, నేతలకు మరింత దగ్గరయ్యే అవకాశాలను చంద్రబాబు కల్పించనున్నారు. అది పార్టీకి, లోకేశ్ కు కూడా మంచిదే. ఆయన వారితో ఎక్కువ సమయం గడిపే అవకాశం ఉండటంతో పాటు ఆయన టీంతో పార్టీని మరొకసారి అధికారంలోకి తీసుకురాగలిగితే అంతకంటే తండ్రికి కావాల్సింది ఏముంటుంది? అని చంద్రబాబు ఆలోచనగా ఉంది. చంద్రబాబు ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఎక్కువ సమయం పార్టీ కోసం కేటాయించలేకపోతున్నారు. అధికారులతో సమీక్షలు, సమావేశాలతో పాటు ఢిల్లీ చుట్టూ తిరగడంతో పాటు అనేక ముఖ్యమైన సమస్యలను అమరావతి, పోలవరం వంటివి పరిష్కరించాల్సిన సమయంలో పార్టీ పూర్తి బాధ్యతలను లోకేశ్ కు అప్పగించడం మేలన్న నిర్ణయానికి వచ్చారు. నారా లోకేశ్ ఇప్పటికే క్యాడర్ కు, నేతలకు అందుబాటులో ఉంటున్నారు. వారి సమస్యలను పరిష్కరిస్తున్నారు.

ప్రత్యేకంగా వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి లేకపోయినా పార్టీ కార్యక్రమాలను గత కొంత కాలంగా ఆయనే చూస్తున్నారు. నిర్ణయాలు కూడా లోకేశ్ తీసుకుంటున్నారు. పదవుల ఎంపికలోనూ లోకేశ్ పాత్ర కీలకమనే చెప్పాలి. క్యాడర్ తో మరింత కనెక్ట్ అయ్యేందుకు కేవలం పేరు వెనక ట్యాగ్ మాత్రమే కానీ లోకేశ్ ఆల్రెడీ క్యాడర్ లోనూ, లీడర్లలోనూ పార్టీ అధినేతగా ముద్ర పడిపోయారు. కాకుంటే శంఖంలో పోస్తే కాని తీర్థం కాదు అన్నట్లుగా లోకేశ్ కు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇచ్చినట్లయితే ఇక భవిష్యత్ లో పార్టీ చినబాబు చేతుల మీదుగానే నడుస్తుంది. దానికి మహానాడులో స్టాంప్ పడబోతుంది.

# తీగ దొరికింది..డొంక కదిలింది

## అక్రమ శిశు విక్రయాలలో అంతర్రాష్ట్ర నెట్ వర్క్

సూర్యాపేటలో సంచలనం సృష్టించిన పిల్లల అక్రమ రవాణా ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. ఈ ముఠాకు చెందిన 13 మంది సభ్యులను అదుపులోకి తీసుకున్నామని, ఇప్పటివరకు 28 మంది చిన్నారులను అక్రమంగా రవాణా చేసినట్లు గుర్తించామని సూర్యాపేట ఎస్పీ నరసింహ మీడియా కు వెల్లడించారు.

ఈ కేసులో పది మంది చిన్నారులను పోలీసులు సురక్షితంగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఏడుగురు బాలురు, ముగ్గురు బాలికలు ఉన్నారు. టేకుమట్ల గ్రామంలో అక్రమ దత్తతకు సంబంధించిన విశ్వసనీయ సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు..పోలీసుల దర్యాప్తులో అబ్బుర పరిచే విషయాలు వెలుగు చూశాయి. సూర్యాపేట పట్టణానికి చెందిన యాదగిరి, ఉమారాణి అనే వ్యక్తులు ఈ ముఠాకు ప్రధాన సూత్రధారులుగా గుర్తించారు. వీరు తమ కోడిగుడ్ల పంపిణీ వృత్తిని అడ్డుపెట్టుకొని, పిల్లలు లేని తల్లిదండ్రుల గురించి తెలుసుకునేవారు. ఆడ, మగ శిశువులను బట్టి రూ. 10 వేల నుంచి రూ. 2 లక్షల వరకు కమిషన్ తీసుకుని, మొత్తం రూ. 5 లక్షల నుండి రూ. 10 లక్షల వరకు బేరం కుదుర్చుకొని అక్రమంగా దత్తత తీసుకున్న పిల్లలను వారికి అందించేవారు. ఈ ముఠాకు మహారాష్ట్ర, గుజరాత్, ముంబయి వంటి రాష్ట్రాలతో కూడా సంబంధాలున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. ముఠాలోని ఏ6, ఏ8, ఏ9, ఏ10, ఏ11 నిందితులపై గతంలో మేడిపల్లి, మునగాల, మంగళగిరి, జనగాం సీఐడీ, ముంబైలలో కూడా ఇలాంటి కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఇది వారి నేర చరిత్రను, ఈ దందా ఎంత పెద్ద ఎత్తున సాగుతోందో వెల్లడిస్తోంది. బుధవారం ఉదయం అక్రమ దత్తతలకు సంబంధించిన విశ్వసనీయ సమాచారం మేరకు, అక్రమంగా దత్తత తీసుకున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని, వారి ఒప్పుకోలు ఆధారంగా ఏ1, ఏ2 లను అరెస్ట్ చేశారు. అదే సమయంలో, శిశువుల అక్రమ రవాణా గురించి చర్చించడానికి ముఠా సభ్యులు సూర్యాపేట హైటెక్ బస్టాండ్ వద్ద ఉన్నారని తెలియడంతో, పోలీసులు అక్కడికి చేరుకుని ఏ3 నుండి ఏ13 వరకు ఉన్న నిందితులను అరెస్ట్ చేశారు.

ఈ శిశు విక్రయాల ముఠా గుట్టు రట్టయిన తర్వాత, తీగ లాగితే డొంక కదిలిన చందంగా ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా పదుల సంఖ్యలో బాధితులు సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్కు చేరుకొని ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలు లేక బాధపడుతున్న తల్లిదండ్రుల ఆశను ఆసరాగా చేసుకొని లక్షల రూపాయలు దండుకొని పసికందులను అప్పజెప్పి సొమ్ము చేసుకున్న ఈ ముఠా నిర్వాకం ఇప్పుడు వేలాది మందిని షాక్కు గురిచేసింది.

జువెనైల్ జస్టిస్ (కేర్ అండ్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్) యాక్ట్, 2015 ప్రకారం, పిల్లలను అక్రమంగా విక్రయించడం లేదా కొనుగోలు చేయడం తీవ్రమైన నేరంగా పరిగణించబడుతుంది.ఈ చట్టం పిల్లల ఉత్తమ ప్రయోజనాలను పరిరక్షించడంపై దృష్టి పెడుతుంది. అలాగే, సరోగసీ (నియంత్రణ) చట్టం, 2021 వంటివి అక్రమ సరోగసీని నిరోధిస్తాయి.

ఈ కేసు అనేక సామాజిక, నైతిక ప్రశ్నలను లేవనెత్తుతోంది. పిల్లల అక్రమ రవాణాను అడ్డుకోవడానికి, సరైన దత్తత ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు మరింత కృషి చేయాల్సిన అవసరం ఉంది. నాలుగు సంవత్సరాలుగా కంటికి రెప్పలా పెంచుకున్న పిల్లలను దూరం చేసుకోవాల్సిన తల్లిదండ్రుల బాధ, అక్రమ రవాణాకు పాల్పడిన వారికి చట్టం విధించే శిక్ష.. ఈ కథలో చివరికి ఎవరు విజేత గా నిలుస్తారు..? ఎవరు బాధితులు? చిన్నారుల భవిష్యత్తు ఏంటి? ఈ దర్యాప్తులో ఇంకెన్ని నిజాలు వెలుగులోకి వస్తాయో.

## కాంగ్రెస్ కార్పొరేటర్ వేధింపులకు బీ ఆర్ ఎస్ నేత బలి

బోరబండ కాంగ్రెస్ కార్పొరేటర్ వేధింపులకు బోరబండ డివిజన్ బీ ఆర్ ఎస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సర్దార్(30) ఆత్మహత్య చేసుకున్నాడు. గత కొన్ని నెలలుగా సర్దార్ ని పలురకాలుగా కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ వేధిస్తున్నట్లు, 15రోజుల క్రితం సర్దార్ ఇంటిని సైతం బాబా ఫసియుద్దీన్ కూల్చివేయించినట్లు ఆరోపణ. అన్ని వైపుల నుంచి వేదింపులు ఎక్కువ కావడంతో సర్దార్ ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబికులు అంటున్నారు. ఈ నేపథ్యంలో బోరబండలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలీస్ స్టేషన్ వద్ద కుటుంబసభ్యులు. స్థానికులు ఆందోళనకి దిగారు. సర్దార్ మృతికి కారణమైన బాబా ఫసియుద్దీన్ మీద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేసారు. రెండున్నర ఏళ్ల వయస్సున్న పిల్లలు ఉన్నారంటూ కుటుంబ సభ్యులు కన్నీళ్ల పర్యంతం అయ్యారు.

# అన్నదాత సుఖీభవ పై ఫుల్ క్లారిటీ

నెల్లూరు, మే 29, అన్నదాత సుఖీభవ పై ఫుల్ క్లారిటీ వచ్చింది. రైతులకు ఏటా పెట్టుబడి సాయంగా 20 వేల రూపాయలు అందించే అన్నదాత సుఖీభవ పథకం అమలుపై స్పష్టత ఇచ్చింది ఏపీ ప్రభుత్వం. కడప మహానాడు వేదికగా అన్నదాత సుఖీభవ పథకం ఎప్పుడు అమలు చేస్తామనే విషయాన్ని సీఎం చంద్రబాబు ప్రకటించారు. పిఎం కిసాన్ యోజన తొలి విడత నగదు పడిన సమయంలోనే అన్నదాత సుఖీభవ తొలి విడత సాయం అందిస్తామని చంద్రబాబు క్లారిటీ ఇచ్చారు. అదే సమయంలో మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం ఆగస్టు 15 నుంచి ప్రారంభిస్తామని కూడా వెల్లడించారు. సీఎం ప్రకటనతో రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. ఖరీఫ్ ప్రారంభం నాటికి తమకు తొలి విడత అన్నదాత సుఖీభవ నిధులు అందుతాయని వారు నమ్మకం పెట్టుకున్నారువైయస్ జగన్మోహన్ రెడ్డి 2019లో నవరత్నాల పథకంలో భాగంగా రైతు భరోసా పథకానికి హామీ ఇచ్చారు. అధికారంలోకి వస్తే ఏడాదికి 15000 రూపాయలు పెట్టుబడి ప్రోత్సాహంగా అందిస్తామని హామీ ఇచ్చారు. అయితే తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వపరంగా 7500 కు మాత్రమే పరిమితం అయ్యారు. కేంద్రం అందించే పీఎం కిసాన్ 6000 రూపాయల నగదు తో పాటు 13,500 అందించారు. అయితే తాము అధికారంలోకి వస్తే సాగు సాయం కింద ఏటా 20వేల రూపాయల సాయం అందిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ హామీని అమలు చేసేందుకు ఇప్పుడు పూర్తిస్థాయిలో దృష్టి పెట్టారు. అయితే కేంద్రం అందించే 6000 రూపాయల మొత్తానికి.. మరో 14 వేల రూపాయలను జతచేస్తూ.. 20000 అందించేందుకు నిర్ణయించడం విశేషం జూన్ నెలలో అన్నదాత సుఖీభవ తో పాటు తల్లికి వందనం పథకం అమలు చేస్తామని ఇదివరకే సీఎం చంద్రబాబు ప్రకటించారు. అయితే ఇప్పుడు తల్లికి వందనం నగదును జమ చేసేందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. మరోవైపు అన్నదాత సుఖీభవ పథకం తొలి విడత సొమ్ము విడుదలకు సైతం సన్నాహాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. మహానాడు వేదికగా సీఎం చంద్రబాబు దీనిపై ప్రకటన చేశారు. కేంద్రం అందించే పీఎం కిసాన్ తొలి విడత రెండు వేల రూపాయలతో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి ఐదువేల రూపాయల మొత్తాన్ని కలిపి అందిస్తామని చెప్పుకొచ్చారు. అయితే సాధారణంగా కేంద్ర ప్రభుత్వం ప్రతి నాలుగు నెలలకు ఒకసారి పిఎం కిసాన్ నిధులను విడుదల చేస్తోంది. ఈ లెక్కన జూన్ మూడో వారంలో పిఎం కిసాన్ అందించేందుకు సన్నాహాలు ప్రారంభించింది. రాష్ట్ర ప్రభుత్వ వాటా సైతం అప్పుడే అందించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోందిమరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. అధికార యంత్రాంగం అర్హులను గుర్తించే పనిలో పడింది. అర్హుల జాబితా సిద్ధమయ్యాక పీఎం కిసాన్ యోజన నిధులు విడుదల సమయంలోనే అన్నదాత సుఖీభవ నిధులు కూడా విడుదల కానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా దరఖాస్తుల నమోదు ప్రక్రియలు అధికారులు బిజీగా ఉన్నారు. అర్హుల జాబితా కొలిక్కి వచ్చిన తర్వాత ప్రభుత్వానికి నివేదించనున్నారు. అదే సమయంలో పీఎం కిసాన్ నిధులు జమ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తద్వారా జూన్ మూడో వారంలో అన్నదాత సుఖీభవ నిధులు జమ అయ్యే పరిస్థితి కనిపిస్తోంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

నిబంధనలు

ఏపీకి చెందిన రైతులు మాత్రమే అర్హులు. ఐదు ఎకరాల్లోపు చిన్న సన్న కారు రైతులు అర్హులు. లబ్ధిదారు వయసు విధిగా 18 సంవత్సరాలు నిండి ఉండాలి. భూమికి సంబంధించి పక్కా పత్రాలు, పట్టాదారు పాసుబుక్ తప్పనిసరి. రైతు పేరుతో ఆధార్తో అనుసంధానమై ఉండాలి. రైతు పండించే పంటల వివరాలను నమోదు చేయాలి. భూమిని లీజుకు తీసుకున్న కౌలు రైతులకు కూడా ఈ పథకానికి అర్హులు. తప్పనిసరిగా కౌలు రైతు ధ్రువీకరణ పత్రం ఉండాలి. పిఎం కిసాన్ పథకానికి అర్హులైన వారంతా అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులే.కేవలం సొంత భూమి కలిగిన వారికే కాకుండా కౌలు తీసుకుని వ్యవసాయం చేసుకున్న వారికి సైతం ఈ పథకం వర్తిస్తుంది. అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తించేలా ఏపీ ప్రభుత్వం మార్గదర్శకాలను సైతం విడుదల చేసింది. అయితే కౌలు రైతు ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఆదాయ పన్ను చెల్లించిన వారికి అన్నదాత సుఖీభవ పథకం వర్తించదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు ఈ పథకానికి అనర్హులు. ప్రజా ప్రతినిధులకు సైతం ఈ పథకం వర్తించదు. పదివేల రూపాయల కంటే ఎక్కువ పింఛను పొందే వారికి అన్నదాత సుఖీభవ వర్తించదు. కేవలం కుటుంబాన్ని యూనిట్గా తీసుకుని అమలు చేయనున్నారు. అందుబాటులోకి వెబ్సైట్.. ష్ట్రబిబిజూబ://జీనినిజీటజీబిష్ట్రజీబబీఎష్ట్రతిఎష్ట్రజీలజీ ప్రత్యేక వెబ్సైట్ ఉంటుంది.

అందులో మన స్టేటస్ కూడా చెక్ చేసుకోవచ్చు. రైతు ఆధార్ కార్డు, పట్టాదార్ పాస్ బుక్ వంటి భూమి పత్రాలు, బ్యాంక్ పాస్ బుక్, మొబైల్ నెంబర్, భూమి వివరాలు, రైతుల పాస్పోర్ట్ సైజ్ ఫోటో, ఆధార్ కార్డు నెంబర్ను బ్యాంకు ఖాతాలో అనుసంధానం చేసుకొని ఉండాలి. అర్హులైన రైతులు తమ ఆధార్ కార్డు, భూమి పాసుబుక్, బ్యాంక్ పాస్ బుక్ తదితర పత్రాలతో రైతు సేవా కేంద్రంలో అధికారులను సంప్రదించాలి. అక్కడ సిబ్బందికి వివరాలను అందించాలి. అధికారులు రైతులు సమర్పించిన పత్రాలను పరిశీలించి, వివరాలను దృవీకరించుకొని సదరు రైతు పేరును లబ్ధిదారుల జాబితాలో చేర్చేందుకు సిఫారసు చేస్తారు. రైతు సేవా కేంద్రాల వారిగా నమోదైన వ్యాపిల్యాండ్ దాటాను ఉన్నతాధికారులు పరిశీలించి.. అర్హులైన వారికి అన్నదాత సుఖీభవ లబ్ధిదారుల జాబితాలో చేరుస్తారు.

# భారీగా పెరుగుతున్న డిఫెన్స్ ఆర్డర్లు

ఆపరేషన్ సిందూర్ తర్వాత భారతదేశంపై ప్రపంచ దేశాల వైఖరి ఒక్కసారిగా మారిపోయింది.. అమెరికా లాంటి దేశం కూడా మన గురించి ప్రత్యేకంగా ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది.. ఇక ఇతర దేశాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.

ఆపరేషన్ సిందూర్ ద్వారా మన సాయుధ సంపత్తి.. ఆయుధ సామర్థ్యం ప్రపంచానికి సరికొత్తగా తెలిసింది. ఇక ఉగ్రవాద దేశం పాక్ కు ఐతే ఎన్నో విధాలుగా నష్టం జరిగింది. ఉగ్రవాద స్థావరాలు నేలకూలిపోయాయి. విలువైన జలాలు ఆగిపోయాయి. పంట పొలాలు ఎండిపోతున్నాయి. తినడానికి తిండి గింజలు కరువయ్యాయి. మొత్తంగా చెప్పాలంటే తాగడానికి కూడా ఇప్పుడు అక్కడ నీరు లేదు. దేహీ అంటూ చివరికి మన పాదాల మీద పడాల్సిన పరిస్థితి అక్కడి ప్రజలకు ఏర్పడింది. ఇప్పటికే నీటి కోసం మన దేశానికి ఉగ్రవాద దేశం అనేకసార్లు లేఖలు రాసింది. అయినప్పటికీ భారత్ ఏ మాత్రం పట్టించుకోవడం లేదు.ఆపరేషన్ సిందూర్ మనకు అనేక ప్రయోజనాలను అందించింది. ఇందులో ఒకటి శత్రుదేశంలో దాక్కుని ఉన్న ముష్కరులను సర్వనాశనం చేయగా.. మరపక మన ఆయుధాల పనితీరు ఎంత కచ్చితంగా ఉన్నాయో ప్రపంచానికి తెలిసాయి. కేవలం ఫారిన్ కంట్రీస్ వెపన్స్ మీద ఆధారపడకుండా.. వాటికి ఇండియన్ టెక్నాలజీ జత చేయడం వల్ల ఊహించిన దానికంటే ఎక్కువ ఫలితాలు వచ్చాయని డిఫెన్స్ నిపుణులు చెబుతున్నారు. ఇజ్రాయిల్ నుంచి ఇండియన్ డిఫెన్స్ సంస్థ అయినటువంటి నైబీ లిమిటెడ్ కు భారీ ఆర్డర్ ఇచ్చింది. యూనివర్సల్ రాకెట్ లాంచర్లను సరఫరా చేయాలని కోరింది. ఈ ఆర్డర్ విలువ 150 కోట్లుగా ఉంటుందని తెలుస్తోంది. గడచిన కొన్ని వారాలుగా నేషనల్ డిఫెన్స్ స్టాక్ పై ఇన్వెస్టర్లు ఫోకస్ చేస్తున్నారు. ఈ క్రమంలో తాజా డీల్ వల్ల నైబ్ కంపెనీ షేర్ల ధర ఏకంగా 5% గ్రోత్ రిజిస్టర్ చేసింది. స్మాల్ క్యాప్ డిఫెన్స్ కంపెనీ స్టాక్ ధర ప్రస్తుతం ఒక్కొక్కటి 1602 రూపాయల వద్ద ట్రేడింగ్ సాగింది. గడిచిన 52 వారాల గరిష్ఠ ధర 2045 గా ఉన్న విషయం విధితమే. నైబీ సంస్థ పూణే కేంద్రంగా కార్యకలాపాల సాగిస్తోంది. 300 కిలోమీటర్ల రేడియస్ లో పనిచేయగలగే రాకెట్ లాంచర్లను తయారు చేయడం ఈ సంస్థ కున్న ప్రత్యేకత. ఈ కంపెనీ ఇజ్రాయిల్ దేశానికి రాకెట్ లాంచర్లను 2027 నవంబర్ మూడు నాటికి అందజేయాల్సి ఉంటుంది. అయితే ఈ లాంచర్లను ఏ సంస్థ డెలివరీ అందుకుంటున్నదో.. ఆ వివరాలను నైబీ సంస్థ గోప్యంగా ఉంచింది. ఇక కంపెనీ రిసీవ్ చేసుకున్న ఆర్డర్ ప్రపంచ స్థాయిలో అతెంటిఫికేషన్ ఇస్తుందని.. బిజినెస్ గ్రోత్ కు ఉపయోగపడుతుందని డిఫెన్స్ వర్గాలు అంటున్నాయి. ఇక దేశంలోని మొట్టమొదటిసారిగా నైబి సంస్థ వరల్డ్ మార్కెట్లో పాగా వెయ్యడానికి హైటెక్ యూనివర్సల్ రాకెట్ లాంచర్ లు తయారు చేస్తోంది. గడచిన ఐదు సంవత్సరాలలో నైబీ సంస్థ 16వేల శాతం రాబడిని ఇన్వెస్టర్లకు అందించింది. జూన్ 2020లో ఈ సంస్థ స్టాక్ ధర ఒక్కొక్కటి 9.93 గా ఉండటం విశేషం. కానీ ప్రస్తుతం అది 1600 పెరిగిపోయింది. ఇక గడిచిన నెలల కాలంలో స్టాక్ గ్రోత్ 18% పెరిగింది.భారత్ రక్షణ రంగంలో స్వావలంబన సాధించడానికి కావేరి ఇంజిన్ ప్రాజెక్ట్ ఒక కీలకమైన ప్రయత్నం. 1980లలో ప్రారంభమైన ఈ ప్రాజెక్ట్, స్వదేశీ ఫైటర్ జెట్ ఇంజిన్ను అభివృద్ధి చేసి, విదేశీ దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించాలనే లక్ష్యంతో ముందుకు సాగింది. సోషల్ మీడియాలో హ్యాష్ట్యాగ్ ద్వారా రక్షణ నిపుణులు, ఔత్సాహికులు, సామాన్య పౌరులు ఈ ప్రాజెక్ట్కు ప్రాధాన్యత ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ ఉద్యమం భారత వాయుసేన సాంకేతికతలో ఆత్మనిర్భరత సాధించే దిశగా ఒక బలమైన పిలుపునిస్తోంది.కావేరి ఇంజిన్ను రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలోని గ్యాస్ టర్బైన్ రీసెర్చ్ ఎస్టాబ్లిష్మెంట్ అభివృద్ధి చేసింది. ఈ లో?బైపాస్, ట్విన్?స్పూల్ టర్బోఫ్యాన్ ఇంజిన్ను 80 కిలో న్యూటన్ల థ్రస్ట్ ఉత్పత్తి చేసేలా రూపొందించారు, ప్రధానంగా లైట్ కంబాట్ ఎయిర్క్రాఫ్ట్ తేజస్కు శక్తినిచ్చేందుకు. అయితే, థ్రస్ట్ లోపాలు, బరువు సమస్యలు, అణ్వస్త్ర పరీక్షల వల్ల విధించిన అంతర్జాతీయ ఆంక్షలు ఈ ప్రాజెక్టను ఆలస్యం చేశాయి. ఫలితంగా, తేజస్ విమానాలు అమెరికా జనరల్ ఎలక్ట్రిక్ ఈ404 ఇంజిన్లను ఉపయోగించాయి.కావేరి ఇంజిన్ ప్రాజెక్ట్ అనేక సాంకేతిక సవాళ్లను ఎదుర్కొంది. ఏరోథర్మల్ డైనమిక్స్, సింగిల్ క్రిస్టల్ బ్లేడ్ తయారీ, స్కాచ్ కంట్రోల్ సిస్టమ్ వంటి అధునాతన సాంకేతికతల అభివృద్ధిలో భారత్కు అనుభవం తక్కువగా ఉంది. నైపుణ్యం కలిగిన మానవ వనరుల కొరత, పశ్చిమ దేశాల సాంకేతిక ఆధిపత్యం కూడా ప్రధాన అడ్డంకులుగా నిలిచాయి. అయినప్పటికీ, ఇటీవలి సంవత్సరాల్లో ఈ ప్రాజెక్ట్లో గణనీయమైన పురోగతి సాధించారు. కావేరి డెరివేటివ్ ఇంజిన్ కిలో న్యూటన్ల డ్రై థ్రస్ట్ను సాధించి, 2024లో ఫ్లైట్ టెస్టింగ్కు అనుమతి పొందింది. ఈ ఇంజిన్ను మానవ రహిత యుద్ధ విమానం 'ఘాతక్'లో ఉపయోగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.సోషల్ మీడియా ప్లాట్ఫామ్ ఎక్స్లో హ్యాష్ట్యాగ్ ట్రెండింగ్లో నిలిచింది, ఇది భారత పౌరులు, రక్షణ నిపుణులు, ఔత్సాహికుల ఏకగ్రీవ ఆకాంక్షను ప్రతిబింబిస్తోంది. ఈ ఉద్యమం భారత్ను విదేశీ ఇంజిన్లపై ఆధారపడకుండా చేయడం, జాతీయ భద్రతను బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్ ఏప్రిల్ 30, 2025న కావేరి ప్రాజెక్ట్కు అదనపు నిధులను ప్రకటించడంతో ఈ ఉద్యమం మరింత ఊపందుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ట్యాగ్ చేస్తూ, ఈ ప్రాజెక్ట్కు మరింత నిధులు, వనరులు కేటాయించాలని నెటిజన్లు కోరుతున్నారు. కొందరు ఈ ప్రాజెక్ట్ కోసం ఉచిత పథకాల నిధులను తగ్గించాలని సూచించారు, ఇది జాతీయ ప్రయోజనాలకు ఎంత ముఖ్యమో సూచిస్తుంది.కావేరి ఇంజిన్ను మరింత శక్తివంతంగా, ఆధునికంగా తీర్చిదిద్దేందుకు భారత్ ఫ్రాన్స్లోని సాఫ్రాన్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం కింద, కొత్త లోహ మిశ్రమాలు, సింగిల్ క్రిస్టల్ బ్లేడ్లు, అధునాతన టర్బోఫ్యాన్ సాంకేతికతలను అభివృద్ధి చేయడానికి సాఫ్రాన్ సహకారం అందిస్తుంది. ఈ సహకారం ద్వారా కావేరి 2.0 వంటి మరిన్ని అధునాతన వెర్షన్లను తయారు చేసే అవకాశం ఉంది, ఇవి అడ్వాన్స్డ్ మీడియం కంబాట్ ఎయిర్క్రాఫ్ట్, ఘాతక్ లలో ఉపయోగపడతాయి.కావేరి ఇంజిన్ ప్రాజెక్ట్ విజయవంతమైతే, భారత్ రక్షణ రంగంలో ఒక సుప్రధానమైన మైలురాయిని సాధిస్తుంది.

ఇది కేవలం ఫైటర్ జెట్లకు శక్తినిచ్చే ఇంజిన్గా మాత్రమే కాక, భారత్ను సాంకేతికంగా, వ్యూహాత్మకంగా ఆత్మనిర్భర దేశంగా నిలబెడుతుంది. ఇటీవలి 'ఆపరేషన్ సిందూర్' వంటి విజయాలు భారత సైనిక సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పాయి. కావేరి ఇంజిన్ వంటి స్వదేశీ ప్రాజెక్టులు ఈ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేస్తాయి.ఉద్యమం కేవలం సోషల్ మీడియా ట్రెండ్ కాదు, ఇది భారత జాతీయ ఆకాంక్షలకు, రక్షణ రంగంలో స్వావలంబనకు ఒక బలమైన పిలుపు. ఈ ప్రాజెక్ట్కు అవసరమైన నిధులు, వనరులు, సాంకేతిక నైపుణ్యం అందించడం ద్వారా భారత్ తన రక్షణ సామర్థ్యాలను మరింత బలోపేతం చేయగలదు. ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకునే చర్యలు భారత్ను గగనతల యుద్ధ సాంకేతికతలో అగ్రగామిగా నిలబెట్టగలవు.

# ఇక ఇంటర్నెట్ విప్లవమేనా

న్యూఢిల్లీ, మే 29, భారత దేశంలో ఇంటర్నెట్ సేవలు అంటే అందరూ జియో గురించే చెబుతారు. జియో రాకతో టెలికం రంగంలో సంచలనంగా మారింది. తక్కువ ధరతో ఎక్కువ స్పీడ్ ఇంటర్నెట్ అందిస్తోంది. ప్రస్తుతం దేశంలో జియో, భారతి టెల్ టాప్లో ఉన్నాయి. ఇటీవల బీఎస్ఎన్ఎల్ వినియోగం కూడా పెరిగింది. ఈ క్రమంలో ఎలాన్ మస్క్ నేతృత్వంలోని స్పేస్ఎక్స్ సంస్థ అందిస్తున్న స్టార్లింక్ శాటిలైట్ ఇంటర్నెట్ సేవలు భారతదేశంలో త్వరలో ప్రారంభం కానున్నాయి. ఈ సేవలు గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో వేగవంతమైన, నమ్మదగిన ఇంటర్నెట్ కనెక్టివిటీని అందించే లక్ష్యంతో రూపొందించబడ్డాయి.డిపార్ట్మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ (డీవోటీ) నుంచి లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్వోఐ) పొందిన స్టార్లింక్, భారత మార్కెట్లో పోటీతత్వ ధరలతో సేవలను అందించేందుకు సన్నద్ధమవుతోంది. స్టార్లింక్ అనేది స్పేస్ఎక్స్ అభివృద్ధి చేసిన శాటిలైట్ ఆధారిత ఇంటర్నెట్ సేవ, ఇది లో-ఎర్త్ ఆర్బిట్ (ఎల్ఈవో) శాటిలైట్ల ద్వారా హై-స్పీడ్ ఇంటర్నెట్ను అందిస్తుంది. సంప్రదాయ బ్రాడ్బ్యాండ్ సేవలకు భిన్నంగా, ఇది ఫైబర్ కేబుల్స్ లేదా సెల్ టవర్లపై ఆధారపడకుండా, ఆకాశంలో స్పష్టమైన దృశ్యం ఉన్న ఏ ప్రాంతంలోనైనా ఇంటర్నెట్ను అందిస్తుంది. భారతదేశంలోని గ్రామీణ ప్రాంతాలు, విద్యా సంస్థలు, ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు మరియు వ్యాపారాలకు ఈ సేవలు గణనీయమైన ప్రయోజనం చేకూర్చనున్నాయి.స్టార్లింక్ ఇప్పటికే 100కి పైగా దేశాల్లో సేవలను అందిస్తోంది, ఇందులో భూటాన్, బంగ్లాదేశ్ వంటి దక్షిణాసియా దేశాలు కూడా ఉన్నాయి. భారతదేశంలో ఈ సేవలు ప్రారంభమైతే, డిజిటల్ డివైడ్ను తగ్గించడంలో, రిమోట్ ప్రాంతాల్లో కనెక్టివిటీని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నారు.స్టార్లింక్ భారతదేశంలో పరిచయ ఆఫర్లలో భాగంగా నెలకు 850 రూపాయల (సుమారు 10 డాలర్లు) వద్ద అపరిమిత డేటా ప్లాన్లను అందించే అవకాశం ఉంది. ఇది యునైటెడ్ స్టేట్స్లోని రెసిడెన్షియల్ లైట్ ప్లాన్(నెలకు 80 డాలర్లు) లేదా భూటాన్లోని ప్లాన్ల (నెలకు 3వేలు-4,200 రూపాయలు)తో పోలిస్తే చాలా తక్కువ. అయితే, ఈ పరిచయ ధరలు ప్రమోషనల్ ఆఫర్లలో భాగంగా మాత్రమే ఉండవచ్చు, ఆ తర్వాత నెలవారీ ఛార్జీలు రూ.3 వేల నుంచి రూ.7 వేల వరకు ఉండే అవకాశం ఉంది. వినియోగదారులు స్టార్లింక్ హార్డ్వేర్ కిట్ను కొనుగోలు చేయాల్సి ఉంటుంది, ఇందులో శాటిలైట్ డిష్, వై-ఫై రూటర్ ఉంటాయి. ఈ కిట్ ధర ప్రపంచవ్యాప్తంగా 250-380 డాలర్ల (21,300-32,400 రూపాయలు) మధ్య ఉంది, కానీ భారతదేశంలో రూ.25 వేల నుంచి రూ.35 వేల మధ్య ఉండవచ్చని అంచనా. ఈ ఒక్కసారి ఖర్చు, సాంప్రదాయ బ్రాడ్బ్యాండ్ సేవలతో పోలిస్తే ఎక్కువగా ఉండవచ్చు, ఇది భారతదేశంలో సగటున 700-1,500 రూపాయల నెలవారీ ధరతో అందుబాటులో ఉంటుంది.స్టార్లింక్ భారతదేశంలో 25-220 ఎంబీపీఎస్ వేగంతో ఇంటర్నెట్ సేవలను అందించనుంది. ఇది సాంప్రదాయ శాటిలైట్ ఇంటర్నెట్ సేవల కంటే తక్కువ లేటెన్సీ (25 మిల్లీసెకండ్ల)తో ఉంటుంది. ఈ వేగం వీడియో స్ట్రీమింగ్, ఆన్లైన్ గేమింగ్, రిమోట్ వర్కింగ్ వంటి అనేక ఆధునిక అవసరాలకు అనుకూలంగా ఉంటుంది. అయితే, స్టార్లింక్ యొక్క శాటిలైట్ల సంఖ్య (ప్రస్తుతం 7 వేలకు పైగా) భారతదేశం వంటి జనాభా ఎక్కువగా ఉన్న దేశంలో సామర్థ్య పరిమితులను ఎదుర్కొనవచ్చని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.స్టార్లింక్ భారతదేశంలో సేవలను ప్రారంభించడానికి ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ (ఇన్-స్పేస్) నుంచి తుది అనుమతి, స్పెక్ట్రమ్ కేటాయింపు అవసరం. 2022లో, స్టార్లింక్ అనుమతులు లేకుండా ప్రీ-ఆర్డర్లను స్వీకరించడంతో ప్రభుత్వం దానిని నిలిపివేసింది. ఇటీవల, మణిపూర్ వంటి ప్రాంతాల్లో స్టార్లింక్ పరికరాలను అక్రమంగా ఉపయోగించడంతో భద్రతా ఆందోళనలు తలెత్తాయి. ఈ సమస్యలను పరిష్కరించేందుకు స్టార్లింక్ భారత ప్రభుత్వం యొక్క భద్రతా నిబంధనలను అంగీకరించింది.భారతదేశంలో భారతీ ఎయిర్టెల్, రిలయన్స్ జియో వంటి ప్రముఖ టెలికాం సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యాలు స్టార్లింక్ సేవలను విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావడానికి సహాయపడతాయి. అయితే, భారతీ ఎంటర్ప్రైజెస్ మద్దతుగల యూటెల్సాట్ వన్వెబ్, జియో-ఎస్ఈఎస్ జాయింట్ వెంచర్ వంటి పోటీదారులు కూడా మార్కెట్లో ఉన్నారు. అమెజాన్ ప్రాజెక్ట్ కైపర్ కూడా భారతదేశంలో సేవలను ప్రారంభించేందుకు అనుమతుల కోసం దరఖాస్తు చేసింది.స్టార్లింక్ సేవలు భారతదేశంలోని గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో ఇంటర్నెట్ కనెక్టివిటీని గణనీయంగా మెరుగుపరచవచ్చు, ఇది డిజిటల్ ఇండియా లక్ష్యాలకు అనుగుణంగా ఉంటుంది. అయితే, ఎక్కువ హార్డ్వేర్ ఖర్చు, సాంప్రదాయ బ్రాడ్బ్యాండ్ సేవలతో పోలిస్తే అధిక నెలవారీ ఛార్జీలు సామాన్య వినియోగదారులకు అడ్డంకిగా ఉండవచ్చు. స్టార్లింక్ భారతదేశం కోసం ప్రత్యేక ధరల వ్యూహాన్ని రూపొందించాల్సి ఉంటుంది, తద్వారా ఇది ధర-సున్నితమైన మార్కెట్లో పోటీపడగలదు.

## పోలీసుల ఎదుట సజ్జల భార్గవ్ రెడ్డి హాజరు

మంగళగిరి రూరల్ పోలీసుల ఎదుట విచారణకు సజ్జల భార్గవ్ రెడ్డి హాజరయ్యారు. సజ్జల భార్గవ్ రెడ్డి విచారణ నేపథ్యంలో మంగళగిరి పట్టణ, రూరల్ పోలీస్ స్టేషన్ల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసారు. మంగళగిరి పట్టణ, రూరల్ పోలీస్ స్టేషన్లకు వెళ్లే మెయిన్ గేటును మూసివేసారు. సజ్జల భార్గవ్ రెడ్డికి మంగళగిరి పోలీసులు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే.

## మిర్యాలగూడ పట్టణంలో పోలీసులు కార్డెన్ అండ్ సెర్చ్

నల్గొండ మిర్యాలగూడ పట్టణంలోని ప్రకాష్ నగర్ లో పోలీసులు కార్డేన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఎస్పీ శరత్ చంద్ర పవర్ ఆదేశాల మేరకు డి.ఎస్.పి రాజశేఖర్ రాజ్ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ జరిగింది. ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించిన పోలీసులు సరైన పత్రాలు లేని పలు వాహనాలు సీజ్ చేసారు.

# ఏనుగుల దాడిలో ఇద్దరికి గాయాలు




తిరుపతి జిల్లా లో ఏనుగుల మరోసారి బీభత్సం సృష్టించాయి. ఎలిఫెంట్ టాస్క్ ఫోర్స్ సిబ్బందిపై ఏనుగులు దాడి చేసాయి. ఏనుగుల దాడిలో ఇద్దరు సిబ్బందికి మునస్వామి, లక్ష్మి ప్రసాద్ కు గాయాలు అయ్యాయి. దాంతో సిబ్బంది అధికారులకు సమాచారం ఇచ్చారు. తిరుపతి సమీపంలోని, చంద్రగిరి యర్రావారిపాలెం మండలంలో ఘటన జరిగింది. యలమంద పంచాయతీ బోయపల్లి అటవీ ప్రాంత సమీపంలో ఏనుగులు దాడులు చేస్తున్నాయి.

## కారుకు కీ దొరికేనా

హైదరాబాద్, మే 29,మాజీ మంత్రి హరీశ్రావు ప్రస్తుతం బీఆర్ఎస్ లో కీలక నేతగా మారారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ను మించి హరీశ్ దూసుకు పోతున్నారు. ప్రతి అంశంలో హరీశ్ ముందుంటున్నారు. హరీశ్ జిల్లాల పర్యటనకు వెళుతున్నప్పుడు వచ్చే రెస్పాన్స్ మామూలుగా ఉండటం లేదు.అదే ఇప్పుడు గులాబీ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. వరసగా అనేక జిల్లాల్లో ఆయన పర్యటించి వచ్చారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా హరీశ్రావు నాయకత్వంపై గులాబీ పార్టీ క్యాడర్లో నమ్మకం పెరుగుతుంది. పార్టీ ఓటమి చెందినా ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా కార్యకర్తలకు అండగా ఉండే మాస్ లీడర్ గా హరీశ్ రావు గుర్తింపు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తెచ్చుకున్నట్లుంది. ట్రబుల్ షూటర్ గా కూడా మారారు. బీఆర్ఎస్ పార్టీ తొమ్మిదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఆయన కేవలం మంత్రిగానే ఉన్నారు. అప్పుడు పాలన అంతా కేసీఆర్, కేటీఆర్ చేతుల్లోనే నడిచేది. ఇక ఎన్నికల సమయంలో టిక్కెట్లను ఖరారు చేసే సమయంలో కూడా మామ కేసీఆర్ మేనల్లుడు హరీశ్ రావు ప్రతిపాదనలను పెద్దగా పట్టించుకోలేదన్నారు. అంతా కేసీఆర్, కేటీఆర్ ఇష్టారాజ్యంగానే టిక్కెట్ల కేటాయింపు జరిగింది. ఇక రాజ్యసభ, ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలోనూ హరీశ్రావు జోక్యం అనేది ఏమాత్రం తొమ్మిదేళ్ల పాటు జరగలేదు. దీంతో హరీశ్రావు తనకు అత్యంత సన్నిహితులు, అనుచరులకు కూడా ఆయన నామినేటెడ్ పదవులు కూడా ఇప్పించుకోలేకపోయారంటారు.ఇక బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్గా కేటీఆర్ ను నియమించినప్పుడు కూడా హరీశ్రావు ఒకింత అసంతృప్తికి గురయ్యారని చెబుతారు. అందుకే కేటీఆర్ ఆయన ఇంటికి వెళ్లి మరీ కలసి బావతో మాట్లాడి వచ్చారని చెబుతారు. హరీశ్రావు గులాబీ పార్టీకి పెద్ద ఎస్సెట్. అందులో ఏమాత్రం సందేహం లేదు. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి మామ కేసీఆర్ వెన్నంటి ఉంటూ ఆయన చెప్పిన పని చేస్తూ వచ్చిన హరీశ్ రావు తర్వాత మంత్రివర్గంలో చేరినా పెద్దగా పాలనలో జోక్యం లేకుండా చేశారన్న ఆరోపణలున్నాయి. అలాగే పార్టీపై ఆయనకు పట్టు పెంచే పరిస్థితి కూడా లేదు. ఎందుకంటే బీఆర్ఎస్ లో ఆయనకు కీలక పదవి ఏమీ లభించకపోవడమే ఇందుకు కారణం. కానీ హరీశ్రావు కేసీఆర్ నాయకత్వాన్ని ఎన్నడూ వ్యతిరేకించలేదు. అధికారం కోల్పోయిన తర్వాత హరీశ్రావు మరింతగా పాపులర్ అవుతున్నారు.

# ద్రవిడ రాజకీయాల్లో కొత్త కూటమి

చెన్నై, మే 29, (న్యూస్ పల్స్)తమిళనాడు రాజకీయాలంటే గుర్తుకు వచ్చేది రెండే రెండు పార్టీలు. అవి డీఎంకే, ఏఐడీఎంకే ఆరెండు పార్టీల అధిపత్యమే దశాబ్దాలుగా కొనసాగుతోంది. మరో పార్టీ పుట్టినా?దానికంత స్కోపు.. స్పేసు.. ఇవ్వడంలేదీ రెండు పార్టీలు. అంతలా తమిళుల నరనరాన ఇంకిపోయాయా రెండు పార్టీలు. అయితే 2026లో సరికొత్త రాజకీయం చోటు చేసుకోబోతోందన్న చర్చ తమిళనాడులో జోరుగా సాగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో 2024 ఎన్నికల్లోటీడీపీ, బీజేపీ, జనసేన జట్టు కట్టి వైసీపీని ఓడించాయి. ఇప్పుడు తమిళనాడులో కూడా ఈతరహా కూటమికి రంగం సిద్ధమవుతోందన్న సంకేతాలు వస్తున్నాయి. ఇప్పటికే బీజేపీ, ఏఐడీఎంకే2026 ఎన్నికల కోసం కూటమి కట్టాయి. అయితే హీరో విజయ్ పార్టీ టీవీకే కూడా తమ కూటమిలోకి రానుంద నేతలు సంకేతాల ఇచ్చారు. ఎందుకంటే రెండు పార్టీలూ అధికారాన్ని అంతం చేయాలనే లక్ష్యంతో సాగుతున్నవే కాబట్టి జట్టు కట్టినా ఆశ్చర్యంలేదన్నది విశ్లేషకుల మాట.అయితే ఏపీలో కూటమి విజయానికి సామాజిక సమీకరణలు కీలక పాత్ర పోషించాయి. తమిళనాడులోనూ సామాజిక సమీకరణలే కీరోల్ పోషిస్తాయి. వన్నియార్, తేవర్, ముక్కులతోర్, దళిత వర్గాలు రాజకీయంగా కీలకపాత్ర పోషిస్తున్నాయి.ఏఐడీఎంకే తేవర్, ముక్కులతోర్ వర్గాల్లో బలంగా ఉంది. విజయ్‌పార్టీ యువ ఓటర్లు, దళిత వర్గాలను ఆకర్షిస్తోంది. బీజేపీ పట్టణ మధ్యతరగతి ఓట్లపై ఆధారపడుతోంది. ఈ మూడు పార్టీలు జట్టుకడితే సామాజిక వర్గాల ఓట్లను సమీకరించి ఓటు బ్యాంకును చీల్చవచ్చు.2024 లోకసభ ఎన్నికల్లో బీజేపీ, ఏఐడీఎంకే విడివిడిగా పోటీ చేసిన 20 నియోజకవర్గాల్లో రెండు పార్టీల ఓటు షేర్ కలిపితే గణనీయమైన ప్రభావం చూపిస్తోంది. అయితే, విజయ్ పార్టీకి కమలం పార్టీపై వ్యతిరేకతతో ఉంది. మరి ఈ పరిస్థితుల్లో జట్టు కట్టే అవకాశం ఉందా అన్న చర్చ కూడా వస్తోంది. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లోబీజేపీ, ఏఐడీఎంకే కూటమి 2026 ఎన్నికల కోసం బలమైన ప్రతిపక్ష పాత్ర పోషించడం ఖాయం. ఈశక్తి విజయ్ పార్టీ తోడైతేను సులభంగా ఓడించవచ్చని ఏఐడీఎంకే నేతలు భావిస్తున్నారు.ఇప్పటికే బీజేపీ, ఏఐడీఎంకే నేతలు ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకం కావాలని పిలుపునిచ్చారు. అయితే బలం సంక్షేమ పథకాలు. ప్రస్తుతం ఆపార్టీ మహిళలకు నెలవారీ ఆర్థిక సహాయం, ఉచిత బస్సు ప్రయాణం లాంటి పథకాలతో ప్రజల్లో బలంగా కనిపిస్తోంది. అయితే ఏపీలో వైసీపీపై వ్యతిరేకతతో కూటమి విజయం సాధించినట్లు, తమిళనాడులోనూ ప్రతిపక్ష ఓట్లను ఏకం చేసి విజయం సాధించాలని ఏఐడీఎంకే యోచిస్తోంది. కానీ ఇంతవరకు విజయ్ పార్టీ నుంచి అలాంటి సంకేతాలు అయితే రాలేదు. పైగా తమిళనాడులో డీఎంకేకు– టీవీకే పార్టీల మధ్యే పోటీ అని విజయ్ ఇదివరకే ప్రకటించారు. మరి ఈ పరిస్థితుల్లో కూటమి సాధ్యమా.. అన్న చర్చ జరుగుతోంది.తమిళనాడులో ఏపీ తరహా కూటమి ఏర్పాటు అవకాశాలు ఉన్నా.. విజయం సామాజిక రాజకీయ డైనమిక్స్, పార్టీల సమన్వయంపై ఆధారపడి ఉంటుంది. బీజేపీ, ఏఐడీఎంకే కూటమి ఖరారైనప్పటికీ, చేరిక ఇంకా ప్రశ్నార్థకంగానే ఉంది. అయితే కూటమిగా ఎన్నికల్లో పోటీ చేస్తే.. డీఎంకే ఓడిపోయే అవకాశం ఉందంటున్నారు విశ్లేషకులు. ద్రవిడ పార్టీగా డీఎంకేపై ప్రజల్లో ఉన్న క్రేజు, అలాగే సంక్షేమ పథకాలు ఆపార్టీని మరోసారి అధికారంలోకి తెస్తాయన్న విశ్లేషణలూ వస్తున్నాయి. పైగా విజయ్ పార్టీ సింగిల్‌గానే రాణిస్తామన్న దీమాతో ఉంది. మరోవైపు బీజేపీ, ఏఐడీఎంకే మధ్య గత ఎన్నికల నుంచి కొనసాగుతున్న విభేదాలు కూడా సవాళ్లుగా నిలుస్తాయి. మరి చూడాలి.. విభేదాలు పక్కనపెట్టి గెలుపుకోసం బీజేపీ, ఏఐడీఎంకే పార్టీలు టీవీకేను తమవైపు తిప్పుకుంటాయా..లేదా అన్నది..!

# తెలంగాణలో లేఖల లొల్లి...

హైదరాబాద్, మే 29, తెలంగాణలో లేఖల రాజకీయం నడుస్తోంది. సాధారణంగా అధికార పార్టీలో ఉన్న నేతలకు ప్రతిపక్ష నేతలు బహిరంగ లేఖలు రాస్తుంటారు. ముఖ్యమంత్రికి, మంత్రులకు ప్రతిపక్ష పార్టీలు ఓపెన్ లెటర్స్ రాయడం మీడియా హైలెట్ అవడం కామన్. కానీ తెలంగాణలో ఇప్పుడు నయా ట్రెండ్ నడుస్తోంది.సొంత పార్టీ నేతలే ఆయా పార్టీల అధినేతలకు లేఖలు రాస్తున్నారు. అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీ అనే తేడా లేకుండా అన్ని పార్టీల నేతలు వారి పార్టీలో ఉన్న సుప్రీం నేతలకు లేఖాస్త్రాలు సంధిస్తున్నారు. ఈ లేఖల్లో విమర్శల కంటే ఎక్కువగా ఆవేదన, తమకు జరుగుతోన్న అన్యాయంపైనే గళమెత్తున్నారు నేతలు. తమ తమ పార్టీల్లో లోటుపాట్లు, క్యాడర్ ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరిస్తూ అగ్రనేతలకు బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నేతలు లేఖలు రాస్తుండటం ఇంట్రెస్టింగ్‌గా మారింది.బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత తన తండ్రి, అధినేత కేసీఆర్‌కు రాసిన లేఖ తెలంగాణలో పాలిటిక్స్‌లో కాక రాజేసింది. డియర్ డాడీ అని సంభాషిస్తూ పార్టీలో జరుగుతున్న విషయాలను అంశాల వారిగా కేసీఆర్‌కు వివరిస్తూ లేఖ రాశారు కవిత. బీఆర్ఎస్ రజతోత్సవ సభలో తాను గుర్తించిన విషయాలను పాజిటివ్, నెగెటివ్‌గా క్యాటగరైజ్ చేసి మరీ కేసీఆర్‌కు లేఖ రాశారామె. పార్టీలో లోటుపాట్లు, క్యాడర్ చర్చించుకుంటున్న అంశాలను కవిత తన లేఖ ద్వారా కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ లేఖ ఇప్పుడు తెలంగాణ పాలిటిక్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది.కాంగ్రెస్ నేతలు సైతం ఏఐసీసీ పెద్దలకు తరచూ లేఖలు రాస్తుంటారు. ముఖ్యంగా పార్టీ చీఫ్ ఖర్గే, అగ్రనేతలు సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీలకు రాష్ట్ర నేతలు లెటర్లు రాయడం కామనే. లేటెస్ట్‌గా పార్టీ పెద్దలకు తెలంగాణ నుంచి పలువురు నేతలు లేఖలు రాశారట. సీఎం, పీసీసీ చీఫ్‌లను పదే పదే ఢిల్లీకి పిలవడంపై తెలంగాణ కాంగ్రెస్ నేతల అసహనం వ్యక్తం చేస్తూ ఢిల్లీ పెద్దలకు లేసినట్లు తెలుస్తోంది. ఏఐసీసీ తీసుకునే నిర్ణయాలు ఆలస్యమైతే పార్టీ ఎలా నడుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారట.రాహుల్ గాంధీ, ఖర్గే, కేసీ వేణుగోపాల్, ప్రియాంక గాంధీ, మీనాక్షీ నటరాజన్‌లకు తెలంగాణకి సంబంధించిన పలు అంశాలను లేఖ రూపంలో రాస్తూ మెయిల్ చేసినట్లు పలువురు తెలంగాణ కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. పార్టీ ఆలస్యంగా నిర్ణయాలు తీసుకోవడం వల్ల పార్టీ నేతలు, ఆశావాహులు నిరాశకు గురవుతున్నారని..ఇప్పటిదాకా పదులసార్లు తెలంగాణ నేతలను ఢిల్లీకి పిలిచి మంత్రివర్గాన్ని విస్తరించకపోవడం ఏంటని ప్రశ్నిస్తూ లేఖ రాశారట.పార్టీ కమిటీలను ఆలస్యం చేస్తే గ్రేటర్, స్థానిక ఎన్నికలపై ఎఫెక్ట్ పడుతుందని, ప్రభుత్వం ఏర్పాటై 17 నెలలు దాటినా కార్పొరేషన్ ఛైర్మన్లను ప్రకటించకపోవడం పట్ల కూడా లేఖలో అసంతృప్తి వెళ్లగక్కారట. ప్రభుత్వం ఏర్పాటైన మొదట్లోనే కార్పొరేషన్, నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తే ఇప్పటికి చాలామందికి అవకాశం వచ్చేదని లేఖలో పేర్కొన్నట్లు సమాచారం.కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పెద్దలకు కూడా రాష్ట్ర బీజేపీ నేతలు తరచూ లేఖలు రాస్తుంటారు. కాకపోతే బీజేపీ నేతలు రాసే లేఖలు బయటికి రావు. అధ్యక్షుడి ఎంపిక విషయంలో ఒకరి మీద మరొకరు అధిష్టానంకు ఇంటర్నల్‌గా లేఖలు రాసిన సందర్భాలు ఉన్నాయ్.అంతేకాదు ఆయనకు ప్రెసిడెంట్ పోస్ట్ ఇస్తే ఈ నష్టమని..ఈయనకు పదవి కోసం ఆ నష్టమని..అన్నీ లేఖల్లోనే వివరించారట కమలం లీడర్లు. రాజాసింగ్ లాంటి నేతలైతే తాను పార్టీ హైకమాండ్‌కు చెప్పాల్సిన విషయాలను సోషల్ మీడియాలోనే పెడుతున్నారు. మొత్తం మీద తెలంగాణలో అన్ని ప్రధాన పార్టీలలో లేఖాస్త్రం ట్రెండింగ్‌లో ఉంది. అన్ని పార్టీలలో ఇప్పుడు ఇదే ట్రెండ్ నడుస్తుంది.

# ఢిల్లీలో లాబీయింగ్ చేస్తున్న మల్ రెడ్డి

హైదరాబాద్, మే 29 రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణకు అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఆశావావుల్లో మళ్ళీ కదలిక మొదలైంది. రాష్ట్రంలో కేబినెట్ విస్తరణ పై గత మూడు రోజులుగా సీఎం రేవంత్ రెడ్డి, ఏఐసీసీ నేత కేసి వేణుగోపాల్ సుదీర్ఘ మంతనాలు జరిపారు.సామాజిక సమీకరణలు జిల్లాల వారీగా మంత్రి పదవులు ఆశిస్తున్న ఎమ్మెల్యే వివరాలను అధిష్టానం ఇప్పటికే సేకరించింది. ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీ,రెడ్డి సామాజిక వర్గాల వారిగా మంత్రి పదవులు ఆశిస్తున్న వారి జాబితాను సైతం రూపొందించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి.కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చిన అనంతరం మంత్రి పదవి విస్తరణలో మొదలు తన పేరు తప్పకుండా ఉంటుందని ఎంతో ధీమా పెట్టుకున్న కాంగ్రెస్ సీనియర్ నేత ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి మంత్రి పదవి విషయంలో ఆదిలోనే ఆయనకు చుక్కెదురైంది. మొదటిసారి మంత్రివర్గ విస్తరణలో దక్కని మంత్రి పదవి....రెండోసారి మంత్రివర్గ విస్తరణలో ఎలాగైనా చోటు దక్కించుకునేందుకు విశ్వ ప్రయత్నం చేస్తున్నారు.గత ఏడాది న్నర నుంచి ఆయన మంత్రి పదవి దక్కించుకునేందుకు లాబీయింగ్ సాగిస్తూనే ఉన్నారు. మంత్రి పదవి కోసం తొక్కని గడపలేదు...కలవని మనిషంటూ లేదు.మంత్రి పదవీ పైరవీలో తలమునకలైయినా మల్రెడ్డి రంగారెడ్డి నియోజకవర్గంలో తక్కువ ఢిల్లీలో ఎక్కువ అంటూ ఆయనపై నియోజకవర్గ ప్రతిపక్ష పార్టీల నేతలు సైతం సెటైర్లు వేయడం నియోజకవర్గం లో హాట్ టాఫిక్ గా ఈ అంశం మారింది.దీంతో ఆయన మంత్రి పదవి పై ఆయన ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నాడు దీన్నిబట్టే అర్థమవుతుంది.మంత్రివర్గ విస్తరణ బెర్త్ లో చోటు దక్కించుకునేందుకు ఏ అవకాశం ఉన్న వదలడం లేదు... గల్లి నుంచి మొదలుకొని అగ్రరాజ్యం వరకు తనకున్న పలుకుబడిని వినియోగించుకొని పట్టువదలని విక్రమార్కుడిలా పూర్తి లాబింగ్ నడిపిస్తున్నాడు.మంత్రివర్గ విస్తరణలో రంగారెడ్డి జిల్లాకు కేటాయింపు విషయంలో అధిష్టానం ఏమి ఆలోచన చేస్తుందో పార్టీ నేతలకు ఎవరికి అంతుచికడం లేదు. జిల్లాలో పార్టీ నేతలు కార్యకర్తలు పార్టీ అధిష్టాన నిర్ణయం పై కొంత అసంతృప్తి రగులుతుంది పదవుల పంపకాల్లో పూర్తిగా అన్యాయం జరిగిందని సమయం సందర్భం వచ్చినప్పుడు అల్లా తన మనసులోని మాటను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్లారెడ్డి రంగారెడ్డి తో పాటు పార్టీ జిల్లా నేతలు బహిరంగనే విమర్శలు గుప్పిస్తున్నారు.ఇటీవల శంషాబాద్ లో జరిగిన జిల్లా ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో సైతం మల్రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి కేటాయించాలంటూ ఏకవాక్యంగా పార్టీ నేతలు తీర్మానం చేసిన కాపీని పార్టీ అధిష్టానానికి సైతం పంపారు తెలంగాణ రాష్ట్రానికి తలమానికంగా ఉన్న ప్రపంచ స్థాయిలో ప్రభుత్వం చేపడుతున్న పూర్తి సిటి తమ జిల్లాలోనే ఉందని తమ జిల్లాకు మంత్రివర్గ విస్తరణలో ప్రాథమిథ్యం లేకపోతే ఎలా అంటూ వారు పార్టీ అధిష్టానాన్ని ప్రశ్నించినట్లు సమాచారం రంగారెడ్డి జిల్లాకు మంత్రి పదవి ఇవ్వాల్సిందేనా అంటూ కరాకండిగా నేతలు ఒకే మాటగా చెబుతున్నారు. మంత్రి వర్గ విస్తరణలో తనకు అవకాశం దక్కకపోతే ఎమ్మెల్యే పదవికి సైతం తాను రాజీనామా కు సిద్ధమంటూ ఆయన బెదిరింపులు సైతం దిగారు. ఒకవేళ తనకు మంత్రి పదవి ఇచ్చేందుకు సామాజిక సమీకర ణే అడ్డుగా మారితే తాను స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఏమ్మెల్యే పదవికి రాజీనామా చేసి తన ప్లేసులో బీసీ అభ్యర్థిని ఎమ్మెల్యేగా గెలిపించుకుంటానంటూ అతనికి మంత్రి పదవి కేటాయించా లని సైతం ఆయన బహిరంగంగా డిమాండ్ చేశారు.ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి చేసిన ఈ కామెంట్ జిల్లాలో ఇది హాట్ టాపిక్ చర్చ నియాంశంగా మారింది. మరోపక్క పార్టీ సీనియర్ నేత జానారెడ్డిని సైతం రంగంలోకి దింపి రంగారెడ్డి జిల్లాకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలంటూ అధిష్టానా నికి సైతం లేఖను మద్దతుగా పంపించేలా చేశారు. మంత్రివర్గ విస్తరణలో అధిష్టానం మళ్లీ కదలిక మొదలు కావడంతో గత వారం రోజులుగా మల్రెడ్డి రంగారెడ్డి ఢిల్లీలోనే మకాం వేశారు. తన అంచర వర్గం ని ఢిల్లీకి రప్పించుకొని మంతనాలు సాగిస్తున్నాడు.అధిష్టానం తీసుకునే నిర్ణయాల వల్ల తమ భవిష్యత్తు కార్యాచరణ గురించి వారితో చర్చిస్తున్నట్లు సమాచారం దీంతో మల్రెడ్డి రంగారెడ్డి వ్యవహారం అధిష్టానం కు కొంత తలనొప్పిగా మారినట్లు తెలుస్తుంది. వాస్తవానికి సర్పంచ్ స్థాయి నుంచి ఎదిగిన సీనియర్ నేత మల్రెడ్డి రంగారెడ్డి జిల్లా పరంగా చూస్తే మంత్రివర్గంలో ఆయనకు ఖచ్చితంగా అవకాశం కల్పించాల్సి ఉంది. కానీ పార్టీ అధిష్టానం మాత్రం ఏమీ ఆలోచన చేస్తుందో ఎవరికి అంతు పట్టడం లేదు.రంగారెడ్డి జిల్లాలో ఎన్ని నియోజకవర్గాలు ఉంటే ఇబ్రహీంపట్నం,షాద్నగర్, కల్వకుర్తి నియోజకవర్గం సింహభాగం( ఆమనగల్, కడ్తాల, తలకొండపల్లి,మాడుగుల ) కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు మల్రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, కసిరెడ్డి నారాయణరెడ్డి కాంగ్రెస్ నుంచి గెలుపొందగా.... ఎల్బీనగర్ నుంచి సుధీర్ రెడ్డి మహేశ్వరం నుంచి సబితా ఇంద్రారెడ్డి రాజేంద్రనగర్ నుంచి ప్రకాష్ గౌడ్ చేవెళ్ల నుంచి కాలే యాదయ్య శేర్లింగంపల్లి నుంచి అరికెపూడి గాంధీ లు టిఆర్ఎస్ పార్టీ నుంచి గెలుపొందారు. అయితే మారిన రాజకీయ పరిణామాల కారణంగా వారంతా ఇటీవలనే కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.మంత్రివర్గ విస్తరణ విషయంలో అధిష్టానం జాబితాపై కొలికి వచ్చినట్లు సమాచారం. అయితే రెడ్డి సామాజిక వర్గం విషయంలోనే అధిష్టానం ఎటు తేల్చుకోలేకపోతున్నట్లు పార్టీ పెద్దలు చెప్తున్నారు. పార్టీ సీనియర్ నేత ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి, నల్గొండ జిల్లా నుంచి మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మధ్య మంత్రివర్గ విషయంలో బిగ్ ఫైట్ నడుస్తుంది ఆది నుంచి మంత్రి పదవిని దక్కించుకునేందుకు ఇరువురు నేతలు సైతం విశ్వ ప్రయత్నాలు సైతం చేస్తూ వస్తున్నారు.బహిరంగల వేదికల మీదనే మంత్రి పదల గురించి వారు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడం పార్టీలో ఆ టాపిక్ గా మారింది.... అధిష్టానం మాత్రం రాజగోపాల్ రెడ్డికి మంత్రివర్గంలో చోటు కల్పించి మల్రెడ్డి రంగారెడ్డికి డిప్యూటీ స్పీకర్ పోస్టు ఇవ్వాలని కొంత ఇంటు ఇచ్చినట్లు తెలుస్తుంది.. తనకు డిప్యూటీ స్పీకర్ పోస్ట్ వద్దు అంటూ తన అనుచరు వర్గం వద్ద మల్రెడ్డి రంగారెడ్డి కొంత అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు సమాచారం.తన నిర్ణయాన్ని ఇప్పటికే పార్టీ వ్యవ హారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజ్ సీఎం రేవంత్ రెడ్డికి విన్నవించినట్లు తెలుస్తుంది. అధిష్టానం మాత్రం మంత్రి పదవులు అవకాశం లేని వారికి పార్టీ మంచి పొజిషన్ కల్పిస్తామంటూ బుజ్జగింపుల పర్వం ఇప్పటికే స్టార్ట్ చేసినట్లు వార్తలు సైతం చెక్కలు కొడుతున్నాయి.మల్ రెడ్డి రంగారెడ్డి అనుచరులు మాత్రం ఎంతో ధీమాగా ఉన్నారు. తమ నేతకే మంత్రి పదవి దక్కుతుందని మా సార్ బుగ్గ కారు తప్పక ఎక్కుతాడంటూ వారంతా ఎంతో ధీమగా ఉన్నారు. చూడాలి మరి మల్రెడ్డి రంగారెడ్డి విషయంలో పార్టీ అధిష్టానం ఏమి నిర్ణయం

# మంత్రులకు డిన్నర్ పార్టీ...

హైదరాబాద్, మే 29, తెలంగాణ కేబినెట్ విస్తరణ మళ్లీ ముహూర్తం వాయిదా పడింది. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు మరో ఆసక్తికర పరిణామం జరిగింది. సీఎం రేవంత్‌రెడ్డి మంత్రులందరికి తన ఇంట్లో డిన్నర్ పార్టీ ఇవ్వడంతో మళ్లీ కేబినెట్ అంశం తెరపైకొచ్చింది.సీఎం పిలుపుతో మంత్రివర్గం కదిలింది..!

మా ఇంటికొచ్చి విందు ఆరగించి పోండి అన్న ఆహ్వానంతో దాదాపుగా మంత్రివర్గం మొత్తం సీఎం ఇంట్లో వాలిపోయింది. ముఖ్యమంత్రి ఇచ్చిన విందును ఆరగించింది..! అంతా ఓకే కానీ.. ఇప్పుడే ఈ డిన్నర్ ఎందుకు..? సీఎం ఢిల్లీ వెళ్లనుండటంతో సడెన్‌గా ఈ విందు ఏర్పాటేంటి..? విందు పేరుతో మంత్రులంతా ఏం చర్చించారు..? సీఎం వాళ్లకు ఏం చెప్పారు..? ఇప్పుడీ అంశాలే ఆసక్తిని పెంచుతున్నాయి. కేబినెట్ బెర్త్ కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్న నేతల్లో మరింత ఉత్కంఠ రేపుతున్నాయి.మొన్ననే మంత్రివర్గ విస్తరణ దాదాపుగా పూర్తైందని.. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే అందుబాటులో లేకపోవడంతో ప్రకటన వాయిదా పడిందని పార్టీ నేతలు చెప్పుకొచ్చారు. ఖర్గే ఈనెల 30న అంటే రేపు ఢిల్లీలో ల్యాండ్ అవుతారు. అలాగే ఇట్నుంచి సీఎం రేవంత్ రెడ్డి కూడా రేపే హస్తినకు వెళ్తారు. దీంతో ఇన్నాళ్ల నిరీక్షణకు రేపు ఎండ్ కార్డ్ పడబోతోందన్న ప్రచారం గట్టిగా నడుస్తోంది. ఆ కేబినెట్ విస్తరణ ఊహాగానాల నేపథ్యంలోనే ఈ ప్రైవేట్ డిన్నర్‌పై తెలంగాణ కాంగ్రెస్‌లో ఆసక్తికర చర్చ నడుస్తోంది. విస్తరణకు ముందు సీఎం ఆనవాయితీగా ఇస్తున్న డిన్నర్ అంటూ కూడా బయట టాక్ వినిపిస్తోంది.నేను మంత్రినవుతా.. నేను మంత్రినవుతా ఇప్పటికే ఎంతోమంది బడా నేతలు ఉవ్విళ్లూరుతున్నారు. గల్లీ నుంచి ఢిల్లీ దాకా ఎన్నో ప్రయత్నాలు చేశారు. మంత్రిపదవి కోసం పార్టీకే అల్టిమేటం జారీ చేసిన నేతలూ ఉన్నారు. వాళ్లంతా ఈ డిన్నర్ మీటింగ్‌ని ఆసక్తిగా తిలకించారు. మంత్రివర్గ విస్తరణపైనే మాట్లాడారంటూ చర్చించుకుంటున్నారు.

ఆ లిస్ట్‌లో తమ పేరు ఉందో లేదోనన్న టెన్షన్‌లో పడ్డారు నేతలు. మొత్తంగా.. సీఎం డిన్నర్ పార్టీపై ఓవైపు ఆసక్తి.. మరోవైపు నేతల్లో ఉత్కంఠ నెలకొంది.

# కవిత పార్టీ లెక్కంటో..

నిజామాబాద్, మే 29, ఇప్పటి సోషల్ మీడియా కాలంలో నిజాలు ఎవరికీ అక్కరలేదు. ప్రచారంలో ఉంటే సరిపోతుంది. అది నిజమా? అబద్ధమా? అనేది తర్వాత సంగతి.. కాకపోతే కాస్తలో పొగ వస్తే చాలు మంట పెట్టడానికి చాలామంది ఉంటారు. పార్లమెంట్ ఎన్నికల్లో కల్వకుంట్ల కవిత ఓడిపోయారు అనేది వాస్తవం. ఆ తర్వాత కుమార్తెకు గులాబీ సుప్రీం ఎమ్మెల్సీ స్థానాన్ని కట్టబెట్టారు అనేది కూడా నిజమే. కానీ ఎప్పుడైతే పార్టీలో ఆమె ప్రభావం తగ్గిందో అప్పటినుంచి ఏదో జరిగిపోతోంది అన్నట్టుగా వార్తలు రావడం మొదలైంది. కాకపోతే ఎప్పటికప్పుడు వీటికి గులాబీ బాస్ చెక్ పెట్టుకుంటూ వస్తున్నారు. హరీష్ రావు పార్టీకి దూరంగా ఉన్నారని.. పార్టీ నుంచి వెళ్ళిపోతున్నారని.. కొద్దిరోజులు ప్రచారం జరిగింది. ఆ తర్వాత గులాబీ సుప్రీం దగ్గర నుంచి పిలుపు రావడంతో ఒకసారి గా ఆ పుకార్లకు ఫుల్ స్టాప్ పడింది. మళ్లీ కొద్ది రోజుల తర్వాత కల్వకుంట్ల తారక రామారావు కాబోయే ముఖ్యమంత్రి అని.. మరికొద్ది రోజుల్లోనే పట్టాభిషేకమని వార్తలు వచ్చాయి. ఆ తర్వాత అది కూడా ఆ వాస్తవమని తేలిపోయింది. ఇక ఇప్పుడు కల్వకుంట్ల కవిత కొత్త రాజకీయ పార్టీకి సంబంధించి రోజుకో తీరుగా వార్తలు వస్తున్నాయి.గులాబీ సుప్రీంకు కల్వకుంట్ల కవిత లేఖలు రాశారు అనేది వాస్తవం. అందులో కొన్ని విషయాలను ప్రస్తావించారనేది కూడా నిజం. కాకపోతే ఈ లేఖల వ్యవహారం గతంలో ఎప్పుడు బయటికి రాలేదు. అంతర్గత వ్యవహారం బయటికి రావడం.. కల్వకుంట్ల కవిత తన తండ్రిని దేవుడిగా.. చుట్టూ ఉన్నవారిని దయ్యాలుగా అభివర్ణించడం కాస్త చర్చకి దారి తీసింది. మరుసటి రోజు ఆమె సోదరుడు.. కారు పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడి హోదాలో విలేకరుల సమావేశం నిర్వహించడం.. పార్టీలోని అంతగత విషయాలు బయటకు చెప్పడం కరెక్ట్ కాదని హెచ్చరించడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఇక ఈ పరిణామాలకు తగ్గట్టుగానే రకరకాల వార్తలను కొన్ని పత్రికలు రాయటం.. సోషల్ మీడియాలో కొన్ని యూట్యూబ్ ఛానల్స్ రకరకాల ప్రచారం చేయడంతో తెలంగాణ రాజకీయాలలో రకరకాల చర్చలు జరుగుతున్నాయి. కవిత సొంత పార్టీ ఏర్పాటు సంబంధించిన విషయం కొద్దిరోజులుగా తెలంగాణ రాజకీయాలలో సంచలనం సృష్టిస్తోంది. దీంతో అసలు విషయాలు పక్కదారి పడుతున్నాయి. కవిత ఇంటికి పార్టీ ఎంపీ ఒకరు వెళ్ళటం.. తన తండ్రి దూతగా అతడు కల్వకుంట్ల కవితతో చర్చలు జరపడం.. వంటి పరిణామల తర్వాత కవిత కొత్త పార్టీ ఏర్పాటు చేయబోరని.. తండ్రి చాటున రాజకీయాలు చేస్తారని ఓ వర్గం మీడియా రాసింది.. ఇవి ఇలా ఉండగానే ఆమె కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని మరో బాంబులాంటి వార్త తెలుగు మీడియాలో సంచలనం సృష్టించింది. అయితే దీనిని కవిత ఖండించారు. అయితే ఇలాంటి వార్తలు లీకులు ఇస్తే తప్ప రాసే అవకాశం లేదని.. ఇలానే లీకులు ఇచ్చుకుంటూ పోతే రాజకీయ మనగడే ప్రమాదంలో పడుతుందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.. కల్వకుంట్ల కవితకు రాజకీయ పార్టీ పెట్టుకునే అధికారం ఉందని.. కాకపోతే ఇలా లీకులు ఇచ్చుకుంటూ వెళ్తే ప్రమాదం ఏర్పడుతుందని.. అది అంతిమంగా గులాబీ సుప్రీం కుమార్తెకు నష్టం చేకూర్చుతుందని కొంతమంది వాదిస్తున్నారు.

## వర్షాలతో రైతులు ఆగమాగం...

నిజామాబాద్, మే 29, వారం రోజులు గా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో రైతన్నలు తీవ్ర నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి మొక్కజొన్న పంటలు చేతికొచ్చిన తర్వాత రోడ్ సైడ్ కు ఆరబోసేందుకు వంచదా వారం రోజుల నుంచి వర్షం వదలడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కొన్ని వరి సంచులు నింపి ఉంచిన తర్వాత కాంటాక్ట్ చేయకపోవడం వల్ల కూడా కుప్పలుగా రోడ్‌సైడ్‌కే ఉన్నాయని వాపోతు న్నారు. మరికొన్ని వరి గొప్పలు తడిసిపోయి ముద్దాయ్యయని చెబుతున్నారు. ఒక రోజు కూడా గ్యాప్ లేకుండా కురుస్తున్న వర్షంతో రైతులు తీవ్ర నష్టపోతున్నామని పేర్కొంటున్నారు.తడిసిపోయిన వారి మొక్కజొన్న పంటలు కొనుగోలు కేంద్రాల్లో కొంటారా లేదా అని సమస్య కూడా వెంటాడుతుందని చెబుతున్నారు. ఈ విషయంపై అధికారులు స్పష్టత ఇవ్వడం లేదని పేర్కొంటున్నారు. కొన్నిసార్లు మైయ్చర్ లేదని మరి కొన్నిసార్లు సంచులు దొరకడం లేదంటూ సాకులు చెబుతున్నారని అంటున్నారు.వారం రోజులు కురిసిన వర్షంతో పంటలు మొత్తం పరిస్థితులు ఘోరంగా తయారయ్యాయని వాపోతున్నారు. దీంతో రైతులు ఏమి చేయని దిక్కుతోచని పరిస్థితిలో లబోదిబో అంటూ వరుణుడు కరుణించాలని వారు ఆకాశం వైపు చూస్తున్నారు. తమ కష్టం ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడంలేదని ఆవేదన చెందుతున్నారు.సంబంధిత అగ్రికల్చర్ అధికారులు పంట నష్టం జరిగిన రైతులకు సర్వే చేసి పంట నష్టపరిహారం అందే విధం గా చూడాలని రైతులకు కోరుతున్నారు. ఈ విషయంపై జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత రావు గాని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ గాని స్పందించాలని వేడుకుంటున్నారు.తడిసిన ధాన్యాన్ని వెంటనే ప్రభుత్వం కొనడం లేదు. దీంతోతీవ్రంగా రైతులు నష్టపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ధాన్యానికి డబ్బులు చెల్లించాలి.

# భార్యను హతమార్చిన భర్త

**ములుగు ప్రజాబలం ప్రతినిధి:** జిల్లా జంగాలపల్లి క్రాస్ రోడ్ వద్ద రాత్రి వివాహిత సంగారబోయిన సౌందర్య దారుణ హత్యకు గురైంది, భార్య భర్తల మధ్య నెల రోజుల నుండి గొడవలు జరుగుతుండడంతో వారం రోజుల క్రితం సౌందర్య గ్రామంలోని తల్లి గారి ఇంటికి వెళ్లిపోయింది .అయితే కొందరు పెద్దమనుషులు సర్దిచెప్పి లక్ష్మయ్య ఇంటికి తీసుకువచ్చి భార్య భర్తలు ఇద్దరికి నచ్చ చెప్పారు ,డిగ్రీ పరీక్షలు జరుగుతున్న క్రమంలో. సౌందర్య కుమారుడు అజయ్ హనుమకొండకు వెళ్ళాడు, ఈ క్రమంలో సౌందర్య , లక్ష్మయ్యకు మధ్య గొడవ జరిగింది, బుధవారం ఉదయం నుంచి వారి కిరణా షాపు మూసి ఉండడంగా లక్ష్మయ్య సౌందర్య ఇద్దరు కనిపించలేదు, పరీక్షల అనంతరం అజయ్ బుధవారం రాత్రి ఇంటికి చేరుకోగా. ఇంటికి గడియ పెట్టి ఉంది. తలుపు తీసి చూసేసరికి తల్లి సౌందర్య చనిపోయి కనిపించింది, దీంతో చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు ,ఘటన స్థలానికి సిఐ,ఎస్ఐలు చేరుకొని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు, కాగా భార్యపై అనుమానంతో కుమారు ఇంట్లో లేని సమయంలో లక్ష్మి హత్య చేసి పారిపోయాడని గ్రామస్తులు చెబుతున్నారు

# లారీ బోల్తాడ్రైవర్, క్లీనర్లకు గాయాలు

**రంగారెడ్డి ప్రజాబలం ప్రతినిధి:**శంషాబాద్ పరిధిలోని రాల్లగూడ ఔటర్ రింగ్ రోడ్డు పై నుండి అదుపుతప్పి లారీ బోల్తా పడింది. ఔటర్ పై నుండి జారిపడి సర్వీస్ రోడ్డుపై లారీ పడింది. ఘటనలో డ్రైవర్, క్లీనర్ కు తీవ్ర గాయాలు అయ్యాయి. వారిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ నిద్ర మత్తులో ఉన్నట్లుగా పోలీసులు భావిస్తున్నారు. లారీ శంషాబాద్ నుండి గచ్చిబౌలి వైపు వెళ్తుండగా ప్రమాదం జరిగింది.

# కవిత పార్టీ... ఎవరికి ప్లస్... ఎవరికి మైనస్



హైదరాబాద్, మే 29,ఎప్పుడైతే గులాబీ సుప్రీమ్ ను ఉద్దేశించి కల్వకుంట్ల కవిత లేఖలు రాసిందో.. అప్పటినుంచి కారు పార్టీలో కుతకుతలు మొదలవుతున్నాయి. బయటికి పెద్దగా తెలియడం లేదు గాని.. లోపల మాత్రం ఊహించని పరిణామాలు వీటన్నింటినీ గులాబీ శ్రేణులు అత్యంత సులభంగా కొట్టిపారేస్తున్నాయి కానీ.. అంతకుమించి అనేలాగా ఏదో విస్ఫోటనం జరుగుతోంది. మీడియాలో వస్తున్నట్టుగానే.. సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్నట్టుగానే కవిత ఒకవేళ సొంతంగా పార్టీ పెడితే పరిస్థితి ఎలా ఉంటుంది? కెసిఆర్ కు అది ఎలాంటి ఇబ్బందికరంగా మారుతుంది? కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి లాభం చేకూర్చుతుంది? అనే ప్రశ్నలు తెలంగాణలో హాట్ హాట్ చర్చకు కారణం అవుతున్నాయి. ఒకవేళ కవిత కనక పార్టీ నుంచి వెళ్ళిపోతే.. ఢిల్లీ మద్యం కుంభకోణం ముద్ర ఆమె రాజకీయ భవిష్యత్తుకు ఇబ్బందికరంగా మారుతుందని కొందరు అంటున్నారు. అంతేకాదు కుటుంబ పార్టీ అనే ట్యాగ్ లైన్ కూడా దూరమవుతుందని.. పార్టీ ప్రయోజనాల కోసం కేసీఆర్ కుమార్తెను కూడా వదులుకున్నాడని.. బూస్ట్ పార్టీకి లభిస్తుందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.ఒకవేళ భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్సీ ఢిల్లీ మద్యం కుంభకోణం తాలూకు విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తే.. దానికి కెసిఆర్ కూడా సిద్ధంగా ఉండాల్సి ఉంటుంది. ఎందుకంటే కవిత పార్టీ నుంచి బయటికి వస్తే కచ్చితంగా కొన్ని నిజాలు బయటికి తెలుస్తాయి. అవి కేసీఆర్ ను ఏదో చేస్తాయని కాదు.. కాకపోతే ఇప్పటికే ఇబ్బందికరమైన పరిస్థితుల్లో ఉన్న పార్టీని మరింత గందరగోళంలోకి నెడతాయి. అప్పుడు కెసిఆర్ కు మరింత ఇబ్బందులు ఎదురవుతాయి. ఇక కేటీఆర్ కు కనుక పార్టీ సర్వ పగ్గాలు అప్పగిస్తే.. అప్పుడు ఆయన నాయకత్వం నచ్చని మరో కీలక వ్యక్తి బయటికి వచ్చి.. కవితతో కలిసి తిరుగుజెండా ఎగరవేస్తే మాత్రం అప్పుడు మరింత డోలాయమానం పార్టీకి ఎదురవుతుంది. ఇవన్నీ కెసిఆర్ చూస్తూ ఉంటారా.. ఊరకనే ఉంటారా.. ఈ ప్రశ్నకు కాలమే సమాధానం చెప్పాలి. మనదేశంలో పీవీ నరసింహారావు వంటి వ్యక్తి కోర్టుకు హాజరయ్యారు. కమిషన్ ముందు నిలబడ్డారు. ఆ లెక్కలోకి వస్తే కేసీఆర్ కమిషన్ ఎదుట హాజరు కావడం పెద్ద విషయం కాదు. కాకపోతే రేవంత్ రెడ్డి కాళేశ్వరం ఇష్యూ ను జనంలోకి ఎలా తీసుకుపోతాడు అనేది చాలా ముఖ్యం. ఇప్పటికే కాలేశ్వరం జలాలు లేకుండా యాసంగిలో రికార్డు స్థాయిలో వరి పంట పండించామని కాంగ్రెస్ చెబుతోంది. మరోవైపు కాళేశ్వరం అలా కుంగిపోవడానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు బాంబులు వేసి ఉండొచ్చని కేటీఆర్ ఆరోపిస్తున్నారు. ఇన్ని పరిణామాల మధ్య భవిష్యత్తు కాలంలో బిజెపితో కనుక కారు పార్టీ సయోధ్య కుదుర్చుకుంటే.. అప్పుడు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీతో కెసిఆర్ ముఖాముఖి పోరాడాల్సి ఉంటుంది..ఇన్ని పరిణామాలు జరుగుతుంటే గులాబీ నాయకులు సైలెంట్ గా ఉన్నారు. కొంతమంది సోషల్ మీడియా యాక్టివిస్టులు నిశ్శబ్దాన్ని ఆశ్రయిస్తున్నారు. ఎందుకంటే ఇటీవల కల్వకుంట్ల కవిత రాసిన లేఖల వ్యవహారాన్ని రేవంత్ రెడ్డి ఆడిస్తున్న డ్రామాగా వారు ఆరోపించారు. కానీ స్వయంగా ఆ లేఖలను తానే రాశానని కల్వకుంట్ల కవిత ఒప్పుకోవడంతో వారంతా ఒక్కసారిగా సైలెంట్ అయిపోయారు. దీనికి తోడు అధిష్టానం నుంచి కూడా ఆదేశాలు రావడంతో ఎవరూ ఎటువంటి మాటలు మాట్లాడటం లేదు. అంతటి కేటీఆర్ కూడా ఏదో పరోక్షంగా వ్యాఖ్యానించాడు గాని.. నేరుగా మాట్లాడటానికి.. నేరుగా విమర్శలు చేయడానికి సాహసించలేదు. భారత రాష్ట్ర సమితిలో భవిష్యత్తు కాలంలో జరుగుతున్న మార్పులు ఎలాంటి ప్రభావం చూపిస్తోందో మరి చూడాలి

# ఈ నెల్లో 3 నెలల రేషన్

వరంగల్, మే 29, పేదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతీనెల రేషన్ షాపుల ద్వారా సరుకులు పంపిణీ చేస్తున్నాయి. తెలంగాణలో రెండు నెలలుగా రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారు. దీంతో చాలా మంది బియ్యం తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ తరుణంలో కేంద్రం కీలక ఆదేశాలు జారీ చేసింది. మూడు నెలలకు సంబంధించిన రేషన్ ఒకేసారి పంపిణీ చేయాలని రాష్ట్రాలను ఆదేశించింది.వర్షాకాలంలో ఆహార ధాన్యాల సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జూన్, జులై, ఆగస్టు నెలలకు సంబంధించిన రేషన్ కోటాను ఒకేసారి పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు జూన్ నెల 1 నుంచి 30 వరకు రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీకి ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ కార్యక్రమం సజావుగా సాగేందుకు అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు.రేషన్ పంపిణీలో పారదర్శకత, జవాబుదారీతనం నిర్ధారించేందుకు బయోమెట్రిక్ ధ్రువీకరణ విధానాన్ని కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించింది. ప్రతీనెల కోటాకు వేర్వేరుగా బయోమెట్రిక్ ద్వారా గుర్తింపు చేయాలని ఆదేశించింది. ఈ విధానం ద్వారా రేషన్ లబ్ధిదారుల గుర్తింపు ఖచ్చితంగా జరుగుతుంది, దుర్వినియోగాన్ని నివారించవచ్చు. అధికారులు రేషన్ దుకాణాల్లో సరైన నిల్వలు, పంపిణీ వ్యవస్థలను సిద్ధం చేయాలని సూచనలు వచ్చాయి.వర్షాకాలంలో రవాణా, నిల్వ సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. గతంలో వర్షాల కారణంగా రేషన్ సరఫరాలో జాప్యం జరిగిన సందర్భాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో, మూడు నెలల రేషన్‌ను ఒకేసారి అందించడం ద్వారా లబ్ధిదారులకు ఆహార భద్రతను నిర్ధారించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. తెలంగాణలో 2024లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైన నేపథ్యంలో, ఈ నిర్ణయం సమయోచితమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.తెలంగాణలో దాదాపు 90 లక్షల రేషన్ కార్డు దారులు ఉన్నారు, వీరికి నెలకు 6 కిలోల సన్న బియ్యం అందించబడుతుంది. ఈ కొత్త నిర్ణయం ద్వారా ఒక్కో లబ్ధిదారుకు 18 కిలోల బియ్యం మూడు నెలల కోసం ఒకేసారి అందుబాటులో ఉంటుంది. రాష్ట్రంలో 35,000 రేషన్ దుకాణాలు ఈ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తాయి. గతంలో ఇలాంటి ఒకేసారి పంపిణీ కోవిడ్?19 సంక్షోభ సమయంలో చేపట్టబడింది, అది విజయవంతంగా అమలైంది.

నిల్వ సమస్యలు: మూడు నెలల రేషన్‌ను ఒకేసారి నిల్వ చేయడానికి రేషన్ దుకాణాల వద్ద తగిన గిడ్డంగులు, సౌకర్యాలు అవసరం. ప్రభుత్వం ఈ దిశగా అధికారులను ఆదేశించింది.

రవాణా సమస్యలను అధిగమించేందుకు రాష్ట్రవ్యాప్తంగా సమన్వయ వ్యవస్థను బలోపేతం చేయాలి.

అవగాహన: లబ్ధిదారులకు ఈ కొత్త విధానం గురించి సమాచారం అందించేందుకు ుాటూ, స్థానిక మీడియా, గ్రామ సభల ద్వారా ప్రచారం చేయాలి.ఈ నిర్ణయం వర్షాకాలంలో ఆహార భద్రతను నిర్ధారించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. బయోమెట్రిక్ ధ్రువీకరణ విధానం దుర్వినియోగాన్ని తగ్గించి, సమర్థవంతమైన పంపిణీని సాధ్యం చేస్తుంది. అయితే, రేషన్ దుకాణాల వద్ద సరైన నిల్వ సౌకర్యాలు, రవాణా వ్యవస్థలు లేకపోతే ఈ కార్యక్రమం అమలులో సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ప్రభుత్వం ఈ సవాళ్లను పరిష్కరించడానికి సమగ్ర ప్రణాళిక, అధికారులతో సమన్వయం చేయాలి. గత కోవిడ్ సమయంలో ఇలాంటి విధానం విజయవంతం కావడం ఈ కార్యక్రమం సాఫల్యానికి సానుకూల సంకేతం.ఈ చర్య రాష్ట్ర ప్రభుత్వం దూరదృష్టి, లబ్ధిదారుల శ్రేయస్సు పట్ల దాని నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. అదే సమయంలో ఆహార సరఫరా వ్యవస్థలో సాంకేతికత వినియోగాన్ని బలోపేతం చేస్తుంది.

# పోలీస్ యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

విజయవాడ యోగాంధ్ర మాసోత్సవాల సందర్భంగా విజయవాడ, బీఆర్టీఎస్ యోగా స్ట్రీట్లో గురువారం జరిగిన పోలీస్ యోగాంధ్ర కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో కలిసి పాల్గొని, యోగాసనాలు అభ్యసించారు విజయానంద్ మాట్లాడుతూ తనువు, మనసును ఏకం చేసి.. శరీరం మొత్తాన్ని స్వచ్ఛతతో నింపే దివ్య ఔషధం యోగా. ప్రతిఒక్కరూ తమ జీవన మార్గంలో యోగా అభ్యసనాన్ని భాగం చేసుకోవాలన్నదే గౌరవ ముఖ్యమంత్రి ఆకాంక్ష. 26 జిల్లాల్లోనూ ప్రతిరోజూ ఒక ఇతివృత్తంతో ఉత్సాహంగా పండగ వాతావరణంలో యోగా కార్యక్రమాలు సాగుతున్నాయి. రైతులు, విద్యార్థులు, కార్మికులు.. ఇలా ప్రతి వర్గాన్ని యోగాంధ్రలో భాగం చేసే లక్ష్యంతోనే థీమ్ యోగా నిర్వహిస్తున్నాం. రాష్ట్రంలో కనీసం రెండు కోట్ల మంది యోగాలో ప్రవేశించేలా అవగాహన, శిక్షణ కార్యక్రమాలు వుంటాయి. నిపుణులు రూపొందించిన 45 నిమిషాల సరళమైన యోగా కామన్ ప్రోటోకాల్ ప్రకారం కార్యక్రమాలు వుంటాయి. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 100 పర్యాటక ప్రాంతాల్లోనూ ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. రాష్ట్రంలో ప్రతిగ్రామంలోనూ ప్రతి పట్టణంలోనూ యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. జిల్లాకు నాలుగు చొప్పున పర్యాటక ప్రాంతాల్లో యోగా ఔన్నత్యాన్ని చాటిచెప్పే కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. జూన్ 21న విశాఖలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు జరగనున్నాయి. విజయవాడ బీఆర్టీఎస్ యోగా స్ట్రీట్లో విజయవంతంగా ముగిసిన పోలీస్ థీమ్ యోగా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో దాదాపు అయిదువేల మంది పోలీస్ అధికారులు, సిబ్బంది, యోగా ఔత్సాహికులు పాల్గొన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (ఆరోగ్యం, వైద్యం, కుటుంబ సంక్షేమం) ఎంటీ కృష్ణబాబు, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం కమిషనర్ వీరపాండ్యన్; సీసీఎల్ఏ, ఎన్టీఆర్ జల్లా ప్రత్యేక అధికారి జి.జయలక్ష్మి, ఆయుష్ డైరెక్టర్ కె.దినేష్ కుమార్. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, బ్రహ్మకుమారీలు, అమరావతి యోగా కేంద్ర యోగా ఔత్సాహికులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు హాజరయ్యారు.

# కల్లాల్లోనే ధాన్యం

మహబూబ్ నగర్, మే 29,ఓవైపు తరముకొస్తున్న రుతుపవనాలు మరోవైపు హమాలీలు, లారీల కొరత అధికారుల అలసత్వం వెరిసి రైతుల కష్టం వర్షార్పణమౌతోంది. పంట చేతికి వచ్చి పక్షం రోజులవుతున్నా ధాన్యాన్ని తూకం వేసి మిల్లర్లకు పంపాల్సిన అధికారులు హమాలీలు, లారీలు కొరత ఉందంటూ సాకులు చెప్తున్నారని రైతులు మండిపడుతు న్నారు.ఆయా కొనుగోలు కేంద్రాల్లో అప్పటికే తూకం వేసి లారీలను ఆయా మిల్లులకు తరలించినప్పటికీ మిల్లర్లు తరుగు, తేమ పేరుతో కొర్రీలు పెట్టి వాహనాల్లోని ధాన్యాన్ని దించుకోకపోవ డంతో కొనుగోలు కేంద్రాల వద్ద వాహనాల కొరత ఏర్పడుతోందని కొంతమంది అధికారులు సాకులు చెప్తున్నారు.గతంలోనే సేకరించిన ధాన్యాన్ని ఎఫ్సీఐకి బియ్యం తరలించకపోయినా మిల్లర్లతో కుమ్మక్కై అధికారులు కొందరు అవే మిల్లులకు మళ్లీ ధాన్యాన్ని కేటాయిస్తున్నారని ఇతర మిల్లర్లు ఆరోపిస్తున్నారు. మరికొన్ని అధికారులకు అనుకూలంగా ఉన్న మిల్లర్లకు అత్యధిక ధాన్యాన్ని కేటాయించడంతో రైతుల నుండి అడ్డగోలుగా దోచుకుంటున్నారని ఆరోపణ లు వినిపిస్తున్నాయి. రైస్ మిల్లర్లతో కొంతమంది అధికారులు ప్రజాప్రతినిధులు లోపాయి కారి ఒప్పందాలు చేసుకొని వారికి అనుకూలంగానే అడుగులు వేస్తూ రైతులను మాత్రం నట్టేట ముంచుతున్నారని ఆయా గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను తీరా అమ్ముకోవడం కోసం కల్లాల వద్ద ధాన్యాన్ని కాపాడుకునేందుకు రక్షణగా కాపలా కాయవలసిన పరిస్థితి ఏర్పడిందని రైతులు మండిపడుతున్నారు.కుటుంబం లోని పిల్లా జెల్లా అంతా కళ్ళల్లోనే ఉంటూ ఎండకు ఎండబెడుతూ వానకు తడవకుండా అనేక ఆపసోపాలకు గురవుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా కొనుగోలు కేంద్రాల వద్ద సంబంధిత సిబ్బంది అధికారులు అలసత్వం వహించినట్లు జిల్లా కలెక్టర్ పర్యటనలో గుర్తించినప్పటికీ వారిపై చర్యలు తీసుకునేందుకు ఎందుకు జంకుతున్నారో మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగులుతోంది.నిబంధనలను ఉల్లంఘించి రైతులు నష్టపోయే విధంగా వ్యవహరించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉన్నా నేరుగా కలెక్టర్ పర్యటించిన సందర్భాల్లో అధికారుల అలసత్వం గుర్తించినప్పటికీ పట్టించుకోకపోవడం వెనక ఆంతర్యం ఏంటని ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యానికి కూడా డబ్బులు ఆలస్యం అవుతుందని ఇతర పంట సాగు కోసం పనిచేసుకోలేక ఆయా బ్యాంకుల చుట్టూ అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి దాపురించిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 15 రోజులుగా ఆయా కల్లాల వద్ద వరి ధాన్యం ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ ఉండడంతో ధాన్యం మొలకెత్తుతుందని రైతులు దిగులు పడుతున్న పరిస్థితి.ప్రస్తుతం ఆయా కొనుగోలు కేంద్రాల వద్ద బీహార్ రాష్ట్రానికి చెందిన హమాలీలచే ధాన్యం తరలింపు చేస్తున్నారు ధాన్యం తరలింపు కోసం ఒప్పందం చేసుకున్న లారీ ఓనర్లు కూడా తక్కువ సంఖ్యలో లారీలను ఏర్పాటు చేస్తున్నప్పటికీ వారిపై చర్యలు తీసుకోకపోవ డంతో ఈ సమస్య ఉత్పన్నమవుతుందని రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 1,04,712 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఆయా కొనుగోలు కేంద్రాల నుంచి సేకరించగా 1,03,617 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని ఆయా రైస్ మిల్లర్లకు సరఫరా చేసినట్లు అధికారులు చెప్తున్నారు. ఇంకా 1,095 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కల్లాల్లోనే మగ్గుతోందని అధికారిక లెక్కలే చెప్తున్నాయి .కానీ అనధికారికంగా ఇప్పటికీ ఆయా రైతుల నుంచి కొనుగోలు చేయకుండా కళ్ళాల్లోనే మగ్గుతున్న ధాన్యం ఇంకా 50వేల మెట్రిక్ టన్నుల దాకా ఉంటుందని అంచనా వేస్తున్నారు.

# తిరుపతి శ్రీ వెంకటేశ్వర జూలాజికల్ పార్కు నందు పెద్ద ఎత్తున యోగ కార్యక్రమం నిర్వహణ

**యోగా మన దైనందిన జీవితంలో ఒక భాగం కావాలి... యోగాతో సంపూర్ణ ఆరోగ్యం... :**

**జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్**

**యోగాంధ్ర లో అందరూ భాగస్వాములు కావాలి.**

**- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు**



తిరుపతి, మే29: యోగా మన దైనందిన జీవితంలో ఒక భాగం కావాలి... యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎంఎల్ఏ ఆరని శ్రీనివాసులు సంయుక్తంగా పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా తిరుపతి శ్రీ వెంకటేశ్వర జూలాజికల్ పార్కు నందు యోగ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఉదయం నిర్వహించిన యోగాంధ్ర- 2025 శిక్షణా కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, జూ క్యూరేటర్ సెల్వం, డి ఎఫ్ ఓ వివేక్, యోగాంధ్ర శిక్షణ కార్యక్రమంలో పాల్గొని యోగాసనాలు చేసారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నెల రోజుల పాటు నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. జూన్ 21న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విశాఖపట్నం లో నిర్వహిస్తున్నారని, ఈ కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హాజరవుతారని అన్నారు. నెలరోజులు పాటు యోగాపై ప్రజలకు అవగాహన, ప్రయోజనాలు వివరించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొంచామని అన్నారు. ఈ నెల 21 న మహిళా వర్సిటీలో యోగా దినోత్సవాన్ని ప్రారంభించామని, అప్పటి నుండి ప్రతి రోజు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రతి ఒక్కరికి యోగా పై అవగాహన వచ్చేలా రానున్న రోజుల్లో మన జిల్లాలో అత్యంత ప్రాముఖ్యత, విశిష్టత కలిగిన 5 ప్రదేశాల్లో భాగంగా నేడు ఎస్.వి జూ పార్క్ నందు యోగ శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. తిరుమల, శ్రీహరి కోట, చంద్రగిరి కోట, శ్రీకాళహస్తి, యోగా పై పలు అవగాన కార్యక్రమాలు నిర్వహించబోతున్నామని అన్నారు.

యోగ అనేది ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగం కావాలని తెలిపారు అలాగే ప్రతి ఒక్కరు ఇంకో నలుగురికి యోగ చేయడం వల్ల ప్రయోజనాలను వివరించి వారి చేత కూడా యోగాను చేయించే బాధ్యత ప్రతి ఒక్కరు తీసుకోవాలని తెలిపారు.

ప్రతి మండలానికి నలుగురు మాస్టర్ ట్రైనర్ లను ఏర్పాటు చేశామని వారు ఒక్కొక్కరు 200 మందికి ట్రైనింగ్ ఇచ్చి ప్రతి మండలంలో, గ్రామంలోని ప్రతి పౌరుడికి యోగా పై అవగాహన కలిగేలా చూస్తున్నామని. సుమారు జిల్లాలో 10 లక్షల మంది యోగా లో ప్రావీణ్యం పొందేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విశాఖ పట్టణంలో గౌ.ప్రధానమంత్రి హాజరు కానున్న కార్యక్రమానికి కూడా జిల్లా నుండి యోగా లో శిక్షణ తీసుకున్న వారిని పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రతి ఒక్కరికి యోగ పై అవగాహన కలిగేలా అవగాహన కార్యక్రమాలు జిల్లా అంతట చేపడుతామని తెలిపారు.

ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్రను అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని అందరూ పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. జూన్ 21న విశాఖపట్నం లో సుమారు ఐదు లక్షల మంది తో యోగా దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని అన్నారు. యోగా అనేది ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని అన్నారు. మునిసిపల్, మండల, గ్రామ స్థాయిలో జరిగే యోగాంధ్ర కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారి రామ్మోహన్, సాంఘిక సంక్షేమ సాధికారతాధికారి మరియు నోడల్ అధికారి విక్రమ్ కుమార్ రెడ్డి, డిఎంహెచ్ఓ బాలకృష్ణ నాయక్, టూరిజం శాఖ అధికారి జనార్దన్ రెడ్డి, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, అటవీశాఖ అధికారులు మరియు సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆయుష్ సిబ్బంది, స్థానిక ప్రజలు,యువత విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## రత్నాల చెరువులో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్

మంగళగిరి గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు అడిషనల్ బజూ రవికుమార్ పర్యవేక్షణలో నార్త్ జోన్ డిఎస్పి మురళీకృష్ణ మంగళగిరిలోని రత్నాల చెరువులో కార్డన్ సెర్చ్ జరిగింది. 120 మంది పోలీస్ సిబ్బందితో తనిఖీలు చేసారు. ఇద్దరు రౌడీ షీటర్ లను అదుపులోకి తీసుకున్నారు. సరైన పత్రాలు లేని 85 మోటార్ సైకిల్స్ సీజ్ చేసారు. అసాంఘిక కార్యక్రమాలు ఏమైనా జరుగుతున్నాయని ఆరా తీశారు అడిషనల్ ఎస్పి. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి రవికుమార్ తో పాటు మంగళగిరి డిఎస్పి మురళీకృష్ణ మంగళగిరి టౌన్ సీఐ వినోద్ కుమార్, తాడేపల్లి సిఐ కళ్యాణ్ రాజు , ఎస్ఐ మహేష్, ఎస్ఐ ప్రతాప్ పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

# ఆపరేషన్ సిందూర్ స్ఫూర్తితో ఆపరేషన్ క్లీన్ పాలిటిక్స్

# ఆపరేషన్ క్లీన్ పాలిటిక్స్ తో ఆర్థిక ఉగ్రవాదులను ఏరిపారేస్తాం

**వేలకోట్ల ప్రజా సంపద దోచేసి ప్యాలెస్ల నుంచి ఎస్టేట్లకు ఎదిగారు**

**ఇటుకా...ఇటుకా పేర్చి రాష్ట్ర పునర్నిర్మాణం చేస్తున్నాం**

**చరిత్రలో చూడని భూ వివాదాలతో ప్రజలు అల్లాడుతున్నారు... వచ్చే మహానాడు నాటికి భూ సమస్యలు తీర్చుతాం**

**అభివృద్ధి కొనసాగాలంటే మంచి ప్రభుత్వాలు కంటిన్యూ అవ్వాలి**

**వైకుంఠపాళి అభివృద్ధి మనకు వద్దు... నిరంతర అభివృద్ధి జరగాలి**

**కడప టీడీపీ అడ్డా అని మహానాడుతో నిరూపించాం**

**ఆదరించిన జనం రుణం తీర్చుకుంటాం..**

**రాయలసీమ అభివృద్ధికి బ్లూప్రింట్**

**అన్నమయ్య ప్రాజెక్ట్ తిరిగి నిర్మిస్తాం**

**జూన్ 12లోపు కడప స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభిస్తాం**

**కడపకు నీళ్లు అందించేందుకు గాలేరు-నగరికి రూ.1,000 కోట్లు**

**గండికోటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం**

**మహానాడు తీర్మానించిన ఆరు శాసనాలు తెలుగు జాతి అభివృద్ధికి మార్గాలు**

**శభాష్ కడప...మహానాడు సూపర్ హిట్**

**కార్యకర్తల త్యాగం, పోరాటాల ఫలితమే ఈ ప్రజాపాలన**

**మహానాడు బహిరంగ సభలో టీడీపీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి చంద్రబాబు**

**జనసంద్రమైన కడప మహానాడు పసుపు పండుగలా ముగింపు సభ**



కడప, మే 29: పాక్ ఉగ్రవాదులను ఏరిపారేసిన ఆపరేషన్ సింధూర్ స్ఫూర్తితో ఆపరేషన్ క్లీన్ పాలిటిక్స్... పాజిటివ్, ప్రోగ్రెసివ్ పాలిటిక్స్‌కు నాంది పలుకుదామని... టీడీపీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయడు కడప మహానాడు వేదికగా పిలుపునిచ్చారు. టెర్రరిస్టులు దేశానికి ఎంత ప్రమాదమో....రాజకీయ ముసుగులో ఉన్న ఆర్థిక ఉగ్రవాదులు సమాజానికి అంతకంటే ప్రమాదకరమని.. వారిని రాష్ట్రం నుంచి తరమికొడదామన్నారు. భారతదేశం టెర్రిస్టులపై ఆపరేషన్ సింధూర్ చేసినట్లుగానే... ఆర్థిక ఉగ్రవాదులను 'ఆపరేషన్ క్లీన్ పాలిటిక్స్'తో రాజకీయల్లో లేకుండా చేద్దామన్నారు. రాజకీయాలు అడ్డం పెట్టుకుని గత ప్రభుత్వంలో ల్యాండ్, సాండ్, వైన్, మైన్ వంటి స్కాంలతో రాష్ట్రాన్ని దోచేశారని అన్నారు. నాడు నమ్మి ఓటేస్తే జె బ్రాండ్స్‌తో, గంజాయి, డ్రగ్స్‌తో ప్రజల ఆరోగ్యాలు పాడుచేశారని చెప్పారు. అడవులు ఆక్రమించి ఎస్టేట్ లు నిర్మించుకున్నారని... కొండలు-చెరువులు కూడా మింగేశారని విమర్శించారు. ప్యాలెస్‌ల నుంచి ఎస్టేట్‌ల వరకు అక్రమ సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నారని... అహంకారంతో విర్రవీగిన వైసీపీకి బుద్ధిచెప్పారని చంద్రబాబు అన్నారు. పార్టీ ఎలా ఉండాలో, పాలన ఎలా ఉండాలో చెప్పడంలో టీడీపీ ప్రస్థానం ఒక ఒక కేస్ స్టడీగా.. పాలకులు ఎలా ఉండకూడదో, పార్టీ ఎలా నడపకూడదో వైసీపీ ఒక కేస్ స్టడీగా పేర్కొన్నారు. గురువారం కడప శివార్లలో మహానాడు 3వ రోజు నిర్వహించిన బహిరంగ సభలో పార్టీ కార్యకర్తలను, ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు. వైసీపీని అడ్రస్ లేకుండా చేస్తామన్న చంద్రబాబు... టీడీపీ కార్యకర్తల త్యాగం, పోరాటాల ఫలితంగానే ఈ ప్రజాపాలన వచ్చిందన్నారు.

మహానాడు సూపర్ హిట్

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మొదటి మహానాడు..దేవుని గడపలో జరిగింది. రెస్పాన్స్ అదిరింది. సూపర్ హిట్ అయ్యింది. ఇక్కడ మీకొక విషయం గుర్తు చేయాలి. గత ఏడాది మే 2వ తేదీన ప్రజాగళం ఎన్నికల సభ కోసం నేను కడపకు వచ్చాను. ఆ రోజు సభలో "కడప రాజకీయం మారుతోంది. కడప గడపలో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది" అని అన్నాను. ఆ మాట అక్షరాలా నిజమైంది. ఆ ఎన్నికల్లో కడపలోనే కాదు...రాష్ట్రంలో ప్రతి ప్రాంతంలో అద్భుత విజయం సాధించాం. ఉమ్మడి కడప జిల్లాలో ఉన్న 10 సీట్లల్లో 7 సీట్లు కూటమి గెలుచుకుంది. ఈ సారి ఇంకొంచెం ఫోకస్ పెట్టి 2029 ఎన్నికల్లో 10కి 10 సీట్లు గెలిచేందుకు సిద్ధమా తమ్ముళ్లూ, ఆడబిడ్డలూ అని అడుగుతున్నాను. ఈ ఎన్నికల్లో రాయలసీమ ప్రజలు అద్భుతమైన తీర్పు ఇచ్చారు... 52 స్థానాలకు 45 స్థానాల్లో కూటమిని గెలిపించారు. ఇందులో టీడీపీనే 40 సీట్లు గెలిచింది. వైసీపికి సీమ జిల్లాల్లో 7 స్థానాలొస్తే, కూటమికి ఒక్క ఉమ్మడి కడప జిల్లాలోనే 7 స్థానాలు వచ్చాయి. ప్రజాతీర్పు మనకు బాధ్యత గుర్తు చేసింది. వైసీపీ ఓటమిని ఇప్పటికీ అర్థం చేసుకోలేదు. అర్థం చేసుకోదు కూడా. టీడీపీ అధికారం కోసం పుట్టిన పార్టీ కాదు....ప్రజల జీవితాలు మార్చాలనేదే మన సిద్ధాంతం.

ప్రజా తిరుగుబాటుతో తిరుగులేని విజయం

తెలుగు దేశం పార్టీకి ప్రజా ఉద్యమాలు, పోరాటాలు, ఎన్నికలు, గెలుపు కొత్త కాదు. గత ప్రభుత్వంపై 5 ఏళ్లు మనం పోరాటాలు చేశాం. హింసా రాజకీయాలు, హత్యలు, కేసులు, అవమానాలు, అవహేళనలు, బూతులు అణిచివేతను కార్యకర్తలు ఎదుర్కొన్నారు. మీరే నా బలం, బలగం. ధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్ నిర్మిస్తామని... టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి కూటమిగా ఏర్పడి ఎన్నికలకు వెళ్లాం. ప్రజలు అసాధారణ విజయంతో ఆశీర్వదించారు. 93 శాతం స్ట్రయిక్ రేట్, 57 శాతం ఓట్ షేర్ , అదిరిపోయే మెజారిటీలు ఇచ్చారు. ఒకప్పుడు అసెంబ్లీకి 10 వేలు...15 వేలు మెజారిటీలు వస్తే మంచి మెజారిటీలు అనుకునేవాళ్లం. కానీ మొన్నటి ఎన్నికల్లో 83 మందికి 30 వేలుపైన, 30 మందికి 50 వేలుపైన, 10 మందికి 70 వేలుపైన, ముగ్గురికి 90 వేలుపైన మెజారిటీలు వచ్చాయి. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్, భీమిలిలో గంటా శ్రీనివాస రావు, మంగళగిరిలో నారా లోకేష్‌కి 90 వేలకు పైగా మెజారిటీ వచ్చింది. (%ఋష్ట్రఎ అశీ%) వైనాట్లు, గొడ్డలి పోట్లు అనేది మన రాజకీయం కాదు... ప్రజలిచ్చిన అధికారాన్ని బాధ్యతలా భావించి ప్రతి క్షణం కష్టపడి పనిచేయడం మన విధానం....ఏడాదిగా అదే చేస్తున్నాం.

గత ప్రభుత్వంలో ఐదేళ్లూ అంథకారమే

సరిగ్గా ఏడాది క్రితం...రాష్ట్రం చిమ్మచీకట్లో, అస్థవ్యస్థ పరిస్థితుల్లో ఉంది. విధ్వంస పాలనతో రాష్ట్రాన్ని 30 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లారు. రూ.10 లక్షల కోట్ల అప్పులు పెట్టారు. రూ.1.20 లక్షల కోట్ల బకాయిలు పెట్టారు. అప్పులకు ఏడాదికి కట్టాల్సిన వడ్డీనే రూ. 40 వేల కోట్లు. ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తారీఖున జీతాలు లేని పరిస్థితి నాడు ఉంది. అయితే కష్టాలను చూసి బెదిరిపోలేదు... సవాళ్లను చూసి పారిపోలేదు... అనుభవంతో ఆలోచించాను. క్లైమోర్ మైన్స్‌కే భయపడని నేను సమస్యలకు భయపడతానా? మనో ధైర్యంతో ముందుకు పోయాం. సంకల్పంతో ఒక్కో ఇటుకా పేర్చుతూ విధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్ నిర్మించే యజ్ఞం చేస్తున్నాం. ఏడాదిలోపే ఎన్నో సంక్షేమ-అభివృద్ధి కార్యక్రమాలతో సుపరిపాలన అంటే ఏంటో చూపించాం.

అందరికీ సంక్షేమమే ధ్యేయం

అభివృద్ధి-సంక్షేమం-సంపద సృష్టి నిరంతరం చేస్తూ... మెరుగైన జీవన ప్రమాణాలు అందించే విధానంతో అడుగులు వేస్తున్నాం. సంపద సృష్టించడం తెలిసిన పార్టీ టీడీపీ. సంక్షేమ కార్యక్రమాలకు నాంది పలికిన నాయకుడు ఎన్టీఆర్. నన్ను నమ్ముకున్న జనం కోసం ఎంతైనా కష్టపడతాను. కోడూరు నుంచి 60 ఏళ్ల వయసులో సైకిల్‌పై ఓ కార్యకర్త కడప మహానాడుకు వచ్చాడంటే అదీ అభిమానం. ఇంతటి అభిమానం పూర్వజన్మ సుకృతం. నెలానెలా ఇస్తున్న పింఛన్లే మనం ఏ స్థాయిలో సంక్షేమం అందిస్తున్నామో చెబుతున్నాయి. దేశంలో ఏ రాష్ట్రమైనా 64 లక్షల మందికి పెన్షన్లు ఇస్తోందా...? ఏడాదికి రూ.33,000 కోట్లు కేవలం పింఛన్లు కోసం ఖర్చు చేసే రాష్ట్రం ఉందా...? మన ప్రభుత్వం దీనిని సాధ్యం చేసింది. మాటిచ్చిన విధంగా వివిధ వర్గాలకు రూ.4 వేలు, రూ.6 వేలు, రూ.10 వేలు, రూ.15 వేల వరకు పింఛన్లు ఇస్తున్నాం. ముందు 3 నెలల మొత్తాన్ని కూడా కలిపి ఇచ్చాం. 16,347 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి... మొదటి సంతకం మాట నిలబెట్టుకున్నాం. దీపం పథకం కింద నాడు గ్యాస్ కనెక్షన్ లు ఇచ్చాం. నేడు దీపం-2 కింద 3 సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. ప్రతి 4 నెలలకోసారి మీ అకౌంట్లో డబ్బులు వేస్తాం. ఎస్సీ వర్గీకరణకు ఉమ్మడి రాష్ట్రంలో నాంది పలికింది మనమే. ఏబీసీడీ కేటగిరీలు చేసి ఇబ్బందులు, సవాళ్లు అధిగమించి నేడు ఎస్సీ వర్గీకరణ చేసింది మన ప్రభుత్వమే. సోషల్ రీఇంజినీరింగ్‌లో ఇదొక చారిత్రక ఘట్టం. అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్లపై దృష్టిపెట్టాం. వీటి కోసం వందల కోట్లు ఖర్చు చేస్తున్నాం. ఏ ఒక్కరూ ఆకలితో బాధపడకూడదని 203 అన్న క్యాంటీన్లు తెరిచాం. అన్నక్యాంటీన్లను మూసేసి పేదల పొట్ట కొట్టిన వ్యక్తి మనకు అవసరమా.. అని అడుగుతున్నాను. 21 దేవాలయాల్లో నిత్యాన్నదానం ప్రారంభిస్తున్నాం. గత ప్రభుత్వం కేంద్ర ఇచ్చిన నిధులను దారిమళ్లించి... దుర్వినియోగం చేసింది. దీంతో కేంద్రం రాష్ట్రాన్ని బ్లాక్ లిస్టులో పెట్టింది. రాష్ట్ర వాటా నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేసిన 94 కేంద్ర ప్రాయోజిత పథకాల్లో 73 పథకాలు పునరుద్ధరించాం. ఇదీ మన చిత్తశుద్ధి.

టీడీపీ అంటేనే బీసీల పార్టీ

తెలుగు దేశం అంటేనే బీసీల పార్టీ. టీడీపీకి బీసీలే వెన్నుముక. బీసీల రాజకీయ, ఆర్థిక, సామాజిక అభ్యున్నతికి ఎప్పుడూ పెద్దపీట వేస్తాం. మొన్నటి బడ్జెట్ లో బీసీల కోసం రూ.47,456 కోట్లు కేటాయించాం. నాయి బ్రాహ్మణుల వేతనాలు రూ.25 వేలకు పెంచాం. చేనేతలకు జీఎస్టీ ఎత్తివేశాం. పవర్ లూమ్స్‌కు 500 యూనిట్లు, హ్యాండ్ లూమ్స్ 200 యూనిట్లకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. గీత కార్మికులకు 10 శాతం మద్యం షాపుల కేటాయించాం. వడ్డెరలకు మైనింగ్ లీజులు ఇస్తాం. మత్స్యకారుల ఉపాధిని దెబ్బతీసే 217 జీవో రద్దు చేశాం. మత్స్యకారుల సేవలో పథకం ద్వారా రూ.20 వేల ఆర్థిక సాయం కింద రూ. 259 కోట్లు ఇప్పటికే అందజేశాం. జీవాల కొనుగోలుకు యాదవులు, కురబలకు ఆర్థిక సాయం చేస్తాం. స్వర్ణకారులకు కార్పొరేషన్ ఏర్పాటు చేశాం. పిఎం సూర్యఘర్ కింద 20 లక్షల ఎస్సీ, ఎస్టీల ఇళ్లపై ఉచితంగా సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేస్తున్నాం. సోలార్ విద్యుత్ పథకంలో బీసీలకు 3 కిలో వాట్లకు గాను మొత్తం రూ.98 వేలు సబ్సిడీ ఇస్తాం. అగ్రవర్ణాల వారు తమ ఇళ్లపై సోలార్ ప్యానెళ్లు పెట్టుకుంటే రూ. 78 వేలు సబ్సిడీ ఇస్తాం. రైతులు పొలాల్లో పీఎం కుసుమ్ కింద సోలార్ పంపు సెట్లు ఏర్పాటు చేసుకోవాలి. వేద విద్యార్థులకు రూ.3 వేల భృతి, అర్చకుల జీతాలు రూ.15 వేలు, ఇమామ్‌లకు రూ.10 వేలు, మౌజన్లకు రూ.5 వేలు, పాస్టర్లకు రూ.5 వేలు చొప్పున గౌరవ వేతనాలు పెంచాం. ఆర్యవైశ్యుల ఇలవేల్పు శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నాం. అమరావతిలో 5 ఎకరాల్లో పొట్టి శ్రీరాములు విగ్రహం, స్మారకం నిర్మిస్తాం. జూనియర్ న్యాయవాదులకు భృతి చెల్లిస్తున్నాం. టెక్నాలజీ ద్వారా పాలనను సులభం చేస్తాం. సాంకేతికతతో అవినీతికి తావులేకుండా చేస్తాం. దేశంలోనే ప్రథమంగా వాట్సప్ గవర్నెన్స్ ద్వారా 'మన మిత్ర'తో 380 సేవలు అందిస్తున్నాం. త్వరలో ఈ సేవల్ని 500కు పెంచుతాం. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై ప్రజాభిప్రాయంతో సేవలు మెరుగుపరుస్తున్నాం.

ప్రభుత్వ ఉద్యోగులకు లబ్ధి

టీచర్‌లకు మేలు చేసేలా 117 జీవో రద్దు చేశాం. పోలీసులకు రూ.213 కోట్ల సరెండర్ లీవ్‌ల సొమ్ము ఇచ్చాం. గత ప్రభుత్వం ఉద్యోగులను అవమానాలకు గురిచేసింది. వారి పిఎఫ్ సొమ్మును కూడా మింగేసింది. నేడు మన కూటమి ప్రభుత్వంలో ఉద్యోగులకు ఒకటవ తేదీనే జీతాలు ఇవ్వడమేకాకుండా... ఏడాది కాలంలో రూ.7,500 కోట్లు వివిధ మొత్తాల కింద విడుదల చేశాం. అంగన్‌వాడీలు, ఆశాలకు రూ.1.5 లక్షల మేర లబ్ధి చేకూరేలా గ్రాట్యుటీ అమలు చేశాం.

భూ బకాసురుల ఆటలు సాగవు

గత ప్రభుత్వం చేసిన దుర్మార్గాలకు, భూ మాఫియాలకు ప్రజలు అల్లాడిపోయారు. నా రాజకీయ జీవితంలో ఈ స్థాయి భూ సమస్యలు ఎప్పుడూ చూడలేదు. పేదలను దోచుకునేందుకు 22 %ూ%ను అస్త్రంగా చేసుకున్నారు. ఆస్తులను వివాదాల్లోకి నెట్టారు. అధికారంలోకి రాగానే ప్రజల భూములకు రక్షణ లేకుండా చేసిన ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ రద్దు చేశాం. కొత్తగా యాంటీ ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ తెచ్చాం. మనం అధికారంలోకి రాకపోయుంటే మీ భూములన్నీ లాక్కునేవారు. రాబోయే మహానాడు కల్లా భూ సమస్యలు పూర్తిగా పరిష్కారం చేస్తానని హామీ ఇస్తున్నాను.

4 ఏళ్లలో మెగా ప్రాజెక్టులు, మెగా లక్ష్యాలు

గత ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పుతోనే ఢిల్లీలో మనకు పరపతి పెరిగింది. కేంద్ర సాయంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుంటున్నాం. పోలవరం ప్రాజెక్టును గాడిన పెట్టాం. 2027, డిసెంబర్ లోగా పోలవరం పూర్తిచేసే బాధ్యత నాది. విశాఖ స్టీల్ ప్లాంట్ సెంటిమెంట్ కాపాడాం... రైల్వే జోన్ ఏర్పాటయ్యేలా చూశాం. మూడు ముక్కలాటతో రాజధాని లేకుండా చేశారు. మన ప్రభుత్వం వచ్చేసింది. అమరావతికి రూ. 15 వేల కోట్లు సమకూర్చేందుకు కేంద్రం సహకరించింది. ఇంటింటికీ నీళ్లు అందించాలనేది ప్రధాని నరేంద్ర మోదీ ఆలోచన. అయితే గత పాలకులు కేంద్రం తెచ్చిన జల్ జీవన్ మిషన్, అమృత్ వంటి పథకాలను కూడా నిర్వీర్యం చేశారు.

యువత కలలు నెరవేరుస్తున్నాం

మొన్నటి విజయంలో యువత భాగస్వామ్యం మరువలేం. వారి భవిష్యత్ కోసమే నేను పనిచేసేది. యువశక్తికి అవకాశాలు కల్పిస్తే... అద్భుతాలు చేస్తారని నేను బలంగా నమ్ముతాను. అందుకే ప్రమాణ స్వీకారం చేసిన మొదటి రోజు నుంచే 20 లక్షల ఉద్యోగాల కల్పిస్తామని చెప్పాం. దాని కోసమే కష్టపడుతున్నాను. రూ. 7 లక్షల 50 వేల కోట్ల 6 లక్షలమందికి ఉద్యోగాల కోసం పెట్టుబడులు వచ్చాయి. మీ రాష్ట్రంలో భూతం ఉంది. రావాలంటే భయమేస్తోందని కొందరు పారిశ్రామికవేత్తలు అన్నారు. ఆ భూతాన్ని భూ స్థాపితం చేస్తున్నామని భరోసా ఇచ్చాను. నూతనంగా తీసుకువచ్చిన 20కు పైగా పాలసీలతో ఫలితాలు వస్తున్నాయి. ఇప్పటికి రూ.4.95 లక్షల కోట్ల పెట్టుబడులపై ఒప్పందాలు చేసుకున్నాం. ఏడాదిలో దేశీయ పెట్టుబడుల్లో అగ్రస్థానంలో ఉన్నాం. వృద్ధి రేటులో దేశంలో రెండో స్థానానికి వచ్చాం. అమరావతికి క్వాంటమ్ వ్యాలీ, విశాఖకు గూగుల్, టీసీఎస్... అలాగే రాష్ట్రంలో రిలయన్స్, ఆర్సెల్లార్ మిట్టల్, బీపీసీఎల్, ఎన్టీపీసీ, ఎల్జీ వంటి సంస్థలు పెట్టుబడులు పెడుతున్నాయి. నాలెడ్జ్ ఎకానమీలో రాష్ట్రాన్ని గ్లోబల్ హబ్ గా తీర్చిదిద్ది యువతకు ఉపాధి కల్పించడంతో పాటు వర్క్ ఫ్రమ్ అవకాశాలు ఇస్తాం. మళ్లీ చెపుతున్నా %×¬ూవీ ఔ×ు౦ ¬ాఖ........ × ¬ూవీ ఔ×ు౦ ¬ాఖు౦%. యువతే నా బలం. యువతపైనే నా ఆశలు. మిమ్మల్ని పైకి తీసుకొచ్చే బాధ్యత నాది. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేస్తాం.

అభివృద్ధి వికేంద్రీకరణ.... రాయలసీమ డిక్లరేషన్

రాయలసీమ అంటే రాళ్ల సీమ కాదు....రాయలసీమను రాష్ట్రానికి ఒక మణిహారంగా మారుస్తాం. రాయల సీమ అభివృద్ధికి ప్రధాన అడ్డంకి ఫ్యాక్షనే అని నాడే గుర్తించాం. సీమ గడ్డపై ఫ్యాక్షన్ ఉండకూడదని కఠినంగా వ్యవహరించాను. రాయల సీమ అభివృద్ధికి మన దగ్గర ప్రత్యేక బ్లూప్రింట్ ఉంది. ఎడ్యుకేషన్ సంస్థలు, ఇరిగేషన్, హార్టికల్చర్, పరిశ్రమలు, గ్రీన్ ఎనర్జీ, టూరిజం, హైవేలు, పారిశ్రామిక కారిడార్లు, ఇండస్ట్రియల్ నోడ్ లతో సీమలో ఏ జిల్లాకు ఏం చెయ్యాలో పక్కా ప్రణాళిక ఉంది. ఇప్పటికే తిరుపతిలో %××ు, ××ూజు=%, ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, కర్నూలు ఉర్దూ యూనివర్సిటీ, %××ు -ణవీ%, అనంతపురంలో సెంట్రల్ యూనివర్సిటీ, నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్ వంటి సంస్థలు మనం తెచ్చాం. కడపలో హజ్ హౌస్ మొదలుపెట్టి 90 శాతం నిర్మిస్తే... గత ప్రభుత్వం దాన్ని పూర్తి చేయలేదు. 6 నెలల్లో హజ్ హౌస్ పూర్తి చేస్తాం. లేపాక్షి – ఓర్వకల్ కారిడార్‌లో డిఫెన్స్, ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్ సిటీ, ఆటోమొబైల్ పరిశ్రమలు, డ్రోన్ సిటీ, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు తీసుకొస్తాం. కర్నూలులో హైకోర్టు బెంచ్‌కు కేంద్రానికి ప్రతిపాదనలు పంపాం. ఆరోజు ఓబులాపురం మైన్స్ పేరుతో దొంగ వ్యాపారం చేసి ఇనుప ఖనిజాన్ని విదేశాలకు తరలించారు. ఆ స్కామ్ లో భాగస్వాములు జైల్లో ఉన్నారు. కడప స్టీల్ ప్లాంట్‌కు నేను శంకుస్థాపన చేస్తే మళ్లీ భూమి పూజ చేసి నాటకాలాడారు. జూన్ 12 లోగా కడపలో స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభిస్తాం. ఫేజ్ 1లో రూ.4,500 కోట్లతో, ఫేజ్ 2లో మరో రూ.4,500 కోట్లతో స్టీల్ ప్లాంట్ నిర్మిస్తాం. ఇది పూర్తి చేసి 6 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. కొప్పర్తి, ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్‌ల అభివృద్ధి పనులు రూ. 5 వేల కోట్లతో జరుగుతున్నాయి.

సీమలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం

నీటి విలువ, రైతు కష్టం విలువ తెలిసిన పార్టీ తెలుగు దేశం. రాయలసీమకు సాగునీళ్లు ఇవ్వాలని మొదట ఆలోచన చేసిందే ఎన్టీఆర్. సీమకు నీళ్లిస్తాం. తెలుగుగంగ, కెసి కెనాల్ అభివృద్ధి, హంద్రీనీవా, గాలేరు - నగరి, మచ్చుమర్రి లిఫ్ట్ వంటి ప్రాజెక్టులు టీడీపీ హయాంలో చేపట్టినవే. వేదవతి, అలగనూరు, గండికోట లిఫ్ట్ ప్రాజెక్టులు మన చొరవే. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్ట్‌ను పునర్ నిర్మిస్తాం. నాటి మన ప్రభుత్వంలో రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులపై రూ.12,441 కోట్లు ఖర్చు చేస్తే వైసీపీ ఖర్చు చేసింది కేవలం రూ. 2 వేల కోట్లు మాత్రమే. సీమలో ప్రతి ఎకరాకు నీళ్లు ఇవ్వాలని పోలవరం-బనకచర్ల కు రూపకల్పన చేశాం. వంశధార నుంచి పెన్నా వరకూ నదుల అనుసంధానం జరుగుతుంది. నేను సంకల్పం చేస్తే వదలను. హంద్రీనీవా సుజల స్రవంతి ఫేజ్ 1, ఫేజ్ 2 కోసం రూ.3,873 కోట్లతో పనులు చేస్తున్నాం. గాలేరు నగరి పనులు పూర్తి చేసి జలాలు కడపకు తీసుకురావడానికి అవసరమైన రూ. 1,000 కోట్లు ఇప్పుడే విడుదల చేస్తున్నాను. రాయలసీమను ఉద్యానవన పంటలకు చిరునామాగా చేస్తాం. గండికోట ఎపి గ్రాండ్ క్యానియన్. దీన్ని ఉత్తమ పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతాం. అక్కడే శ్రీకృష్ణ దేవరాయుల 100 అడుగుల విగ్రహం పెట్టి... ప్రజల అభిమతం నెరవేరుస్తాం. తిరుపతి, ఒంటిమిట్ట, కాళహస్తి, కాణిపాకం, శ్రీశైలం, అహోబిలం, మంత్రాలయం, పుట్టపర్తి క్షేత్రాలను టెంపుల్ టూరిజం కింద అభివృద్ధి చేస్తాం. సీమలో రాబోయే రోజుల్లో పేదరికం ఉండదు. రాష్ట్రానికి మణిహారంగా తయారుచేస్తాం. ప్రజల జీవితాలు మార్చేది మంచి పాలన, మంచి పాలసీలు మాత్రమే. కులం, మతం, ప్రాంతం కాదు. అందుకే ప్రజలు ఏ పార్టీ మంచిచేస్తుంది.. ఏ పాలకుడు అభివృద్ధి చేస్తాడు అనేది చూడాలి. 2019లో తెలుగు దేశం రాకపోవడం వల్ల ఎంత నష్టపోయారో ప్రజలు మరిచిపోకూడదు. 2004 వరకూ తెలంగాణలో టీడీపీ చేసిన అభివృద్ధి ఆ రాష్ట్రాన్ని ఎకానమీలోనే దేశంలోనే నెంబర్ వన్ చేసింది. నాడు గెలిచి ఉంటే... ఇప్పుడు మనం చెప్పుకున్న పనుల్లో అనేకం గతంలోనే పూర్తయ్యేవి. తెలుగుదేశం అధికారానికి దూరమైన ప్రతి సారీ.... రాష్ట్రం అంథకారంలోకి వెళిపోతుంది. అందుకే చెపుతున్నా... మంచి పాలకులు కొనసాగాలి. అభివృద్ధి అనేది వైకుంఠపాళి కాకూడదు. అప్పుడే అనుకున్న ఫలాలు ప్రజలకు అందుతాయి.

6 శాసనాలతో అద్భుత ఫలితాలు

'ఈ మహానాడులో తీర్మానించుకున్న 6 శాసనాలతో నూతనత్వాన్ని, కొత్త నాయకత్వాన్ని తెచ్చాం. ఈ శాసనాలను తూచా తప్పకుండా అమలుచేసి తిరుగులేని ఫలితాలు సాధిద్దాం. స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాన్ని సాధించే క్రమంలో ప్రతీ ఏడాది ఏం చేశామో చెపుతాం. 2029 నాటికి పేదరికం లేని సమాజమే లక్ష్యం. ప్రతి ఒక్కరికీ ఇళ్లు కట్టించి , కనీస అవసరాలు తీర్చుతాం. కార్యకర్తే అధినేత అని మరోసారి చెబుతున్నాను. ప్రస్తుతం రాష్ట్రంలో తలసరి ఆదాయం రూ. 2 లక్షల 67 వేలు. వచ్చే 22 ఏళ్లలో దానిని రూ.55 లక్షల చేసే బాధ్యత నేను తీసుకుంటాను. వెల్తీ, హెల్తీ, హ్యాపీ మన నినాదం. నా జీవితంలో ఇలాంటి మహానాడును చూడలేదు. వచ్చే నెల జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి శ్రీకారం చుడతున్నాం. విశాఖ ఆర్కే బీచ్ పక్కన ఐదు లక్షలమంది యోగా చేస్తారు. ఇదో ప్రపంచ రికార్డు. రాష్ట్రమంతటా 2 కోట్లమంది యోగా చేస్తారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని, పేదరికం లేని సమాజం తీసుకొస్తానని హామీ ఇస్తున్నాను' అని సీఎం చంద్రబాబు అన్నారు. కార్యక్రమం చివరిలో కోడూరు నుంచి సైకిల్‌పై వచ్చి మహానాడుకు హాజరైన కార్యకర్తను సీఎం సన్మానించారు. ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవి విజ్ఞప్తి మేరకు కడపకు తాగునీటి సమస్యను పరిష్కరించడంతో పాటు, బుగ్గవంక చెరువు అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని ముఖ్యమంత్రి సభా వేదికగా హామీ ఇచ్చారు.

# విషమద్యంతో 30వేలమంది అమాయకులను బలిగొన్నారు! విధ్వంస పాలనతో అన్నపూర్ణను అప్పులప్రదేశ్ గా మార్చేశారు!

**మన జెండా పీకేస్తాం అన్నోళ్లు అడ్రస్ లేకుండా పోయారు**
**ప్రాణాలను ఫణంగా పెట్టి పోరాడే పసుపుసైన్యమే మనబలం**
**తెలుగుజాతిని ప్రపంచపటంలో నిలిపిన సిబిఎన్ బ్రాండ్**
**తెలుగుప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అన్న ఎన్టీఆర్**
**ఏడాదిలోనే రూ.8.5లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం**
**ప్రభుత్వ కొనసాగింపుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం**
**రెడ్ బుక్ కాదు, రెడ్ కలర్ చూసినా వాళ్లకు నిద్ర పట్టడం లేదు**
**కడప మహానాడు వేదికపై యువనేత నారా లోకేష్ సింహగర్జన**










కడప: వైసిపి విధ్వంస పాలనలో రాష్ట్రం తీవ్రంగా నష్టపోయింది, దేశానికే అన్నపూర్ణ ఆంధ్రప్రదేశ్ ను అప్పులప్రదేశ్ గా మార్చేశారు, ఒక్క కొత్త కంపెనీ రాకపోగా ఉన్న కంపెనీలు ఇతర రాష్ట్రాలకు పారిపోయాయి, అంతులేని ధనదాహంతో విషం కంటే ప్రమాదకరమైన మద్యాన్ని ఏరులై పారించి 30వేలమంది అమాయకుల ప్రాణాలను బలిగొన్నారు, వేలకోట్లు దోచుకొని రాష్ట్రాన్ని విధ్వంసం చేసి వెళ్లిపోయారని టిడిపి జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కడప మహానాడు వేదికపైనుంచి లక్షలాదిగా తరలివచ్చిన కార్యకర్తలనుద్దేశించి యువనేత లోకేష్ మాట్లాడుతూ... మనకి అధికారం కొత్త కాదు , ప్రతిపక్షం కొత్త కాదు. కానీ 2019 నుండి 2024 వరకూ విధ్వంస పాలన ఎదుర్కొన్నాం. ప్రశ్నిస్తే కేసులు, పోరాడితే అరెస్ట్. మన అధినేతను అక్రమంగా అరెస్ట్ చేసి 53 రోజులు జైల్లో పెట్టారు. నాయకులు, కార్యకర్తల పై వేల కేసులు, అరెస్టులు జరిగాయి. నాయకులు, కార్యకర్తల పై దాడులు చేసారు, హత్యలు చేసారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా, ప్రత్యర్థులు దాడి చేస్తున్నా మీసం మెలేసి తొడకొట్టిన అంజిరెడ్డి తాత మన దమ్ము. గొడ్డలి తో దాడి చేసినా, కత్తులదాడిచేసి తల నుండి రక్తం కారుతున్నా ఈవిఎం మెషిన్కు సీల్ వేసే వరకూ పోలింగ్ బూత్ లో కూర్చున్న మంజులా రెడ్డి మన ధైర్యం. కత్తి మెడ పై పెట్టి వాళ్ళ నాయకుడి కి జై కొట్టమంటే జై చంద్రబాబు జై టిడిపి అన్న చంద్రయ్య మన స్ఫూర్తి. అరాచకులపై పోరాడి కంటిచూపు కోల్పోయిన చెన్నుపాటి గాంధీనే మనకు ప్రేరణ. ప్రాణాలను ఫణంగా పోరాడే పసుపు సైన్యమే మనబలం.

**కడప మాస్ జాతర అదిరిపోయింది!**

తిరుమల తొలిగడప దేవుని కడప... ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయం, అమీన్ పీర్ దర్గా, మరియాపురం చర్చి నెలకొన్న పుణ్యభూమి కడప. పౌరుషం, ఆత్మీయతలను కలగలిపి మహిళలను గౌరవించి గొప్పనేల కడప. కడప మాస్ జాతర మహానాడు అదిరిపోయింది. పౌరుషాల గడ్డపై పసుపు సైన్యం గర్జించింది, దేవుని గడప కడపలో పసుపు పండగ జరుపుకోవడం మన అదృష్టం. 2024లో మాస్ విక్టరీ సాధించాం, రికార్డులు బద్దలు కొట్టాం... చరిత్రను తిరగరాసాం. 94 పర్సెంట్ స్ట్రైక్ రేట్...164 అవుటాఫ్ 175. ఇది కేవలం రికార్డ్ కాదు ఆల్ టైం రికార్డ్. ఇది తెలుగుదేశం పార్టీ కార్యకర్తల నాటుదెబ్బ. జెండా పీకేస్తాం అన్నారు ... పార్టీ కార్యాలయానికి టు లెట్ బోర్డు పెట్టుకున్నారు. పార్టీ లేకుండా చేస్తామన్నోళ్లు అడ్రెస్స్ లేకుండా పోయారు. వై నాట్ 175 అన్నారు ... ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదు. మన బొమ్మలు పెట్టి బాక్సింగ్ చేసారు... ఎన్నికల్లో ప్రజలు ఫుట్ బాల్ ఆడుకున్నారు. ఏ తప్పు చేయని మన అధినేతను అరెస్ట్ చేసారు... ప్రజలు వాళ్ళ నాయకుడిని ప్యాలస్ లో పెట్టి తాళం వేసారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గారికి, గౌరవ మంత్రులు, గౌరవ ఎమ్మెల్యేలు, 82 బ్యాచ్ సీనియర్ నాయకుల దగ్గర నుండి 2025 బ్యాచ్ జూనియర్లకు, ప్రజలకు, అందరి కంటే ముఖ్యం, ఎత్తిన జెండా దించకుండా, మడమ తిప్పకుండా తెలుగుదేశం పార్టీకి కాపలా కాస్తున్నప్రాణసమానమైన కార్యకర్తలకు నా శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను.

**దేవుని గడప సాక్షిగా ప్రజలకు 4ప్రశ్నలు**

దేవునికడప సాక్షిగా ఇక్కడి ప్రజలను నాలుగు ప్రశ్నలను అడగాలనుకుంటున్నా. 1). తల్లిని చెల్లిన మెడబట్టి బయటకు గెంటిదెవరు? 2). సొంత బాబాయిని గొడ్డలిపోటుతో లేపేసిందెవరు? 3). జె-బ్రాండ్స్ తో పేదల రక్తం తాగిందెవరు? 4). బల్లకింద రెడ్ బటన్ నొక్కి ప్రజలను బాదిందెవరు?

**ఆరుశాసనాలే మన శ్వాస!**

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అన్నారు అన్న ఎన్టీఆర్. అందుకే మనం ఆరుశాసనాలు తీసుకున్నాం. కడప మహానాడులో ఏకగ్రీవంగా ఆమోదించిన ఆరుశాసనాలను పొలిట్ బ్యూరో సభ్యుడి నుంచి సామాన్య కార్యకర్త వరకు శ్వాసగా భావించి చిత్తశుద్ధితో అమలుకు కృషిచేయాలి. 1). తెలుగుజాతి - విశ్వఖ్యాతి, పేదలసేవలో %-% రీఇంజనీరింగ్, స్త్రీశక్తి,, యువగళం, అన్నదాతకు అండగ, కార్యకర్తే అధినేత. మనకు రాష్ట్రప్రజలు, ప్రజల ముఖాల్లో చిరునవ్వు, వారి సంతోషమే ముఖ్యం. ఇందుకోసం అహర్నిశలు కష్టపడి ప్రజల మనసు గెలుద్దాం. సమస్యలుంటే ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కరించుకోవాలి. స్థానికంగా సాధ్యం కాకపోతే మా దృష్టికి తీసుకువస్తే మేమే పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నాం. రాజమండ్రి జైలులో చంద్రబాబును చూసినపుడు చాలా బాధేసింది. అలిపిరిలో ఆయనను చంపేందుకు బాబు పేల్చారు. ప్రజలకు అండగా నిలచేందుకు భగవంతుడు ఆయనను ఈనాడు మన ముందుంచారు.

**సిబిఎన్ అంటే ఒక బ్రాండ్**

తెలుగు వారిని ప్రపంచ పటంలో పెట్టింది మన బ్రాండ్ సిబిఎన్. అప్పుడు ఐటీ ఇప్పుడు ఏఐ. అప్పుడు హైటెక్ సిటీ ఇప్పుడు క్వాంటమ్ వ్యాలీ. అప్పుడు సైబరాబాద్ ఇప్పుడు అమరావతి. అప్పుడు రూ.200 పెన్షన్ ను రూ. రెండు వేలు చేసింది మన సిబిఎన్...ఇప్పుడు పెన్షన్ ను రూ.నాలుగు వేలు చేసింది మన సిబిఎన్. అన్న క్యాంటిన్లు, డ్వాక్రా, దీపం, పేదల చిరునవ్వు మన సిబిఎన్. సిబిఎన్ అంటే డెవెలప్మెంట్, సిబిఎన్ అంటే సంక్షేమం, సిబిఎన్ అంటే మానవత్వం. మన నాయకులు ట్రెండ్ ఫాలో అవ్వరు ట్రెండ్ సెట్ చేస్తారు. సినిమా స్క్రీన్ అయినా పొలిటికల్ స్క్రీన్ అయినా ఆయనే లెజెండ్. ఎన్టీఆర్ అంటే మూడు అక్షరాలు కాదు ఒక ప్రభంజనం. ఆయనే రాముడు, ఆయనే కృష్ణుడు, ఆయనే భీముడు, ఆయనే అర్జునుడు, ఆయనే కర్ణుడు, ఆయనే ప్రజల గుండెల్లో దేవుడు.

**దేశానికి సంక్షేమాన్ని పరిచయం చేసింది ఎన్టీఆర్**

పార్టీ పెట్టిన 9 నెలల్లోనే అధికారంలోకి రావడం ఒక చరిత్ర. దేశానికి సంక్షేమం, అభివృద్ధి పరిచయం చేసింది ఎన్టీఆర్. రూ.2 కే కిలో బియ్యం, పెన్షన్, రూ.50 కే హార్స్ పవర్ విద్యుత్, జనతా వస్త్రాలు, పక్కా ఇల్లు, గురుకుల పాఠశాలలు, మధ్యాహ్న భోజన పథకం, మహిళలకు ఆస్తిలో సమాన హక్కు, పటేల్ పట్వారి విధానం రద్దు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, పరిశ్రమల ఏర్పాటు, రోడ్ల నిర్మాణం, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు, మహిళలకు రిజర్వేషన్లు. అభివృద్ధి అయినా, సంక్షేమం అయినా ఎన్టీఆర్ ఒక బ్రాండ్. తెలుగువారి ఆత్మగౌరవం విశ్వ విఖ్యాత, నటసార్వభౌమ స్వర్గీయ శ్రీ నందమూరి తారకరామారావు గారు.

**రాష్ట్రాన్ని కాపాడుకోవడానికే కూటమి ఏర్పాటు**

రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి కూటమి ఏర్పడింది. ప్రజల కోసం ప్రధాని నరేంద్ర మోదీ గారు, జనసేన అధినేత పవనన్న, మన చంద్రన్న జెండాలు, ఎజెండాలు పక్కన పెట్టి కలిసి పనిచేసారు. ప్రజలు కూటమిని ఆశీర్వదించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడింది. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.4 వేల పెన్షన్ ఇస్తున్నాం. దివ్యాంగులకు రూ.6 వేల పెన్షన్ ఇస్తున్నాం. పూర్తిగా బెడ్ కే పరిమితం అయిన వారికి రూ.15 వేలు అందిస్తున్నాం. నేను ఈ వేదిక మీద నుండి వైసిపి వాళ్ళను ప్రశ్నిస్తున్నా వెయ్యి రూపాయల పెన్షన్ పెంచడానికి మీకు ఎన్ని ఏళ్ళు పట్టింది? 5 ఏళ్ళు పట్టింది. దీపం పథకం లో 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. అన్న క్యాంటీన్లు తెరిచాం. పేద వాళ్లు కడుపునిండా భోజనం చేయడం కూడా జగన్ మోహన్ రెడ్డి గారికి ఇష్టం ఉండదు అందుకే అప్పుడు అన్న క్యాంటిన్లు మూసేసారు.

**త్వరలోనే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ**

త్వరలోనే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ ఇస్తాం. ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలుచేస్తాం. 16,347 పోస్టులతో మెగా డీఎస్సి నిర్వహిస్తున్నాం. అభివృద్ధి వికేంద్రీకరణ చేసి చూపిస్తున్నాం. రాయలసీమ ను ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, రెన్యూవబుల్ ఎనర్జీ, హార్టీ కల్చర్ హబ్ గా తయారు చేస్తున్నాం. ప్రకాశం జిల్లా లో రిలయన్స్ సిబిజి ప్లాంట్లు, ఉభయ గోదావరి జిల్లాల్లో ఆక్వా అభివృద్ధిచేస్తున్నాం. ఉత్తరాంధ్ర లో ఐటీ, ఫార్మా, మెడికల్ ఎక్విప్మెంట్ తయారీ, ఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ రాబోతున్నాయి. అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తున్నాం. ఇప్పటికే రూ.8.5 లక్షల కోట్ల పెట్టుబడి వాటి ద్వారా 6 లక్షల ఉద్యోగాల కల్పనకు ఒప్పందాలు చేసుకున్నాం. యువగళం పాదయాత్ర సమయంలో రాయలసీమ ప్రజల కష్టాలను ప్రత్యక్షంగా చూశాక ఈ కడపగడ్డపైనే మిషన్ రాయలసీమ ప్రకటించా. అప్పుడు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా చంద్రబాబు నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం అడుగులు వేస్తోంది. గత ఎన్నికల్లో ప్రభుత్వ ఉద్యోగులంతా కూటమికి సహకరించారు. వారి సమస్యలన్నీ ఒక పద్ధతి ప్రకారం పరిష్కరిస్తాం.

**తెలుగుదేశం పార్టీలో కార్యకర్తే అధినేత!**

తెలుగుదేశం పార్టీలో కార్యకర్తే అధినేత. దేశంలో ఏ పార్టీ ఇవ్వని గౌరవం టీడీపీ కార్యకర్తలకు ఇస్తుంది. దేశంలో ఏ ప్రాంతీయ పార్టీకి కోటి మంది సభ్యులు లేరు. సభ్యత్వం లో కూడా మన రికార్డులు ఎవ్వరూ బ్రేక్ చెయ్యలేరు. 5 లక్షల ప్రమాద భీమా అందిస్తుంది ఒక్క టీడీపీ మాత్రమే. ఫ్యాక్షన్ లో చనిపోయిన కార్యకర్తలు పిల్లలు ఫ్యాక్షన్ వైపు వెళ్ళకూడదని ఎన్టీఆర్ మోడల్ స్కూల్ ఏర్పాటు చేసి చదివించింది మన సిబిఎన్. విద్య, వైద్యం, స్వయం ఉపాధి ఇలా రూ.140 కోట్లు కేవలం కార్యకర్తల సంక్షేమం కోసం ఖర్చు చేసింది టిడిపి. నేను స్వయంగా వైసిపి బాధిత కార్యకర్తల కుటుంబాలను కలుస్తున్నాను. వారి సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నా. వారికి పార్టీ అండగా ఉంటుంది.

**పనిచేసే వారిని ప్రోత్సహిస్తాం**

నామినేటెడ్ పదవులు అన్ని ఒక్క పద్ధతి ప్రకారం ఇస్తున్నాం. మన అధినేత చంద్రబాబు గారు, నేను ఏ ప్రభుత్వ కార్యక్రమం పెట్టుకొని జిల్లాలకు వచ్చినా ఇచ్చిన మాట ప్రకారం ముందు ఉత్తమ కార్యకర్తలు, ఆ తరువాత కార్యకర్తలను కలిసిన తరువాతే ప్రభుత్వ కార్యక్రమాలు పెట్టుకుంటున్నాం. నేను సీనియర్ల ను, జూనియర్స్ ను గౌరవిస్తాను. కానీ పనిచేసేవారినే ప్రోత్సహిస్తా. ప్రతి కార్యక్రమం లో కార్యకర్తలు భాగస్వామ్యం అవ్వాలి. మనం చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజల్లో చర్చ చెయ్యాలి. అధికారంలో ఉన్నప్పుడు కాదు%౸% ప్రతిపక్షంలోనూ జగన్ ను వాళ్ళ నాయకులు, కార్యకర్తలు కలవలేరు. కార్యకర్తల కోసం మా ఇంటి ద్వారాలు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయి. నో.. డోర్స్ క్లోజ్డ్. అది వైసిపి కి టిడిపి కి తేడా.

**రాష్ట్రం కోసం కలిసే ముందుకు సాగుతాం**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కలిసి రాష్ట్రాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తున్నారు. ప్రధాని మోడీ మన రాష్ట్రానికి పూర్తి సహకారం అందిస్తున్నారు. మనం అడిగిన ప్రతి కోరిక తీరుస్తున్నారు. మనకు అహంకారం ఉండకూడదు, అహంకారం విర్రవీగిన గత పాలకుల 151 సీట్లు 11 అయ్యాయి. అందుకే నేల మీద ఉండి ప్రజలకు సేవ చెయ్యాలి. అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నట్టు పనిచేయాలి. చిన్న కుటుంబంలోనే సమస్యలు ఉంటాయి. కూటమి అన్న తరువాత చిన్న చిన్న సమస్యలు ఉండటం సహజం. ఇగో లు పక్కన పెట్టి అందరిని కలుపుకొని పనిచేయాలి. రాసిపెట్టుకోండి విడాకులు ఉండవు. రాష్ట్రం బాగుపడాలి, ప్రజలు సంతోషంగా ఉండాలి అంటే మనం కలిసి ఉండాల్సిందే.

**ప్రభుత్వ కొనసాగింపుతోనే ప్రగతి!**

మహానాడు వేదికగా నేను ప్రజలకు కొన్ని ముఖ్యమైన విషయాలు చెప్పాలని అనుకుంటున్నాను. గవర్నమెంట్ కంటిన్యుటీ, ప్రభుత్వ కొనసాగింపు కొనసాగింపు ముఖ్యం. ఒక రాష్ట్రం అభివృద్ధి చెందాలి అంటే ప్రభుత్వ కొనసాగింపు చాలా ముఖ్యం. కట్టుబట్టలతో బయటకు వచ్చి 14 నుండి 19 వరకూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకున్నాం. 2019లో ప్రభుత్వం మారడంవల్ల, ఒక సైకో ముఖ్యమంత్రివల్ల రాష్ట్రం అన్ని విధాలా నష్టపోయి 30 ఏళ్ళు వెనక్కి పోయింది. అదే 19- 24 వరకూ మన ప్రభుత్వం కొనసాగి ఉంటే ఎటువంటి అభివృద్ధి జరిగేదో ఒక్కసారి ప్రజలంతా ఆలోచించాలి. గుజరాత్ లో బీజేపీ వరుసగా 7 సార్లు గెలిచింది. ఒకే ప్రభుత్వం ఉండటం వలన గుజరాత్ ఎలా అభివృద్ధి చెందిందో చూడండి. ఒడిశాలో బిజూ జనతాదళ్ వరుసగా ఐదు సార్లు గెలిచింది. ఆ రాష్ట్రం అనేక రంగాల్లో అభివృద్ధి చెందింది. ఉమ్మడి రాష్ట్రంలో టిడిపి చంద్రబాబు గారి నేతృత్వంలో ఒకసారి వరుసగా రెండుసార్లు విజయం సాధించాక ఎంతటి అభివృద్ధి సాధించిందో మీకందరికీ తెలుసు. అందుకే ప్రభుత్వ కొనసాగింపు అనేది చాలా ముఖ్యం. దీని గురించి రాష్ట్రవ్యాప్త చర్చజరగాలి. ప్రభుత్వ కొనసాగింపు ఉంటే పెట్టుబడి పెట్టే వారికి నమ్మకం ఉంటుంది. మన యువత ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు.

**రెడ్ బుక్ అంటే ఏమిటో అర్థమైందా రాజా?!**

రెడ్ బుక్ పేరుచెప్పగానే ఒకడికి గుండెపోటు వచ్చింది, మరొకడు బాత్రూమ్ లో కాలిజారిపడ్డాడు, ఇంకొకడు ఏమయ్యాడో మీరందరికీ తెలుసు, అర్థమైందా రాజా? రెడ్ బుక్ అంటే డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని అమలుచేయడమే. అంతా రెడ్ బుక్ రెడ్ బుక్ అని ఏడుస్తున్నారు. ఎవరైతే చట్టాలను ఉల్లఘించి ప్రజలను, కార్యకర్తలను ఇబ్బంది పెట్టారో వారిని చట్ట ప్రకారం శిక్షిస్తాం అని చెప్పాను. ఇప్పుడు రెడ్ బుక్ అదే చేస్తుంది. రెడ్ బుక్ కాదు రెడ్ కలర్ చూసినా వాళ్లకు నిద్ర పట్టడం లేదు. ఒక పద్ధతి ప్రకారం వాళ్ళు చేసిన తప్పులను ఎస్టాబ్లిష్ చెయ్యాలి. దానికి సమయం పట్టొచ్చు. కానీ శిక్ష తప్పదు. ఎవ్వరూ తప్పించుకోలేరు. రెడ్ బుక్ తన పని తాను చేసుకుంటూ వెళ్తుంది. ఇప్పుడు మనం అంతా డెవెలప్మెంట్ బుక్ మీద దృష్టి పెట్టాలి. మనకి ప్రజలు ముఖ్యం , వారి సంతోషం ముఖ్యం. వాళు ళ్ళ చేసిన తప్పులు మనం చెయ్యకూడదు. అనవసరమైన కామెంట్స్ వద్దు. వాళ్ళని ఒక్క మాట కూడా అనొద్దు. వాళ్ళకి మనకి తేడా ప్రజలు గమనించారని యువనేత నారా లోకేష్ అన్నారు.

# జలమండలి నీటి సరఫరా విధానంపై విచారణ జరపాలి.



**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 29 మే 2025**బి.ఆర్.ఎస్ పార్టీ గుడ్ మార్నింగ్ మణికొండ పేరిట ప్రజా సమస్యలు తెలుసుకుంటూ అల్కాపూర్ టౌన్షిప్ లో పర్యటిస్తున్న సందర్భంగా దృష్టికి వచ్చిన ప్రధాన సమస్యలు: లక్షలు పోసి మంచినీటి కనెక్షన్లు తీసుకొని చివరకు ప్రతినిత్యం ట్యాంకర్ల మీదే ఆధార పడాల్సిన దుస్థితి ఏర్పడిందని మరియు ట్యాంకర్లకు వేలకు వేలు ఖర్చు చేయడం జరుగుతోందని తెలిపారు. స్పోర్ట్స్ పార్కులో నిర్మించిన 2. 5 ఎం.ఎల్.డి మంచినీటి రిజర్వాయర్ ప్రారంభోత్సవం కేవలం కాగితాలకే పరిమితమై, మంచినీటి వసతి కోసం ఎన్నో ఆశలు పెట్టుకున్న ప్రజానీకానికి మంచినీరు అన్నది కంటి తుడుపు చర్యగానే మిగిలి పోయింది. మంచినీటి కనెక్షన్ కొరకు హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ ఆక్ట్ ప్రకారం అవసరం లేకున్నను వాల్వుల పేరుతో వేలకు వేలు కట్టించుకొని నెలలు తరబడి కనెక్షన్ ఇవ్వకుండా మీనమేషాలు లెక్కించడం శోచనీయం. గతంలో ఉన్న అధికారులు సాంకేతిక పరంగా ఒక ఇంచ్ కనెక్షన్ ఇవ్వాల్సిన చోట ఇవ్వడం కుదరదని, అర్ధ ఇంచు కనెక్షన్లు మాత్రమే ఇచ్చి నీటి సరఫరా చేయడం జరుగు తున్నదనీ తెలిపారు. అల్కాపూర్ టౌన్షిప్ లో నీటి సరఫరా జరుగుతున్న విధానంపై సమగ్ర విచారణ జరగవలసిన అవసరం ఎంతైనా ఉన్నది కావున హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ వారు తక్షణమే స్పందించి తగు చర్యలు తీసుకోగలరని మణికొండ బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు సీతారం ధూళిపాళ, కుంబగల్ల ధనరాజ్, గుట్టమీది నరేందర్, ఉపేందర్నాథ్ రెడ్డి, గోరుకంటి విఠల్, సంగం శ్రీకాంత్, రాజేంద్రప్రసాద్, భానుచందర్, బాబు, సుమనళిని, షేక్ ఆరీఫ్, ఆరీఫ్ మొహమ్మద్, చెరుకూరి బాలాజీ, కందద ప్రవీణ్, యాలాల కిరణ్ తది తరులు డిమాండ్ చేస్తున్నారు.

# మణికొండలో వీర్ సావర్కర్ జయంతి



**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం 29 మే 2025**హిందుత్వ వాదాన్ని నర నరాన జీర్ణించుకొన్న వినాయక్ దామోదర్ సావర్కర్ – రాధాబాయి, దామోదర్ పంత్ పుణ్య దంపతులకు 1883 మే 28 రోజున మహరాష్ట్ర నాసిక్ జిల్లా భాగూరు గ్రామంలో జన్మించడం జరిగినది. 15 సంవత్సరాల చిరు ప్రాయంలో కుల దేవత అష్ట భుజాదేవి ముందు దేశ స్వాతంత్ర్యం కోసం తన జీవితాన్ని సమర్పిస్తానని ప్రతిన భూనిన యోధుడు, 1857 లోని స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రను మరుగున పడకుండా తన రచనల ద్వారా ప్రజలను ఉత్తేజ పరచిన చరిత్రకారుడు. బ్రిటీష్ రాణికి విధేయత చూపనందుకు సావర్కర్‌కు బార్–ఎట్–లా డిగ్రీ నిరాకరణ చేసినను తన పంథాను మార్చుకో నందున సావర్కర్ అనుచరుడు మదన్‌లాల్ ధింగ్రా – కర్జన్ వైలీని హతమార్చి నందుకు కారణముగా ఇతన్ని అరెస్టు చేసి స్టీమర్‌లో భారత్ కు తీసుకు వస్తుండగా సముద్రంలో దూకి తప్పించుకునే యత్నం చేసినందుకు యావజ్జీవ కారాగార రెండు పర్యాయాల శిక్ష విధించి అండమాన్ జైలులో వేసి నానా తిప్పలు పెట్టినారు. అటువంటి దేశభక్తుని జయంతినీ పురస్కరించుకొని బుధవారం రాత్రి మణికొండ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘం వారు మర్రిచెట్టు కూడలి వద్ద అంజలి ఘటించి, దేశభక్తి నినాదాలు చేస్తూ పుర వీదులలో ర్యాలీ తీయడం జరిగినది.

## వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

## మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు రాధికా గుప్తా



**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మే 29:**వన మహోత్సవంలో పండ్లు, ఔషధ మొక్కలను కూడా ఎక్కువగా నాటేలా చూడాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు రాధికాగుప్తా అన్నారు.

గురువారం కలెక్టరేట్ లోని విసి హాల్ లో అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి అదనపు కలెక్టరు హాజరైనారు. గ్రామీణాభివృద్ధి, అటవీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, మున్సిపల్ కమీషన్లతో వన మహోత్సవ సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ వర్షకాలం ముందుగానే మొదలైనందున ఈ సారి మొక్కలు నాటే కార్యక్రమం వన మహోత్సవం కార్యక్రమాన్ని కూడా ముందుగానే అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలని అన్నారు. గ్రామీణాభివృద్ధి, అటవీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, మున్సిపల్ కమీషన్లతో వన మహోత్సవ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలోని మున్సిపాలిటిలు మొక్కలు నాటేందుకు సిద్దంగా ఉండాలని అందుకు అవసరమైన కార్యాచరణ, ప్రణాళిక దిశగా వెళ్లాలని సూచించారు. జిల్లాలో 70.604 లక్షల వరకు మొక్కలను రోడ్లకు ఇరువైపుల, ప్రభుత్వ పాఠశలలో, ప్రభుత్వ సంస్థల్లో మొక్కలను విరివిగా నాటి లక్ష్యాన్ని సాధించాలన్నారు. ఈ మొక్కలలో పండ్లు, ఔషధ మొక్కలతో పాటు ఈత మొక్కలను తప్పనిసరిగా 10 శాతం నాటేలా చర్యలు తీసుకోవాలన్నారు. మొక్కలను నాటడమే కాకుండా వాటి ప్రతిరోజు నీళ్లు అందించడం, ఎరువు వేయాలడం వంటి సంరక్షణ చర్యలు చేపట్టాలన్నారు.మొక్కలు నాటేందుకు సరిపడా స్థలాలను గుర్తించాలని అధికారులకు సూచించారు. మొక్కలు నాటిన స్థలాలను జియో ట్యాగింగ్ ద్వారా %ు+ఖీవీ×ూ% వెబ్ సైట్ లో ప్రతిరోజు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ సాంబశివరావు, జిల్లా అటవీ శాఖాధికారి జానకిరాం, పర్యాటక శాఖాధికారి శ్రీధర్, ఆర్ అండ్ బిఈఈ శ్రీనివాస్ మూర్తి, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖాధికారి వినోద్ కుమార్, హౌజింగ్ పిడిరమణ మూర్తి, హెచ్ఎండిఎ, జిహెచ్ ఎంసి, అటవీ శాఖల అధికారులు, మున్సిపల్ కమీషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవు

## వ్యవసాయాధికారి శ్రీహరి



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి( మే 29 ప్రజాబలం)** సంగారెడ్డి జిల్లా, నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని, మండల వ్యవసాయ అధికారి శ్రీహరి, బుధవారం సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండల కేంద్రంలోని , జోగిపేటలో, వివిధ గ్రామాలలోని ఫర్టిలైజర్ దుకాణాలను, తనిఖీ నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎరువులు క్రిమిసంహారక దుకాణల యజమానులు, స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్కులు, తప్పనిసరిగా నిర్వహణ చేయాలని, ఎరువులు క్రిమిసంహారక మందులు కొనుగోలు చేసిన రైతులకు, రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలని కోరారు, ఖరీఫ్ సాగు కోసం తెచ్చిన విత్తనాలను ఆయన పరిశీలించారు, ఈసారి వానకాలం ముందుగానే, ఋతుపవనాలు ఆగమనం కావడం సంతోషకరమని పేర్కొన్నారు, అధికృత డీలర్లు, రైతులకు విత్తనాలు అధిక ధరలకు అమ్మితే, లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు, ప్రస్తుతం మార్కెట్లోఉన్న ఏ కంపెనీ ఎరువులు అయినా, వాడుకోవచ్చు అని సూచించారు, ఈ– పాస్ మిషన్ ద్వారా నే రైతులకు ఎరువులు అందించాలని చెప్పారు, ఈ యొక్క తనిఖీలో భాగంగా మండల వ్యవసాయ అధికారిని,, జోగిపేట పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ పాండు,, తదితరులు పాల్గొన్నారు....

## ధాన్యం మొత్తం కొంటాం ఆందోళన వద్దు

## ఉమ్మడి మెదక్ జిల్లా,(డి సిఎంఎస్),ఇన్చార్జి మేనేజర్ ఆంజనేయులు



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆంజనేయులు

**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి (మే 29 ప్రజాబలం)** సంగారెడ్డి జిల్లా, జిల్లాలో సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) ఆధ్వర్యంలో 31 కేంద్రాలలో 1, లక్ష 77 వేల, 360 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామని,( డిసిఎంఎస్) ఉమ్మడి జిల్లా ఇన్చార్జి బిజినెస్ మేనేజర్, ఆంజనేయులు అన్నారు, బుధవారం చౌటకూరులోని, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆంజనేయులు పరిశీలించారు, ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ, యాసంగి సీజన్ కు సంబంధించి, 3081, మంది రైతుల నుంచి, వరి ధాన్యం కొనుగోలు చేశామన్నారు, అకాల వర్షాలకు తడిసిన వరి ధాన్యం, రైతులు పండించిన చివరి ధాన్యం గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని, రైతులు అధైర్య పడవలసిన అవసరం లేదని ఆయన అన్నారు, రైతులకు టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచామని ధాన్యం కొనుగోలులోఎలాంటి నిర్లక్ష్యం లేదన్నారు, గత ఏడాదిలో 3, లక్షల పైగా ధాన్యాన్ని కొనుగోలు చేశామని, ఈసారి పంట దిగుబడులు అంతగా లేవన్నారు, జిల్లాలో నిర్వహిస్తున్న 31,కేంద్రాలలో కొనుగోలు పూర్తికావస్తున్నాయని అన్నారు, కాంట వేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు పంపేందుకు, లారీల కొరత తీవ్రంగా ఉందని, జిల్లా ఉన్నత, అధికారులను సంప్రదించి,సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు, చౌటకూర్ లో మరో 4, లారీలకు సరిపడా ధాన్యం బస్తాలు ఉన్నాయని వివరించారు.....

# మాజీ మంత్రి హరీష్ రావు పాటల సీడీ ఆవిష్కరణ

**మాట తప్పని నైజాం మడమ తిప్పని పాదం హరిశన్న:ఎమ్మెల్యే చింతా ప్రభాకర్**

**సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పండుగ వాతావరణంలో పాటల సీడీ ఆవిష్కరణ.**




**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి మే 29(ప్రజాబలం)**సంగారెడ్డి జిల్లా/సంగారెడ్డి:వచ్చే నేల 03వ తేదీన మాజీ మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావుజన్మదినం సందర్భంగా కోహీర్ పిఎసిఎస్ చైర్మన్ స్రవంతీ అరవింద్ రెడ్డి ఆధ్వర్యంలో రూపొందించిన పాటల సీడీని సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్,జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు,మాజీ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి ఆవిష్కరించారు,అనంతరం జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు మాట్లాడుతూ హరీష్ రావు,ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ,ప్రజా గుండెలో నిలిచే నాయకుడు,పిలిస్తే పలికే నాయకుడు హరీష్ రావు అంటే కొండంత అండ,హరీష్ రావు పాటల సీడీ ఆవిష్కరణ లో పాల్గొనడం అదృష్టంగా భావిస్తాం అని అన్నారు,పాటల సీడీ ఆవిష్కరణకు కృషి చేసిన స్రవంతి అరవింద్ రెడ్డిని అభినందించారు,సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ మాట తప్పని నైజాం మడమ తిప్పని వ్యక్తం హరీష్ రావు, ఏ శాఖ ఇచ్చిన సమర్థవంతంగా తనదైన ముద్ర వేసుకుంటారు,హరీష్ రావుకి కాళేశ్వరం ప్రాజెక్టు పనులు అప్పజెప్పితే శక్తి వంచన లేకుండా అప్పటి గవర్నర్ చేత కాళేశ్వర్ రావు అనే పేరు సంపాదించిన ఘనత హరీష్ రావుకి దక్కుతుంది నాయకులకు గాని, ప్రజలకు గాని ఎలాంటి సమస్య ఉన్న నేను ఉన్న అంటూ భరోసా కల్పించి గుండెకు హత్తుకునే నాయకుడు హరీష్ రావు అని అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి, మాజీ టీఎన్జీవో అధ్యక్షులు రాజేందర్ రెడ్డి, మాజీ సిడిసి చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి,డిసిసిబి వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం,శివరాజ్ పాటిల్,చింత గోపాల్,మందుల వరలక్ష్మి, ఆర్ వెంకటేశ్వర్లు,నర్సింలు,మాజీ కౌన్సిలర్లు ,జహీరాబాద్ నియోజకవర్గ వివిధ మండల పార్టీ అధ్యక్షులు నారాయణ,వెంకటేశం,సంజీవ రెడ్డి నర్సింలు, తదితరులు ఉన్నారు.

## మూడు మృతదేహాల వెలికితీత

కోవూరు పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం అయోధ్యలంక పంచాయతీ పరిధిలోని రావిలంక వశిష్ట గోదావరిలో మంగళ వారం సాయంత్రం 5 గంటల సమయంలో స్నానాలు చేయడానికి వచ్చారు. వీరిలో నాగులంకకు చెందిన కేతా ప్రవీణ్ (15), సానబోయిన సూర్య తేజ (12), పెదలంకకు చెందిన నీతు పూడి పాల్కుమార్ (12) గోదావరిలో దిగగా.. మరో ఇద్దరు విద్యార్థులు గట్టుపైనే ఉన్నారు. అయితే, ముగ్గురు విద్యార్థులు గల్లంతవ్వడంతో గట్టుపైన ఉన్న ఇద్దరు విద్యార్థులు భయపడి పారిపోయారు. గోదావరిలో విద్యార్థులు గల్లంతయ్యారని తెలిసిన తహశీల్దార్ జి.కనకరాజు, ఎస్ఐ కె.వెంకటరమణ, ప్రమాద స్థలానికి గత రెండు రోజులుగా గాలింపు చర్యలు గజ ఈతగాళ్లతో చేపట్టిన మంగళవారం రాత్రి వరకూ ఆచూకి లభించలేదు. బుధవారం ఉదయం మళ్లీ గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు ప్రారంభించగా వారు నీట మునిగిన ప్రాంతంలోనే ప్రవీణ్, సూర్యతేజ, పౌల్కుమార్ మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతదేహాల వెలికితీతతో అక్కడే ఉన్న కుటుంబీకుల రోదనలతో ఆ ప్రాంతం మార్మోగింది పంచనామా అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆచంట ఎస్ఐఐ వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రాజన్న ఆలయ అభివృద్ధికి వ్యతిరేకం కాదు, రాజన్న ఆలయ పరిరక్షణ సమితి అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం),** గురువారం రోజున వేములవాడ పట్టణంలోని భీమేశ్వర గెస్ట్ హౌస్ లో రాజన్న ఆలయ పరిరక్షణ సమితి అధ్యక్షుడు, బిజెపి రాజన్న సిరిసిల్ల జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, రాజన్న ఆలయ అభివృద్ధి గురించి చర్చిస్తామని, రాజన్న పరిరక్షణ సమితి తో మాట్లాడడం, మరోవైపు దేవస్థానం ఈవో ద్వారా కెవిట్ నోటీస్ ఇవ్వడం ఏంటి అని, దేవాలయ అభివృద్ధిని అడ్డుకుంటున్నమని అనడం అవివేకం అన్నారు. దేవాలయ అభివృద్ధికి వ్యతిరేకం కాదు, ఇప్పటివరకు ఎలాంటి ప్లాన్ లేకుండానే ఆలయాన్ని మూసివేస్తామని అనడం సమంజసం కాదు అన్నారు. అభివృద్ధిని అడ్డుకుంటామని ముందుగానే కోర్టు ద్వారా కెవిట్ నోటిస్ ఎలా ఇస్తారని ఆయన ప్రశ్నించారు. దేవాలయ అభివృద్ధి ఏ డిపార్ట్మెంట్ చేస్తుందో వెల్లడించాలని, దేవాలయ అభివృద్ధి ఫైనల్ ప్లాన్ ను ప్రజలకు తెలియజేయాలని, దేవాలయంలో జరిగిన అన్ని ధర్మశాలలకు ఎలాంటి పర్మిషన్ లేదని, అన్ని నిర్మాణాలపై కోర్టుకు వెళ్తామన్నారు. అభివృద్ధిలో భాగంగా దేవాలయంలో లోపలి ఇలాంటి దేవత విగ్రహాలను ముట్టుకున్న ఊరుకునేది లేదు అని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ పట్టణ బిజెపి అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్, సన్నిధి వెంకట కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న గోశాలలో వర్షానికి తడిసిన గడ్డిని పరిశీలించిన ఆలయ ఈవో. వినోద్ రెడ్డి.



**వేములవాడ టౌన్,( ప్రజాబలం ),** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి గోశాలలో మంగళవారం కురిసిన భారీ వర్షానికి రాజన్న భక్తులు వితరణగా ఇచ్చిన వరిగడ్డి తడిసిపోవడంతో గురువారం రోజున ఆలయ అధికారులు, గోశాల సిబ్బంది, సేవా సమితి సభ్యులు చేస్తున్న పనిని వేములవాడ రాజన్న ఆలయ కార్యనిర్వాణా అధికారి వినోద్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించి, తడిచిన వరిగడ్డిని ఆరబెట్టి సంరక్షించే ప్రయత్నం చేస్తున్నారు. భారీ వర్షంతో అధిక మొత్తంలో వరిగడ్డి తడిచిపోయింది. దీంతో వరిగడ్డిని ఆరబెట్టి టార్పాలిన్ కవర్లతో కప్పి సంరక్షించే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు. గోశాలలో నిల్వ ఉన్న వరిగడ్డి కట్టలను ఈవో పరిశీలించారు. ప్రస్తుతము గోశాలలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ఈ భారీ వర్షంతో గోశాలలోని గోవులకు ఇబ్బంది కలిగిన విషయం వాస్తవమేనని, ప్రతిరోజు వేములవాడ రాజన్న ఆలయమునకు సంబంధించిన రెండు గోశాలలో సిబ్బంది సమయపాలన పాటిస్తూ, పచ్చి గడ్డి మేతగా వేస్తూ గోవులను సంరక్షిస్తున్నారని ఈవో వినోద్ రెడ్డి తెలిపారు. గోశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత మరిన్ని సౌకర్యాలు కోడెలకు, గోవులకు అందుబాటులోకి వస్తాయన్నారు. గోశాలలో ఇబ్బందులు, వర్షాభావం నేపథ్యంలో వర్షం నీటిని తొలగించి, బురద సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. అధిక సంఖ్యలో పలు సేవా సమితి సభ్యులు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## రాజన్నను దర్శించుకున్న తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి.



**వేములవాడ టౌన్,( ప్రజాబలం ),** గురువారం రోజున తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్నారు.

ముందుగా ఆలయ అర్చకులు ఎన్నికల కమిషనర్ కు పూర్ణకుంభంతో స్వాగతం పలికినారు.

స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కళ్యాణమండపంలో అర్చకులు ఆశీర్వదించగా, రాజన్న ఆలయ కార్య నిర్వహణ అధికారి కే. వినోద్ రెడ్డి శేష వస్త్రం కప్పి లడ్డు ప్రసాదం అందజేశారు.

ఈ కార్యక్రమంలో వేములవాడ తాసిల్దార్ విజయ్ ప్రకాష్ రావు ప్రోటోకాల్ ఏఈఓ జి. అశోక్ కుమార్, ఆలయ పర్యవేక్షకులు వరి.నరసయ్య, ఆలయ ఇన్స్పెక్టర్ నూగురి. నరేందర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వట్టిమర్తిలో ఎల్లమ్మ బోనాల సంబరాలు - బోనమెత్తిన ప్రియదర్శిని మేడి



చిట్యాల, మే 29మండలంలోని వట్టిమర్తి గ్రామంలో ఎల్లమ్మ పండుగ ను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రజలందరూ బోనాల సమర్పించి సంబరాలు చేసుకున్నారు. ఈ బోనాల పండుగ సందర్భంగా రీషారియా ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రియదర్శిని మేడి గ్రామ ప్రజలతో కలిసి బోనమెత్తి గ్రామంలోని ఆడపడుచులతో కలిసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ప్రియదర్శిని మేడి మాట్లాడుతూ ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామ ఆడపడుచులందరూ, ప్రజలు, కుటుంబాలన్నీ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుతూ ఎల్లమ్మ తల్లికి బోనం సమర్పించామని అన్నారు.

## వేములవాడ రాజన్న ఆలయం మూసివేత ప్రచారాన్ని నమ్మవద్దు. రాజన్న ఆలయ ఈవో కే. వినోద్ రెడ్డి.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయాన్ని జూన్ 15వ తేదీ 2025 నుండి మూసివేస్తున్నారని బుధవారం రోజున సోషల్ మీడియాలో వచ్చిన వార్తలు అవాస్తవమని రాజన్న ఆలయ ఈవో కె. వినోద్ రెడ్డి గురువారం మీడియాకి తెలిపారు. వేములవాడ రాజన్న ఆలయం మూసివేత పై కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు జరుగుతున్నాయి అన్నారు. రాజన్న భక్తులు ఎవరు ఈ వార్తలను నమ్మవద్దని, సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయవద్దని ఆలయ ఈవో వినోద్ రెడ్డి కోరారు. వేములవాడ రాజన్న ఆలయం గురించి ఎలాంటి సమాచారం అయినా అఫీషియల్ గా దేవాదాయ శాఖ నుంచి కానీ ఆలయ అధికారుల నుంచి వచ్చే సమాచారాన్ని భక్తులు విశ్వసించాలని, ఎవరు కూడా సోషల్ మీడియాలో వస్తున్న అవాస్తవాలను విశ్వసించవద్దన్నారు.

## జై జవాన్, జై కిసాన్ అనే నినాదాన్ని నిజం చేస్తున్న బీజేపీ సర్కార్కు కృతజ్ఞతలు.

### వేములవాడ పట్టణం బిజెపి అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** వేములవాడ పట్టణ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఖరీఫ్ పంటలకు మద్దతు ధర పెంచిన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన బిజెపి పట్టణ అధ్యక్షులు రాపల్లి శ్రీధర్ మాట్లాడుతూ జై జవాన్, జై కిసాన్ నినాదాన్ని నిజం చేస్తూ బుధవారం రోజున ఖరీఫ్ పంటలకు మద్దతు ధర పెంచడం సంతోషదాయకమన్నారు. అలాగే మన దేశ జవాన్లకు మద్దతుగా యుద్ధ పరికరాలు సమకూర్చి ఆపరేషన్ సింధూర్ సక్సెస్ కు పునాదులు వేయడాన్ని గుర్తు చేశారు. కిసాన్ మోర్చా అధ్యక్షుడు మామిళ్ల లక్ష్మీరాజ మాట్లాడుతూ ఖరీఫ్ పంటలకు మద్దతు ధరలు పెంచడంతో మోడీకి క్షీరాభిషేకం చేయడం జరిగింది అన్నాడు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కృష్ణస్వామి, అన్నం నరసయ్య, బిల్లా కృష్ణ హరి, నేరెళ్ల సాయి, బుర్ర మనీష్, కొన్నాళ్ల రఘుపతి బిజెపి నాయకులు రైతులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల జాతరను విజయవంతం చేద్దాం.

### జర్నలిస్టు ఫోరం రజతోత్సవ సభకు పెద్ద సంఖ్యలో తరలి రావాలి.

### ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో గోడ పత్రిక ఆవిష్కరణ.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం),** తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో పురుడు పోసుకున్న తెలంగాణ జర్నలిస్టు ఫోరం రజతోత్సవాలను జయప్రదం చేద్దామని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ ( హెచ్ 143) రాష్ట్ర ఉపాధ్యక్షులు, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా పిలుపునిచ్చారు. వేములవాడ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ జర్నలిస్టు ఫోరం ఆవిర్భవించి మే 31వ తేదీతో 25వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా హైదరాబాదులోని జలవిహార్ లో నిర్వహిస్తున్న సంబరాల సభకు రాజన్న సిరిసిల్ల జిల్లా నుండి పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు తరలి రావాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో తెలంగాణ జర్నలిస్టు ఫోరం నిర్వహించిన చరితాత్మక పాత్రను తెలియజేయడం కోసం మే 31న టీజేఎఫ్ రజతోత్సవాల నిర్వహిస్తుందని తెలిపారు. తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు నినాదంతో 2001 మే 31వ తేదీన ఆవిర్భవించిన తెలంగాణ జర్నలిస్టు ఫోరం తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు2014 వరకు అన్ని వర్గాల ప్రజలను, ఉద్యమ సంఘాలను సంఘటితం చేసిన ఘనత టీజేఎఫ్ అల్లం నారాయణలతోపాటు యావత్ తెలంగాణ జర్నలిస్టుల కృషి అని గుర్తు చేశారు. ఇంతటి చారిత్రిక నేపథ్యం కలిగిన జర్నలిస్టు ఫోరం రజతోత్సవ సంబరాలకు రాజన్న సిరిసిల్ల జిల్లా నుండి జర్నలిస్టులు అధిక సంఖ్యలో తరలివచ్చి, జర్నలిస్టుల జాతరను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మమ్మద్ రఫీ, ప్రధాన కార్యదర్శి ఆయాచితుల జితేందర్ రావు, ఉపాధ్యక్షులు సయ్యద్ అలీ, జిల్లా రమేష్, దేవరాజ్, ప్రచార కార్యదర్శి షేక్ రియాజ్, కోడం గంగాధర్, హరీష్, విష్ణు, రాజేందర్, వెంకటేష్, ఇమ్రాన్, పాహాద్ పాషా, సల్మాన్, శ్యామ్, షోయబ్ లతోపాటు కార్యవర్గ సభ్యులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యను పరిష్కరిస్తాం

## టీయూడబ్ల్యూజే వినతికి స్పందించిన మంత్రులు



కరీంనగర్ ప్రజాబలం ప్రతినిధి:ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని ముగ్గురు క్యాబినెట్ మంత్రులు హామీ ఇచ్చారు. ఈరోజు కరీంనగర్ లో మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి ,శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ లకు టీయూడబ్ల్యూజే హెచ్ 143 కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు చెరుకు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో జర్నలిస్టులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ తప్పకుండా త్వరలోనే జర్నలిస్టుల ఇళ్ల సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు చెరుకు గోపాలకృష్ణ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్ రూమ్ స్కీం,బిపిఎల్ కింద కరీంనగర్ లోని జర్నలిస్టులకు కేటాయించిన ఇళ్ల స్థలాలు ఎస్సారెస్పీకి చెందినవి కావడంతో ఎన్ఓసి సమస్యతో సహా ఇతర ఇబ్బందుల కారణంగా ఇళ్ల నిర్మాణం చేపట్టలేని పరిస్థితి నెలకొని ఉందన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని, అలాగే గతంలో స్థలాలు పొందని అర్హులైన జర్నలిస్టులకు కూడా ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని తమ వినతి పత్రంలో మంత్రులను కోరారు. సమాజంలో సత్యాన్ని వెలికి తీసే జర్నలిస్టులు తమ కుటుంబాలకు స్థిరమైన గృహం కోసం ఎదురుచూస్తున్నారని, మంత్రులు ఇచ్చిన హామీ ప్రకారం ఈ సమస్య త్వరలోనే పరిష్కారం అవుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజే నాయకులు రిషికేష్, తదితరులు పాల్గొన్నారు

# జూన్ 4 నుండి16 వరకు భూభారతి సదస్సులు

## -మండల తహసిల్దార్ పనకంటి సతీష్ కుమార్




ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గం రిపోర్టర్ మే 29 :మందమర్రి మండల పరిధిలోని రైతులకు జూన్ 4 నుండి 19 వరకు ఆయా గ్రామాలలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు భూ సమస్యలపై భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు మందమర్రి తహసిల్దార్ పనకంటి సతీష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 4, 5 తేదీలలో పొన్నారం, చిర్రకుంట గ్రామపంచాయతీ కార్యాలయంలో 6, 9 న వెంకటాపూర్, మామిడిగట్టు గ్రామపంచాయతీలో 10, 11 న లేమూరు, సారంగపల్లి గ్రామపంచాయతీలో 12, 13 న క్యాతనపల్లి ఎంపీపీ పాఠశాలలో, తిమ్మాపూర్ రైతు వేదికలో 16, 17 న అమరవాది ఎంపీపీ పాఠశాలలో, అందుగుల పేట గ్రామ పంచాయితీ లో 18,19 న ఊరు మందమర్రిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు తమ భూ సమస్యలపై పైన తెలుపబడిన తేదీలలో సంబంధిత గ్రామాల యందు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి

## జిల్లా పాలనాధికారి రాజర్షి షా



అదిలాబాద్ జిల్లా ప్రజాబలం ప్రతినిధి: గురువారం జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా పాలనాధికారి సంబంధిత అధికారులను ఆదేశించారు.

గురువారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ రాజర్షి షా కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో సమావేశం నిర్వహించారు

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ప్రభుత్వ ఆదేశాలమేరకు జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు ఆయా శాఖలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలని ఆన్నారు.

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను పురస్కరించుకుని సాయంత్రం 4.00 గంటలకు కల్చరల్ ప్రోగ్రాం ఏర్పాటు తో పాటు రాజీవ్ యువ వికాసం పథకం లో భాగంగా అదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల వారీగా లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేయడం జరుగుతుందని అన్నారు.అలాగే అన్ని జంక్షన్ లో, కలెక్టరేట్ , తదితర ప్రాంతాలలో విద్యుత్ దీపాలతో అలంకరించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, rdo వినోద్ కుమార్, ఆయా శాఖల జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి వైద్య విభాగానికి ఏటా 400 కోట్ల వ్యయం

## -సింగరేణి వైద్యులు మీ సామర్థ్యం నిరూపించుకోండి

## -సింగరేణి సి అండ్ ఎండీ ఎన్.బలరాం



ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ మే 29 :సింగరేణి కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు వైద్య సేవలు అందించడం కోసం ఖర్చుకు వెనకాడకుండా అన్ని రకాల వైద్య పరీక్షల యంత్రాలు, ఔషధాలు సమకూర్చటానికి యాజమాన్యం సంసిద్ధంగా ఉందని ఇప్పటికే పలుమార్లు చెప్పానని, అయినప్పటికీ కొన్ని ఏరియా ఆసుపత్రుల నుండి ప్రతిపాదనలు పంపడంలో ఎందుకు శ్రద్ధ వహించడం లేదని సింగరేణి వైద్య శాఖపై సి అండ్ ఎండీ ఎన్.బలరామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని ఏరియా ఆసుపత్రుల ప్రధాన వైద్యాధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏరియా ఆసుపత్రుల యాజమాన్యాలు తక్షణమే వారికి కావలసి ఉన్న కనీస వైద్య పరికరాలు, అవసరమైన మందుల ప్రతిపాదనలు పంపించాలని, తన తదుపరి తనిఖీలలో ఏ ఒక్క పరికరం లేదు అనే మాట రాకూడదని హెచ్చరించారు. వార్షిక ప్రణాళిక పేర్లతో సంబంధం లేకుండా ఎప్పటికప్పుడు ఏ ఏ పరికరాలు కావాలన్నది నిర్ధారించుకొని ప్రతిపాదనలు పంపించాలన్నారు. ఇప్పటికే ఏరియా ఆసుపత్రులకు వైద్యుల్ని కేటాయించామని, ఇంకా అవసరమైన వైద్యుల్ని, టెక్నీషియన్ లను సమకూర్చేందుకు యాజమాన్యం సంసిద్ధంగా ఉందన్నారు.

చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు ఉన్న రోగులకు ఏరియా ఆసుపత్రుల్లో వైద్యం అందించే అవకాశం ఉన్నప్పటికీ అలా చేయకుండా వెంటనే హైదరాబాద్ ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారని, తద్వారా గత మూడేళ్లలో 30 కోట్ల రూపాయలు ఉన్న రిఫరల్ బిల్లులు ఇప్పుడు రూ100 కోట్లకు చేరాయి అన్నారు. కంపెనీ డాక్టర్లు తమ సమర్థతను, నైపుణ్యాన్ని చూపించకుండా ప్రతి చిన్న కేసును రిఫర్ చేయడం ఆశ్చర్యం కలిగిస్తుంది అన్నారు. డాక్టర్లు అంకితభావంతో వైద్య సేవలు అందించాలని, విధి నిర్వహణలో పూర్తి క్రమశిక్షణ పాటించాలని ఆయన కోరారు. సింగరేణి ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణ కోసం యాజమాన్యం ఏటా 400 కోట్ల రూపాయలను వెచ్చిస్తోంది. ఆసుపత్రులను ఆధునీకరిస్తోందని తెలిపారు. హైదరాబాద్ లోనూ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో సింగరేణి లో పనిచేస్తున్న వైద్యులంతా పూర్తి అంకిత భావంతో పనిచేయాలని, కార్మికుల నమ్మకాన్ని గెలుచుకోవాలని సూచించారు.

గతంలో వైద్య సేవలకు నిధుల మంజూరులో అనేక ఆటంకాలు ఉండేవని, కానీ ఇప్పుడు ఎటువంటి కోతలు, తగ్గింపులు లేకుండా నిధులు మంజూరు చేయటానికి యాజమాన్యం సిద్ధంగా ఉందని, ఈ సానుకూల దృక్పథాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత ఆసుపత్రుల యాజమాన్యాలపై ఉందని డైరెక్టర్ పేర్కొన్నారు. కాగా కోవిడ్ వ్యాప్తి జరిగినట్లయితే దానిని ఎదుర్కొనేందుకు అన్ని ఏరియా ఆసుపత్రుల్లో తగిన విధంగా సంసిద్ధమై ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు డి.సత్యనారాయణ రావు(ఈ అండ్ ఎం), ఎల్వీ సూర్యనారాయణ రావు (ఆపరేషన్స్), కె.వేంకటేశ్వర్లు (పి%ప%పి,పా), ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ ఎస్.డి.ఎం.సుభానీ, జీఎం(మార్కెటింగ్) ఎన్.వి.రాజశేఖరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ రాజ్ కుమార్, అన్ని ఏరియా ఆసుపత్రుల ముఖ్య అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పులిపాటి ప్రసాద్ పుట్టినరోజు సందర్భంగా హెూలీ స్పిరిట్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పసలపూడి రమేష్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం



ఖమ్మం ప్రతినిధి మే 28 (ప్రజాబలం) ఖమ్మం కర్ణ గిరి చర్చి ప్రాంగణంలో హెూలీ స్పిరిట్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పులిపాటి ప్రసాద్ జన్మదిన వేడుకలను ఆత్మీయ సేవకుల మధ్యలో ఘనంగా నిర్వహించారు . అనంతరం కేక్ కట్ చేసి బర్త్ శుభాకాంక్షలు తెలిపి ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు . ఈ సందర్భంగా మానవతా దృక్పథంతో హెూలీ స్పిరిట్ ట్రస్ట్ చైర్మన్ పసలపూడి రమేష్ ద్వారా ఐటీడీఏ రోడ్డు ప్రమాదంలో మరణించిన ఇసునూరి నాగేశ్వరావు కుటుంబ సభ్యులకు 5,000/- రూపాయల ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో పులిపాటి ప్రసాద్ చేతుల మీదుగా అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో పాస్టర్ ఫెలోషిప్ మహాసేన ఖమ్మం జిల్లా అధ్యక్షుడు మంద సంజీవరావు పి ఎస్ ఐ దానియేలు యూసఫ్ శరత్ పాల్ యేసయ్య ఏసోబు అనేక మంది సేవకులు పాల్గొన్నారు .

# మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ..

# కుంజాం హిడ్మా అరెస్టు

భువనేశ్వర్ మే 29 మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ అయిన ఘటన మరువక ముందే.. మరో కీలక నేతను ఒడిశా పోలీసులు అరెస్టు చేశారు. ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లాలోని జనగూడకు చెందిన కుంజాం హిడ్మాను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఒడిశా పోలీసులు, డిస్ట్రిక్ వాలంటరీ ఫోర్స్ బృందాలు ప్రత్యేక ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో బోయిపరిగూడ పోలీసు స్టేషన్ పరిధిలోని పెటగూడ గ్రామ సమీపంలోని అడవుల్లో హిడ్మాను పోలీసులు అరెస్టు చేశారు. ఈ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారని పక్కా సమాచారం అందడంతోనే.. పోలీసులు అక్కడ కూంబింగ్ నిర్వహించినట్లు ఉన్నతాధికారులు పేర్కొన్నారు.కూంబింగ్ నిర్వహిస్తుండగా పోలీసులకు మావోయిస్టులు తారసపడ్డారు. దీంతో మావోయిస్టులకు, పోలీసు బలగాలకు మధ్య ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. అయితే చాలా మంది మావోయిస్టులు అక్కడినుంచి పారిపోయారు. మావోయిస్టు కుంజాం హిడ్మా మాత్రం అక్కడున్న చెట్ల పొదల్లో తలదాచుకున్నాడు. పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత అతను హార్డ్‌కోర్ మావోయిస్టు హిడ్మా అని పోలీసుల విచారణలో తేలింది.కుంజాం హిడ్మా ప్రస్తుతం ఏరియా కమిటీ మెంబర్‌గా కొనసాగుతున్నారు. హిడ్మా నుంచి ఏకే 47 రైఫిల్, 35 రౌండ్ల బుల్లెట్లు, 27 ఎలక్ట్రానిక్ డిటోనేటర్లు, 90 నాన్ ఎలక్ట్రిక్ డిటోనేటర్లు, 2 కేజీల గన్ పౌడర్, రెండు స్టీల్ కంటైనర్లు, రెండు రేడియోలు, ఒక ఐయర్ ఫోన్, వాకిటాకీ, బ్యాటరీ, రెండు కత్తులు, గొడ్డలి, నాలుగు టార్చ్ లైట్లు, ఒక పాలిథీన్ కవర్, మావోయిస్టు సాహిత్యానికి సంబంధించిన పుస్తకాలు లభించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com